रीजिस्ट्री सं डी--२२१
Registered No. D-221
రిజిస్ట్రీ సంఖ్య డి--221

मूल्य रु 5.00 पैसे
[Price Rs. 5.00 Paise.
మూల్యము : రూ. 5.00 పైసలు.

# भारत का राजपत्र
# The Gazette of India
# భారత రాజపత్రము

असाधारण
**EXTRAORDINARY**
అసాధారణ

भाग XVI अनुभाग 1
**Part XVI Section 1**
భాగము XVI అనుభాగము 1

प्राधिकार से प्रकाशित
**PUBLISHED BY AUTHORITY**
ప్రాధికారము ద్వారా ప్రచురింపబడినది



| | | | | |
|---|---|---|---|---|
| सं. १ | नई दिल्ली | गुरुवार | १७ नवंबर, १९९५ / १५ कार्तीक, १९१५ शख | खंड ९ |
| No. 1 | New Delhi | Thursday | 17th November, 1994 / 14th Karthika, 1915 Saka | Vol. 9 |
| సంఖ్య 1 | న్యూఢిల్లీ | గురువారము | 17 నవంబర్, 1994 / 14 కార్తీక, 1915 శక | సంపుటము. 9 |



## MINISTRY OF LAW AND JUSTICE
## (LEGISLATIVE DEPARTMENT)

*New Delhi, 12th January, 1994 / 14th Karthika, 1915 Saka*

The Translations in Telugu of the following, namely :-

(1) The Indian Contracts Act, 1872 (Act No. 9 of 1872) and (2) The Emigration Act, 1983 (Act No. 31 of 1983) are hereby published under the authority of the President and shall be deemed to be the Authoritative Texts thereof in Telugu under Clause (a) of Section 2 of the Authoritative Texts (Central Laws) Act, 1973 (Act 50 of 1973).

శాసన మరియు న్యాయపాలన మంత్రిత్వశాఖ

(శాసన నిర్మాణ విభాగము)

*న్యూఢిల్లీ, 12 జనవరి, 1994 / 14 కార్తీక, 1915 శక*

ఈ క్రింది చట్టములు: అనగా:--

(1) ది ఇండియన్ కాంట్రాక్టు యాక్టు 1872 (1872 లోని 9వ చట్టము) మరియు (2) ది ఎమిగ్రేష 1983 (1983 లోని 31వ చట్టము) యొక్క తెలుగు అనువాదములు రాష్ట్రపతి ప్రాధికారము క్రింద ఇందు ప్రచురించబడుచున్నవి. ఇది ఆ చట్టములకు, ప్రాధికృత పాఠముల (కేంద్ర శాసనముల) చట్టము, 1973 (1973 లోని 50 యొక్క 8వ పరిచ్ఛేదములోని ఖండము (ఏ) క్రింద, ప్రాధికృత తెలుగు పాఠమైనట్లు భావించవలెను.

# భారత కాంట్రాక్టు చట్టము, 1872

(1872 లోని 9వ చట్టము)

(25 ఏప్రిల్, 1872)

కాంట్రాక్టులకు సంబంధించిన శాసనములోని కొన్ని భాగములను వివరించి ప్రస్తావన.
సవరించుట ఉపయుక్తమైనందున;

ఇందుమూలముగా ఈ క్రింది విధముగా శాసనము చేయడమైనది:-

## ప్రారంభిక

1. ఈ చట్టమును భారత కాంట్రాక్టు చట్టము, 1872 అని పేర్కొన సంగ్రహనామము.
వచ్చును.

ఇది జమ్మూ, కాశ్మీరు రాజ్యము మినహా యావత్ భారత దేశమునకు విస్తరణ.
విస్తరించును; ఇది 1872, సెప్టెంబరు మొదటి దినమున అమలులోనికి వచ్చును. ప్రారంభము.

ఇందులో నున్నదేదియు, ఈ చట్టపు నిబంధనలకు అననుగుణముగా వ్యావృత్తి.
లేనట్టి, ఇందుమూలముగా అభివ్యక్తముగా రద్దుచేయబడని ఏదేని అధిశాసనము (స్టేట్యూట్) చట్టము, లేక వినియమము యొక్క నిబంధనలకు గాని, వ్యాపార సంబంధమైన ఏదేని వాడుకకు లేక ఆచారమునకు గాని, లేక ఏదేని కాంట్రాక్టు యొక్క ఏదేని ప్రసంగతికి గాని భంగము కలిగించదు.

2. ఈ చట్టములో సందర్భమునుబట్టి తద్విరుద్ధమైన ఉద్దేశము కాన్పించి అర్థాన్వయ
ననే తప్ప, ఈ క్రింది పదములు, పద బంధములు ఈ క్రింది అర్థములో ఖండము.
ఉపయోగింపబడినవి:-

(ఏ) ఒక వ్యక్తి దేనినైనను చేయుటకు లేక చేయకుండుటకు మరొకరి అనుమతిని పొందు ఉద్దేశముతో, అట్టి కార్యమును చేయుటకు, లేక చేయకుండుటకు తన ఇష్టమును ఆ మరొకరికి తెలియజేసినప్పుడు అతడు ఒక ప్రతిపాదన చేసినాడని చెప్పబడును;

(బీ) ఎవరికి ఆ ప్రతిపాదన చేయబడినదో ఆ వ్యక్తి దానికి తన సమ్మతిని తెలియచేసినప్పుడు ఆ ప్రతిపాదన అంగీకరించబడినట్లు చెప్పబడును. ప్రతిపాదన అంగీకరింపబడినప్పుడు అది ఒక వాగ్దానమగును;

(సీ) ప్రతిపాదన చేయు వ్యక్తి "వాగ్దాత" అనబడును. ఆ ప్రతిపాదనను అంగీకరించు వ్యక్తి "వాక్గ్రహీత" అనబడును;

(డీ) వాగ్దాత కోరికపై వాక్గ్రహీతగాని ఎవరేని ఇతర వ్యక్తిగాని దేనినైనను చేసినప్పుడు లేక చేయకుండినప్పుడు, లేక చేయునప్పుడు లేక చేయకుండునప్పుడు, లేక చేయుదునని లేక చేయకుందునని వాగ్దానము చేసినప్పుడు అట్లు చేయుట, లేక చేయకుండుట, లేక వాగ్దానము చేయుట ఆ వాగ్దానమునకు ప్రతిఫలము అనబడును;

(ఈ) ప్రతియొక వాగ్దానము మరియు ఒకదానికొకటి ప్రతిఫలము అగునట్టి ప్రతియొక వాగ్దానముల సముదాయము ఒక కరారు అగును;

(ఎఫ్) ఒకదానికొకటి ప్రతిఫలము లేక ప్రతిఫల భాగము అగునట్టి వాగ్దానముల పరస్పర వాగ్దానము అనబడును;

(జి) శాసనరీత్యా అమలుపరచజాలని కరారు చెల్లనిదనబడును;

(హెచ్) శాసనరీత్యా అమలుపరచదగు కరారు కాంట్రాక్టు అగును;

(ఐ) కరారు పక్షకారులలో ఒకరి, లేక అంతకెక్కువ మంది అభిమతానుసారము ఆ కరారు శాసనరీత్యా అమలుపరచదగినదైయుండి, ఇతరుని, లేక ఇతరుల అభిమతానుసారము అమలుపరచజాలని కరారు చెల్లనిదిగ చేయదగిన కాంట్రాక్టు అగును;

(జే) శాసనరీత్యా అమలుపరచజాలకుండ పోయిన కాంట్రాక్టు, అది అమలుపరచజాలనిదైనప్పుడు చెల్లనిదగును.

## అధ్యాయము - I

## ప్రతిపాదనల సంసూచన, అంగీకరణ మరియు ప్రతిసంహారణలను గూర్చి

ప్రతిపాదనల సంసూచన, అంగీకరణ మరియు ప్రతిసంహారణ.

3. ప్రతిపాదనల సంసూచన, ఆ ప్రతిపాదనల అంగీకరణ మరియు ప్రతిపాదనల యొక్కయు అంగీకరణల యొక్కయు ప్రతిసంహారణ, క్రమముగా ప్రతిపాదించు, అంగీకరించు లేక ప్రతిసంహరించు పక్షకారు అట్టి ప్రతిపాదనను, అంగీకరణను లేక ప్రతిసంహారణమును దేని ద్వారా సంసూచించుటకు ఉద్దేశించునో లేక సంసూచించు ప్రభావము దేనికి కలదో అట్టి ఏదేని కార్యము లేక కార్యదోషము వలన చేయబడినట్లు భావింపబడును.

సంసూచన ఎప్పుడు పూర్తి అగును.

4. ప్రతిపాదన ఎవరికి చేయబడినదో ఆ వ్యక్తికి అది తెలియవచ్చినప్పుడు దాని సంసూచన పూర్తి అగును.

అంగీకరణ యొక్క సంసూచన—

ప్రతిపాదకునికి సంబంధించి, అంగీకరణదారు యొక్క అధికారాధీనములో లేకుండా పోయినట్లు అది ప్రతిపాదకునికి అందజేయు మార్గానుక్రమములో పెట్టబడినపుడు;

అంగీకరణదారుకు సంబంధించి, అది ప్రతిపాదకునికి తెలియవచ్చినపుడు;

పూర్తి అగును.

ప్రతిసంహారణ యొక్క సంసూచన—

దానిని చేయు వ్యక్తికి సంబంధించి, దానిని చేయు వ్యక్తియొక్క అధికారాధీనములో లేకుండ పోవునట్లు, అది ఎవరికి చేయబడినదో ఆ వ్యక్తికి అందజేయు మార్గానుక్రమములో పెట్టబడినపుడు;

అది ఎవరికి వేయబడినదో ఆ వ్యక్తికి సంబంధించి, అది అతనికి తెలియ వచ్చినపుడు;

పూర్తి అగును.

## ఉదాహరణములు

(ఏ) ఒక ఇంటిని నిశ్చిత ధరకు 'బీ'కి విక్రయించుటకై 'ఏ' జాబు ద్వారా ప్రతిపాదించును.

'బీ'కి ఆ జాబు అందినప్పుడు ప్రతిపాదన యొక్క సంసూచన పూర్తి అగును.

(బీ) 'బీ' టపాలో పంపిన జాబు ద్వారా 'ఏ' యొక్క ప్రతిపాదనను అంగీకరించును.

అంగీకరణ యొక్క సంసూచన–

'ఏ'కు సంబంధించి, జాబు టపాలో వేసినప్పుడు;

'బీ'కి సంబంధించి 'ఏ' ఆ జాబును అందుకొనినప్పుడు; పూర్తి అగును.

(సీ) 'ఏ' తంతి ద్వారా తన ప్రతిపాదనను ప్రతిసంహరించును.

'ఏ'కు సంబంధించి, తంతిని పంపినపుడు ప్రతిసంహరణ పూర్తి అగును. 'బీ'కి సంబంధించి, 'బీ' దానిని అందుకొనినపుడు అది పూర్తి అగును.

'బీ' తన అంగీకరణను తంతి ద్వారా ప్రతిసంహరించును. 'బీ' యొక్క ప్రతిసంహరణ 'బీ'కి సంబంధించి, తంతిని పంపినపుడు, 'ఏ'కు సంబంధించి, అది అతనికి చేరినప్పుడు, పూర్తి అగును.

5. ఒక ప్రతిపాదనను, దాని అంగీకరణ యొక్క సంసూచన ప్రతిపాదకునికి సంబంధించి పూర్తి అగుటకు పూర్వము ఎప్పుడైనను ప్రతిసంహరించవచ్చును; ఆ తరువాత కాదు. ప్రతిపాదనలను అంగీకరణలను, ప్రతిసంహరించుట.

ఒక అంగీకరణను, అంగీకరణ యొక్క సంసూచన అంగీకరణదారుకు సంబంధించి పూర్తి అగుటకు పూర్వము ఎప్పుడైనను ప్రతిసంహరించవచ్చును. ఆ తరువాత కాదు.

## ఉదాహరణములు

'ఏ' తన ఇంటిని 'బీ'కి విక్రయించుటకు టపాలో పంపిన జాబు ద్వారా ప్రతిపాదించును.

'బీ' టపాలో పంపిన జాబు ద్వారా ఆ ప్రతిపాదనను అంగీకరించును.

'బీ' తన అంగీకరణ జాబును టపాలో వేయుటకు పూర్వము ఎప్పుడైనను, లేక టపాలో వేయు క్షణముననైనను 'ఏ' తన ప్రతిపాదనను ప్రతిసంహరింప వచ్చును. ఆ తర్వాత కాదు.

'బీ' యొక్క అంగీకరణను సంసూచించు జాబు 'ఏ'కు చేరుటకు పూర్వము ఎప్పుడైనను లేక చేరు క్షణముననైనను 'బీ' తన అంగీకరణను ప్రతిసంహరించవచ్చును. ఆ తర్వాత కాదు.

**ప్రతిసంహరణ ఎట్లు చేయబడును.**

6. ఒక ప్రతిపాదన–

(1) ప్రతిపాదకుడు ప్రతిసంహరణ నోటీసును రెండవ పక్షకారుకు సంసూచించుట ద్వారా;

(2) అంగీకరణ సంసూచింపబడకయే అట్టి ప్రతిపాదనలో దాని అంగీకరణ కొరకు విహితపరచిన గడువు దాటిపోయినందువలన, లేక గడువేదియు అట్లు విహితపరచబడనిచో యుక్తమైన గడువు దాటిపోయినందువలన;

(3) అంగీకరణకు గల పూరోభావన షరతును అంగీకరణదారు పూర్తి చేయనందువలన; లేక

(4) ప్రతిపాదకుడు మరణించినందువలన లేక ఉన్మత్తుడైనందు వలన, అతడు మరణించిన లేక ఉన్మత్తుడైన సంగతి అంగీకరణదారుకు అంగీకరించుటకు పూర్వము తెలియవచ్చినచో,–

ప్రతిసంహరించబడినదగును.

**అంగీకరణ సంపూర్ణమైనదై యుండవలెను.**

7. ప్రతిపాదనను వాగ్దానముగా మార్చుటకుగాను అంగీకరణ–

(1) సంపూర్ణమైనదై, షరతురహితమైనదై యుండవలెను;

(2) ప్రతిపాదనను అంగీకరించవలసిన రీతిని అందు విహితపరచిననే తప్ప, ఏదో ఒక మామూలు మరియు యుక్తమైన రీతిలో అభివ్యక్తము చేయబడవలెను. ప్రతిపాదనను అంగీకరించవలసిన రీతిని అందు విహితపరచియుండి అంగీకరణ అట్టి రీతిలో జరుగనిచో అంగీకరణ తనకు సంసూచింపబడిన పిమ్మట యుక్తమైన గడువు లోపల ప్రతిపాదకుడు తన ప్రతిపాదనను విహితపరచిన రీతిలోనే అంగీకరించవలెననియు ఇతర విధముగా కాదనియు, పట్టుబట్టవచ్చును; కాని, అతడు అట్లు చేయనిచో అతడు ఆ అంగీకరణను అంగీకరించిన వాడగును.

**షరతులను నెరవేర్చుట లేక ప్రతిఫలమును పొందుట ద్వారా అంగీకరించుట.**

8. ప్రతిపాదన షరతులను నెరవేర్చుట, లేక పరస్పర వాగ్దానము కొరకు ప్రతిపాదనతోపాటు ఇవ్వజూపిన ఏదేని ప్రతిఫలమును స్వీకరించుట ప్రతిపాదనను అంగీకరించుట అగును.

**అభివ్యక్త మరియు గర్భిత వాగ్దానములు.**

9. ఏదేని వాగ్దానము యొక్క ప్రతిపాదన, లేక అంగీకరణ మాటలలో చేయబడినంతమేరకు ఆ వాగ్దానము అభివ్యక్తమైనదని చెప్పబడును. అట్టి ప్రతిపాదన లేక అంగీకరణ మాటలలోగాక అన్యథా చేయబడినంతమేరకు ఆ వాగ్దానము గర్భితమైనదని చెప్పబడును.

## అధ్యాయము – 2

## కాంట్రాక్టులను, చెల్లనివిగ చేయదగిన కాంట్రాక్టులను మరియు చెల్లని కరారులను గూర్చి

**ఏ కరారులు కాంట్రాక్టులగును.**

10. కరారులన్నియు, అవి కాంట్రాక్టు చేసికొనుటకు సమర్థతగల పక్షకారుల స్వేచ్ఛాయుత సమ్మతితో శాసనసమ్మత ప్రతిఫలము కొరకు శాసనసమ్మత

ఉద్దేశముతో చేయబడినవైయుండి, చెల్లనివని ఇందుమూలముగా అభివ్యక్తముగా ప్రఖ్యానింపబడనిదో, కాంట్రాక్టు అగును.

ఇందులో నున్నదేదియు, భారతదేశములో అమలునందుండి, ఇందు మూలముగా అభివ్యక్తముగా రద్దు చేయబడకయుండి, ఏదేని కాంట్రాక్టు వ్రాతలో నుండవలెననిగాని, సాక్షుల సమక్షమున చేయబడవలెననిగాని కోరెడి ఏదేని శాసనమును, లేక దస్తావేజుల రిజిస్ట్రీకరణకు సంబంధించిన ఏదేని శాసనమును భంగపరచదు.

11. తాను లోబడియున్న శాసనము ప్రకారము మెజారిటీ వయస్సుగలవాడై, మతిస్థిమితము కలవాడును, తాను లోబడియున్న ఏ శాసనమును బట్టియైనను కాంట్రాక్టు చేసుకొనుటకు నిరర్హుడు కానివాడును అయినట్టి ప్రతి వ్యక్తియు కాంట్రాక్టు చేసుకొనుటకు సమర్థుడైయుండును. కాంట్రాక్టు చేసుకొనుటకు ఎవరు సమర్థులు.

12. ఒక వ్యక్తి తాను కాంట్రాక్టు చేసుకొను సమయమున దానిని అర్థము చేసుకొని, తన హితములపైపడగల దాని ప్రభావమును గూర్చి యుక్తమైన నిర్ణయమును ఏర్పరచుకొనగల శక్తికలిగియున్నచో అతడు ఆ కాంట్రాక్టు చేసుకొను నిమిత్తము మతిస్థిమితము కలవాడని చెప్పబడును. కాంట్రాక్టు చేసుకొను నిమిత్తము మతిస్థిమితము అనగా ఏమిటి?

మామూలుగా మతిస్థిమితము లేనివాడైయుండి అప్పుడప్పుడు మతి స్థిమితము కలిగియుండు వ్యక్తి, మతిస్థిమితము కలిగియున్నపుడు కాంట్రాక్టు చేసుకొనవచ్చును.

మామూలుగా మతిస్థిమితము కలవాడైయుండి అప్పుడప్పుడు మతి స్థిమితము లేనివాడుగ నుండు వ్యక్తి మతిస్థిమితము లేనివాడైయున్నపుడు కాంట్రాక్టు చేసుకొనరాదు.

## ఉదాహరణములు

(ఏ) ఉన్మాద చికిత్సాలయములోనున్నట్టి,- మధ్య మధ్య మతిస్థిమితము కలిగియుండు రోగి ఆ మధ్యకాలావధులలో కాంట్రాక్టు చేసుకొనవచ్చును.

(బీ) జ్వరము వలన మతిభ్రమణము కలిగియున్న లేక కాంట్రాక్టు నిబంధనలను అర్థము చేసుకోలేనంతగా గాని, తన హితములపైపడగల ఆ కాంట్రాక్టు ప్రభావమును గురించి యుక్తమైన నిర్ణయమును ఏర్పరచుకోలే నంతగాగాని, త్రాగుడు మత్తులో ఉన్న ఒక ఉన్మాది కానట్టి వ్యక్తి అట్టి మతి భ్రమణము, లేక త్రాగుడు మత్తు వుండునంతవరకు కాంట్రాక్టు చేసుకొనరాదు.

13. ఇద్దరు, లేక అంతకెక్కువ మంది వ్యక్తులు ఒకే విషయముపై ఒకే భావములో ఏకీభవించినపుడు వారు సమ్మతించినారని చెప్పబడును. 'సమ్మతి' నిర్వచనము.

14. సమ్మతించుట- "స్వేచ్ఛాయుత సమ్మతి" నిర్వచనము.

(1) 15వ పరిచ్ఛేదములో నిర్వచింపబడినట్టి పీడింపు వలన; లేక

(2) 16వ పరిచ్ఛేదములో నిర్వచింపబడినట్టి అనుచిత ఒత్తిడి వలన; లేక

(3) 17వ పరిచ్ఛేదములో నిర్వచింపబడినట్టి కపటము వలన; లేక

(4) 18వ పరిచ్ఛేదములో నిర్వచింపబడినట్టి అసత్యకథనము వలన; లేక

(5) 20, 21 మరియు 22వ పరిచ్ఛేదముల నిబంధనలకు లోబడి, పొరపాటు వలన;

జరిగినప్పుడు అది స్వేచ్ఛాయుత సమ్మతి అని చెప్పబడును.

అట్టి పీడింపు, అనుచిత ఒత్తిడి, కపటము, అసత్యకథనము లేక పొరపాటు లేకుండినచో అట్టి సమ్మతి ఈయబడకుండెడిదైనప్పుడు, సమ్మతించుట అందువలననే జరిగినదని చెప్పబడును!

"పీడింపు" నిర్వచనము.

15. "పీడింపు" అనగా ఏ వ్యక్తినైనను కరారు చేసికొనునట్లు చేయు ఉద్దేశముతో, భారత శిక్షా స్మృతి ద్వారా నిషేధింపబడిన ఏ కార్యమునైనను చేయుట లేక చేయుదునని బెదరించుట, లేక ఏ వ్యక్తికైనను, అతడెవరైనను, ప్రతికూల మగునట్లు ఏదేని ఆస్తిని శాసనవిరుద్ధముగా నిలిపి ఉంచుకొనుట లేక నిలిపి ఉంచుకొందునని బెదరించుట.

1860లో 45వది.

1860లో 45వది.

విశదీకరణము:- పీడింపు జరిగిన స్థలమున భారత శిక్షాస్మృతి అమలు నందున్నదా లేదా అను విషయము అప్రధానము.

## ఉదాహరణములు

లోతట్టు సముద్రములోనున్న ఒక ఆంగ్లేయ ఓడలోని 'ఏ' భారత శిక్షా స్మృతి క్రింద అపరాధికమైన జడిపింపు అగు ఒక కార్యము ద్వారా 'బీ'ని కరారు చేసుకొనునట్లు చేయును.

తరువాత 'ఏ' కాంట్రాక్టు భంగమునకై 'బీ'పై కలకత్తాలో దావా వేయును.

తన కార్యము ఇంగ్లండు శాసనము క్రింద అపరాధము కానప్పటికినీ మరియు అట్టి కార్యము చేయబడిన సమయమున మరియు ఆ స్థలమునందు భారత శిక్షా స్మృతి యొక్క 506వ పరిచ్ఛేదము అమలులో లేనప్పటికిని, 'ఏ' పీడింపునకు పాల్పడినాడు.

"అనుచితమైన ఒత్తిడి" నిర్వచనము.

16. (1) కాంట్రాక్టు పక్షకారుల మధ్యగల సంబంధములు ఆ పక్షకారులలో ఒకరు మరొకరి ఇచ్ఛపై ప్రాబల్యము కలిగియుండెడి స్థితిలో ఉండి, ఆ స్థితిని ఆ మరొకరిపై అనుచితమైన అనుకూల్యమును పొందుటకై ఉపయోగించిన యెడల ఆ కాంట్రాక్టు అనుచితమైన ఒత్తిడితో ప్రేరితమైనదని చెప్పబడును.

(2) ప్రత్యేకించియు, పైన చెప్పిన సూత్రము యొక్క వ్యాపకతకు భంగము వాటిల్లకుండను, ఒక వ్యక్తి మరొకరి ఇచ్ఛపై ప్రాబల్యమును కలిగి యుండు స్థితిలో నున్నట్లు భావించదగు సందర్భములు;

(ఏ) ఒక వ్యక్తి మరొకరిపై వాస్తవమైన లేక దృశ్యమానమైన ప్రాధికారము కలిగియున్నయెడల లేక మరొకరిపట్ల విశ్వాసాత్మక సంబంధము కలిగియున్నయెడల; లేక

(బీ) వయస్సు, రుగ్మత లేక మానసిక లేక శారీరక దురవస్థ కారణముగా మానసిక సామర్థ్యము తాత్కాలికముగాగాని, శాశ్వతముగాగాని లోపించి యున్న వ్యక్తితో, అతడు కాంట్రాక్టు చేసుకొనినయెడల;

(3) మరొకరి ఇచ్ఛపై ప్రాబల్యమును కలిగియుండు స్థితిలోవున్న వ్యక్తి ఆ మరొకరితో కాంట్రాక్టు చేసుకొన్నపుడు, మరియు ఆ వ్యవహారము స్థూల దృష్ట్యాగాని, ప్రవేశపెట్టబడిన సాక్ష్యముపై గాని, అన్యాయమైనదని కాన్పించి నపుడు అట్టి కాంట్రాక్టు అనుచితమైన ఒత్తిడివలన ప్రేరితము కాదని రుజువు చేయు భారము, ఆ మరొకరి ఇచ్ఛపై ప్రాబల్యము కలిగిన స్థితిలోవున్న వ్యక్తిపై ఉండును.

ఈ ఉపపరిచ్ఛేదములో నున్నదేదియు భారత సాక్ష్య చట్టము, 1872 లోని 111వ పరిచ్ఛేదపు నిబంధనలకు భంగము కలిగించదు. 1982లో 1వది.

ఉదాహరణములు

(ఏ) 'ఏ' తన కుమారుడైన 'బీ'కి మైనరుగా ఉన్న కాలములో కొంత డబ్బు అప్పుగా ఇచ్చి, అతడు యుక్తవయస్కుడు కాగానే తండ్రిగా ఒత్తిడి చేయ గలిగియున్న తన స్థితిని దురుపయోగపరచి ఆ అప్పు విషయమున రావలసిన దాని కంటె అధిక మొత్తమునకు గాను బాండును తీసికొనును. 'ఏ' అనుచితమైన ఒత్తిడికి పాల్పడినాడు.

(బీ) 'ఏ' అనారోగ్యము, లేక వృద్ధాప్యము వలన దుర్బలుడైయుండగ, తన వైద్య పరిచారకుడుగ 'బీ' తనపై ఒత్తిడి చేసినందువలన 'బీ'కి అతడి వృత్తి సంబంధమైన సేవలకుగాను అనుచితమైన మొత్తమును చెల్లించుటకు ఒప్పుకొని నాడు. 'బీ' అనుచితమైన ఒత్తిడికి పాల్పడినాడు.

(సీ) 'ఏ' తన ఊరి షాహుకారు అయిన 'బీ'కి ఋణపడియుండి, అన్యాయ మైనవిగ కనుపించు నిబంధనలపై క్రొత్తగా అప్పు తీసికొనును. ఆ అప్పు కాంట్రాక్టు అనుచితమైన ఒత్తిడివలన ప్రేరితముకాలేదని రుజువు చేయవలసిన బాధ్యత 'బీ'పై ఉండును.

(డీ) ద్రవ్య మార్కెట్టు కటువుగా వున్న సమయమున అప్పుకొరకై 'ఏ' ఒక బ్యాంకరుకు దరఖాస్తు చేయును. ఆ బ్యాంకరు ఎక్కువ వడ్డీ రేటుపై తప్ప అప్పు ఇచ్చుటకు నిరాకరించును. 'ఏ' ఆ నిబంధనలపై అప్పు తీసికొనును. ఇది మామూలు వ్యాపార సరళిలో జరిగిన వ్యవహారము. ఈ కాంట్రాక్టు అనుచితమైన ఒత్తిడివలన ప్రేరితమైనది కాదు.

17. "కపటము" అనగా కాంట్రాక్టు యొక్క ఒక పక్షకారుచే గాని, అతని మౌనానుకూలతతో గాని, అతని ఏజెంటుచే గాని దాని మరొక పక్షకారును, లేక అతని ఏజెంటును మోసగించు ఉద్దేశముతో గాని లేక కాంట్రాక్టు చేసికొనుటకు అతనిని ప్రేరితుని చేయుటకు గాని చేయబడిన ఈ క్రింది కార్యములని అర్థము మరియు ఆ పదపరిధియందు ఇవి చేరియుండును:- 'కపటము' నిర్వచనము.

(1) నిజము కాని సంగతిని, అది నిజమైనదని తాను విశ్వసించని వ్యక్తి దానిని వాస్తవమైనదిగ సూచించుట;

(2) తనకు తెలిసియున్నట్టి లేక తాను విశ్వసించుచున్నట్టి ఏదేని సంగతిని ఏ వ్యక్తియైనను బుద్ధిపూర్వకముగా కప్పిపుచ్చుట;

(3) నిర్వర్తించు ఉద్దేశమేదియు లేకుండనే చేసిన వాగ్దానము;

(4) మోసగించుటకు అనుకూలమగు ఏదేని ఇతర కార్యము;

(5) కపటపూర్వకమైనదని శాసనము ద్వారా ప్రత్యేకముగా ప్రఖ్యానించ బడినట్టి ఏదేని అట్టి కార్యము లేక కార్యలోపము.

<u>విశదీకరణము</u>:- కాంట్రాక్టు చేసుకొనుటకు ఒక వ్యక్తి ఇష్టమును ప్రభావితము చేయగల సంగతులకు సంబంధించి కేవలము మౌనమువహించుట - ఆ కేసు పరిస్థితుల దృష్ట్యా వాటిని గమనించి మాట్లాడవలసియుండుట మౌనము వహించు వ్యక్తి కర్తవ్యమైననే తప్ప, లేక అతని మౌనము మాట్లాడుటకు సమానమైననే తప్ప - కపటము కాదు;

<u>ఉదాహరణములు</u>

(ఏ) అస్వస్థమైనదని 'ఏ'కి తెలిసినట్టి గుర్రమును 'ఏ' వేలము ద్వారా 'బీ'కి విక్రయించును. 'ఏ' ఆ గుర్రపు అస్వస్థతను గూర్చి 'బీ'కి ఏమియు చెప్పడు. ఇది 'ఏ'పట్ల కపటము కాదు.

(బీ) 'ఏ' యొక్క కూతురైన 'బీ' అప్పుడే యుక్త వయస్కురాలైనది. ఇచ్చట పక్షకారుల మధ్యగల సంబంధమునుబట్టి, ఆ గుర్రము అస్వస్థపుదైనచో, ఆ విషయమును 'బీ'కి తెలియజేయుట 'ఏ' యొక్క కర్తవ్యమగును.

(సీ) "నీవు దానిని ఖండించనిచో, ఆ గుర్రము స్వాస్థముగా ఉన్నట్లు భావించెదను" అని 'ఏ'కు 'బీ' చెప్పును. 'ఏ' ఏమియు చెప్పడు. ఇచ్చట 'ఏ' యొక్క మౌనము మాట్లాడుటకు సమానము.

(డీ) 'ఏ' 'బీ' అను వ్యాపారస్థులు ఒక కాంట్రాక్టు చేసుకొందురు. ధరలు మారినవని 'ఏ'కు అంతరంగికముగా సమాచారము అందినది. అట్టి మార్పు కాంట్రాక్టు చేసుకొనుటకు 'బీ' యొక్క ఇష్టమును ప్రభావితము చేయును. 'బీ'కి తెలియజేయుటకు 'ఏ' బద్ధుడు కాడు.

"అసత్యకథనము" నిర్వచనము.

18. అసత్యకథనము అనగా మరియు ఆ పదపరిధిలో చేరియుండునవి:-

(1) ఒక వ్యక్తి నిజముకాని దానిని నిజమైనదని తాను విశ్వసించు నప్పటికిని, తనకు తెలిసిన సమాచారమునుబట్టి సమర్థనీయము కాని రీతిలో నిశ్చయముగా నిజమైనదని చెప్పుట;

(2) మోసగించు ఉద్దేశము లేకుండ, మరొకరికి చెరుపు కలుగునట్లు గాని, అతని క్రింద క్లెయిము చేయు ఎవరికైనను చెరుపు కలుగునట్లుగాని అతనిని తప్పు దారిపట్టించి కర్తవ్యమును ఉల్లంఘించు వ్యక్తికి, లేక అతని క్రింద క్లెయిము చేయు ఎవరికైనను అనుకూల్యమును లభింపజేయు ఏదేని కర్తవ్యోల్లంఘనము;

(3) ఒక కరారు యొక్క పక్షకారును, ఆ కరారులోని విషయవస్తువు యొక్క సారాంశమునకు సంబంధించి, ఎంత అమాయకముగనైనను సరే, పొరపాటు వేయునట్లు చేయుట.

19. ఒక కరారుకు పీడింపు, కపటము, లేక అసత్యకథనము ద్వారా సమ్మతిని పొందినప్పుడు, ఏ పక్షకారు సమ్మతి అట్లు పొందబడినదో, ఆ పక్షకారు అభిమతానుసారము ఆ కరారు చెల్లనిదిగ చేయదగిన కాంట్రాక్టు అగును. స్వేచ్ఛాయుత సమ్మతిలేని కరారులు చెల్లనివిగ చేయదగినవై యుండుట.

కాంట్రాక్టు యొక్క ఏ పక్షకారు సమ్మతి కపటము లేక అసత్యకథనము ద్వారా పొందబడినదో ఆ పక్షకారు, తాను సబబని తలచినచో, ఆ కాంట్రాక్టు నిర్వర్తింపబడవలెననియు, చేసిన కథనములు నిజమైయుండినచో తాను ఏ స్థితిలో నుండెడివాడో ఆ స్థితిలో తనను ఉంచవలెననియు పట్టుబట్టవచ్చును.

మినహాయింపు:- అట్టి సమ్మతి, అసత్యకథనము ద్వారా లేక 17వ పరిచ్ఛేదపు అర్థములో కపటపూర్వక మౌనము ద్వారా పొందబడినప్పటికిని ఎవరి సమ్మతి అట్లు పొందబడినదో ఆ పక్షకారు మామూలు తత్పరతతో నిజము తెలిసికొనగల సాధనములను కలిగియుండినచో, ఆ కాంట్రాక్టు చెల్లనిదిగ చేయదగినదికాదు.

విశదీకరణము:- కాంట్రాక్టు యొక్క ఏ పక్షకారు కపటమునకు, లేక అసత్యకథనమునకు గురియైనాడో ఆ పక్షకారు ఆ కాంట్రాక్టుకు సమ్మతించుట, అట్టి కపటము, లేక అసత్యకథనము వలన జరుగనిచో, అట్టి కపటము, లేక అసత్యకథనము ఆ కాంట్రాక్టును చెల్లనిదిగ చేయదగినదిగా చేయదు.

## ఉదాహరణములు

(ఏ) 'బీ'ని మోసగించు ఉద్దేశముతో 'ఏ' తన ఫ్యాక్టరీలో సాలీనా 500 మణుగుల నీలిమందు తయారగుచున్నట్లు తప్పుడు కథనముచేసి తద్వారా 'బీ'ని ఆ ఫ్యాక్టరీని కొనుటకు ప్రేరితునిజేయును. ఆ కాంట్రాక్టు 'బీ' అభిమతానుసారము చెల్లనిదిగ చేయదగినదగును.

(బీ) 'ఏ' అసత్యకథనముచేసి 'ఏ' యొక్క ఫ్యాక్టరీలో 500ల మణుగుల నీలిమందు తయారగుచున్నదని 'బీ'ని పొరపాటుగా విశ్వసించునట్లు చేయును. ఫ్యాక్టరీ లెక్కలను పరిశీలనచేసి 400ల మణుగుల నీలిమందు మాత్రమే తయారగుచున్నట్లు 'బీ' తెలుసుకొనెను. ఆ తర్వాత 'బీ' ఆ ఫ్యాక్టరీని కొనుగోలు చేయును. 'ఏ' చేసిన అసత్యకథనము మూలముగా ఆ కాంట్రాక్టు చెల్లనిదిగ చేయదగినదికాదు.

(సీ) 'ఏ' తన సంపద అభిభారరహితమైనదని 'బీ'కి కపటపూర్వకముగా తెలియజేయును. ఆ మీదట 'బీ' ఆ సంపదను కొనుగోలు చేయును. ఆ సంపద తాకట్టుకు లోనైయున్నది. 'బీ' ఆ కాంట్రాక్టును చెల్లనిదిగ చేయవచ్చును; లేదా దానిని అమలుపరచవలసినదిగాను ఆ తాకట్టు ఋణమును విమోచన చేయవలసినదిగాను పట్టుబట్టవచ్చును.

(డీ) 'ఏ' యొక్క సంపదలో ఖనిజము ఉన్నట్లు 'బీ' కనుగొని, ఖనిజము ఉన్నదని 'ఏ'కు తెలియకుండ కప్పిపుచ్చు మార్గముల నవలంబించి కప్పిపుచ్చును.

'ఏ'కు ఆ విషయము తెలియనందున 'బీ' ఆ సంపదను తక్కువ వెలకు కొన గలిగెను. 'ఏ' అభిమతానుసారము ఆ కాంట్రాక్టు చెల్లనిదిగ చేయదగినదగును.

(ఈ) 'బీ' మరణించిన మీదట ఒక సంపదకు ఉత్తరాధికారియగుటకు 'ఏ'కు హక్కుకలదు. 'బీ' మరణించెను. 'బీ' మరణమును గూర్చిన గుప్త సమాచారము 'సీ'కి తెలిసియుండినను, దానిని 'ఏ'కి చేరకుండ నివారించి ఆ సంపదలోని హితమును తనకు విక్రయించమనట్లు 'ఏ'ను ప్రేరితుని చేయును. 'ఏ' అభిమతానుసారము ఆ విక్రయము చెల్లనిదిగ చేయదగినదగును.

*అనుచితమైన ఒత్తిడి ద్వారా ప్రేరితమైన కాంట్రాక్టును తోసిపుచ్చు అధికారము.*

19-ఏ. ఒక కరారుకు అనుచితమైన ఒత్తిడి ద్వారా సమ్మతిని పొందినపుడు, ఏ పక్షకారు సమ్మతి అట్లు పొందబడినదో ఆ పక్షకారు అభిమతానుసారము ఆ కరారు చెల్లనిదిగ చేయదగిన కాంట్రాక్టు అగును.

అట్టి ఏదేని కాంట్రాక్టు బేషరతుగా గాని, దానిని చెల్లనిదిగ చేయు హక్కు గల పక్షకారు దాని క్రింద ఏదేని మేలు పొందియుండినచో న్యాయస్థానము న్యాయమనితలచు నిబంధనలపై గాని మరియు షరతులపై గాని, రద్దు చేయ వచ్చును.

<u>ఉదాహరణములు</u>

(ఏ) 'ఏ' యొక్క కుమారుడు ప్రామిసరీనోటుపై 'బీ' పేరును కూటరచన చేసెను. 'ఏ' యొక్క కుమారునిపై అభియోగము తెచ్చెదనని బెదరించి, కూటరచిత పత్రమునందలి రొక్కము కొరకు 'ఏ' నుండి 'బీ' బాండును తీసికొనును. ఈ బాండుపై 'బీ' దావా వేసినచో, న్యాయస్థానము ఆ బాండును తోసిపుచ్చవచ్చును.

(బీ) 'ఏ' అను షావుకారు 'బీ' అను వ్యవసాయదారుకు 100 రూపాయలు అప్పు యిచ్చి, అనుచితమైన ఒత్తిడి ద్వారా నెలకు ఆరుశాతము వడ్డీ చొప్పున 200 రూపాయల కొరకు బాండు వ్రాసియిచ్చునట్లు 'బీ'ని ప్రేరితుని చేయును. న్యాయస్థానమునకు న్యాయమని తోచు వడ్డీతో 100 రూపాయలను 'బీ' తిరిగి చెల్లించవలెనని ఉత్తరువు చేయుచు ఆ బాండును తోసిపుచ్చవచ్చును.

*సంగతి విషయమున పక్షకారులిరువురు పొరపాటు పడినప్పుడు కరారు చెల్లదు.*

20. కరారుకు ముఖ్యాంశమగు సంగతి విషయమున పక్షకారులిరువురు పొరపాటు పడినపుడు కరారు చెల్లదు.

<u>విశదీకరణము</u>:- కరారులోని విషయవస్తువు యొక్క విలువను గూర్చిన తప్పుడు అభిప్రాయమును, సంగతి విషయకమైన పొరపాటుగ భావించరాదు:

<u>ఉదాహరణములు</u>

(ఏ) ఇంగ్లాండు నుండి బొంబాయికి చేరు దారిలో ఉన్నవని అనుకొనబడిన నిర్దిష్ట సరుకులను 'బీ'కి విక్రయించుటకై 'ఏ' కరారుచేయును. సరుకులు తీసుకొనివచ్చెడి ఓడ, బేరము జరిగిన ముందు రోజున కొట్టుకొనిపోయి సరుకులు పోయినట్లు తరువాత తెలియవచ్చును. ఇరు పక్షకారులకు ఈ సంగతులు తెలియవు. ఆ కరారు చెల్లదు.

(బీ) ఒకానొక గుర్రమును 'బీ' నుండి కొనుగోలు చేయుటకు 'ఏ' కరారు చేసుకొనెను. గుర్రము మరణించిన సంగతి పక్షకారులలో ఎవరికిని తెలియకపోయి నప్పటికిని, బేరము జరుగు సమయముననే అది మరణించినట్లు తరువాత తెలియ వచ్చును. ఆ కరారు చెల్లదు.

(సీ) 'బీ' జీవిత పర్యంతమునకుగాను ఒక సంపదకు హక్కుదారైన 'ఏ' దానిని 'సీ'కి విక్రయించుటకు కరారు చేసికొనును. 'బీ' కరారు జరుగు సమయముననే మరణించును. కాని పక్షకారులిరువురికి ఆ సంగతి తెలియదు. ఆ కరారు చెల్లదు.

21. కాంట్రాక్టు, అది భారతదేశములో అమలునందున్న ఏదేని శాసనమును గూర్చిన పొరపాటు మూలముగా చేసికొనబడినందున, చెల్లనిదిగ చేయదగినది కాదు. కాని భారతదేశములో అమలునందులేని శాసనమును గూర్చిన పొరపాటు సంగతి విషయక పొరపాటు కలిగియుండు ప్రభావమునే కలిగియుండును.

శాసనమును గూర్చిన పొరపాటు యొక్క ప్రభావము.

ఉదాహరణము

ఒకానొక ఋణమునకు భారత కాలపరిమితి శాసనము వలన కాలదోషము పట్టినదను తప్పుడు విశ్వాసముతో 'ఏ' 'బీ'లు ఒక కాంట్రాక్టు చేసుకొందురు. ఆ కాంట్రాక్టు చెల్లనిదిగ చేయదగినదికాదు.

22. కాంట్రాక్టు యొక్క పక్షకారులలో ఒకరు సంగతి విషయముగ పొరపాటుపడినందున అది చేసికొనబడినదను కారణ మాత్రముననే చల్లనిదిగ చేయదగినద కాదు.

సంగతి విషయమును గూర్చి ఒక పక్షకారు యొక్క పొరపాటు వలన చేసికొనబడిన కాంట్రాక్టు.

23. కరారు యొక్క ప్రతిఫలము లేక ఉద్దేశము–

శాసనరీత్యా నిషేధింపబడినదైననే, లేక

అనుమతింపబడినచో, ఏదేని శాసనపు నిబంధనలను విఫలము చేయు స్వభావము కలిగినదైననే; లేక

కపటపూర్వకమైనదైననే, లేక

మరొకరి శరీరమునకు గాని ఆస్తికి గాని హాని చేకూర్చుట దానియందు చేరియున్నట్టిది లేక గర్భితమైయున్నట్టిది అయిననే; లేక

అవినీతికరమైనదని, లేక పబ్లికు విధానమునకు (పాలసీకి) విరుద్ధమైనదని న్యాయస్థానము భావించినదైననే

తప్ప, శాసనసమ్మతమైనదగును.

పైన తెలిపినట్టి ప్రతి సందర్భములోను, కరారు యొక్క ప్రతిఫలము, లేక ఉద్దేశము శాసనవిరుద్ధమైనదని చెప్పబడును. ఏ కరారుయొక్క ఉద్దేశము, లేక ప్రతిఫలము శాసనవిరుద్ధమైనదగునో అట్టి ప్రతియొక కరారు చెల్లదు.

ఏవి ప్రతిఫలములు మరియు ఉద్దేశములు శాసనసమ్మతమైనవి మరియు ఏవి కావు.

## ఉదాహరణములు

(ఏ) 'ఏ' తన ఇంటిని 'బీ'కి 10,000 రూపాయలకు విక్రయించుటకు కరారు చేసుకొనును. ఇచ్చట, 10,000 రూపాయల మొత్తము చెల్లించెదనని 'బీ' చేసిన వాగ్దానము, ఇంటిని విక్రయించెదనని 'ఏ' చేసిన వాగ్దానమునకు ప్రతిఫలమగును, మరియు ఇంటిని విక్రయించెదనని 'ఏ' చేసిన వాగ్దానము 10,000 రూపాయలు చెల్లించెదనని 'బీ' చేసిన వాగ్దానమునకు ప్రతిఫలమగును; ఇవి శాసన సమ్మతమైన ప్రతిఫలములు.

(బీ) 'బీ'కి 1000 రూపాయలు బాకీ ఉన్న 'సీ' వాటిని చెల్లించనిచో ఆ మొత్తమును ఆరుమాసములు గడచిన పిమ్మట 'బీ'కి చెల్లించెదనని 'ఏ' వాగ్దానము చేయును. తదనుసారముగా 'సీ'కి గడువు నిచ్చుటకు 'బీ' వాగ్దానము చేయును. ఇచ్చట ప్రతియొక పక్షకారు చేసిన వాగ్దానము మరొక పక్షకారు చేసిన వాగ్దానమునకు ప్రతిఫలమైయున్నది, మరియు ఇవి శాసనసమ్మతమైన ప్రతిఫలములు.

(సీ) 'బీ' తనకు చెల్లించిన కొంత పైకమునకుగాను, 'బీ' యొక్క ఓడ జలప్రయాణములో భంగమైపోయినచో దాని వెలను 'బీ'కి చెల్లించెదనని 'ఏ' వాగ్దానము చేయును. ఇచ్చట, 'బీ' యొక్క చెల్లింపునకు 'ఏ' చేసిన వాగ్దానము ప్రతిఫలమగును మరియు 'ఏ' చేసిన వాగ్దానమునకు 'బీ'యొక్క చెల్లింపు ప్రతిఫలమగును. ఇవి శాసనసమ్మత ప్రతిఫలములు.

(డీ) 'బీ' యొక్క బిడ్డను పోషింతునని 'ఏ' వాగ్దానము చేయును, అందు నిమిత్తమై ప్రతి సంవత్సరము 1,000 రూపాయలు 'ఏ'కు చెల్లించెదనని 'బీ' వాగ్దానము చేయును. ఇచ్చట ప్రతియొక పక్షకారు చేసిన వాగ్దానము ఇతర పక్షకారు చేసిన వాగ్దానమునకు ప్రతిఫలమగును. ఇవి శాసనసమ్మతమైన ప్రతిఫలములు.

(ఈ) కపటము ద్వారా తాము ఆర్జించిన లేక ఆర్జించనున్న లాభములను పంచుకొనుటకు 'ఏ', 'బీ', 'సీ'లు కరారు చేసికొందురు. ఆ కరారు ఉద్దేశము శాసనసమ్మతమైనది కానందున ఆ కరారు చెల్లదు.

(ఎఫ్) పబ్లికు నౌకరులో 'బీ' కొరకు ఉద్యోగము సంపాదించి పెట్టెదనని 'ఏ' వాగ్దానము చేయును, 'ఏ'కు 1,000 రూపాయలు చెల్లించెదనని 'బీ' వాగ్దానము చేయును. ఆ కరారుకు ప్రతిఫలము శాసనసమ్మతమైనది కానందున ఆ కరారు చెల్లదు.

(జీ) ఒక భూస్వామికి ఏజెంటు అయిన 'ఏ' తన యజమానికి తెలియకుండ డబ్బు తీసికొని, ఆ యజమానికి చెందిన భూమిని 'బీ' కొరకు కౌలుకు సంపాదించి పెట్టెదనని కరారు చేసికొనును. విషయమును కప్పిపుచ్చుట ద్వారా 'ఏ' తన యజమానిని కపటమునకు గురిచేయుట గర్భితమైయున్నందున 'ఏ', 'బీ'ల మధ్య జరిగిన ఆ కరారు చెల్లదు.

(హెచ్) దోపిడి నేరమునకై తాను 'బీ'పై తెచ్చిన అభియోగమును వదలు కొందునని 'ఏ', 'బీ'కి వాగ్దానము చేయును. 'బీ' తాను తీసుకొన్న వస్తువుల

విలువను తిరిగి యిచ్చెదనని వాగ్దానము చేయును. ఆ కరారు ఉద్దేశము శాసన సమ్మతమైనది కానందున ఆ కరారు చెల్లదు.

(ఐ) 'ఏ' యొక్క సంపదను శిస్తు బకాయ కొరకు శాసనమండలి చట్టపు నిబంధనల క్రింద విక్రయించబడమైనది. బకాయదారు ఆ సంపదను కొనుగోలు చేయరాదని ఆ చట్టము ద్వారా నిషేధింపబడెను. 'బీ', 'ఏ'తో కూడబలుకుకొని కొనుగోలుదారుడై తాను చెల్లించిన ధరను 'ఏ' నుండి పొందిన మీదట ఆ సంపదను 'ఏ'కు హస్తాంతరణము చేయుటకు కరారు చేసుకొనును. ఆ కరారు ప్రభావరీత్యా, ఆ వ్యవహారము బకాయిదారు చేసిన కొనుగోలుగ చేయును. తద్వారా శాసనపు ఉద్దేశమును విఫలమొనర్చును. కాబట్టి ఆ కరారు చెల్లదు.

(జే) 'బీ' యొక్క ముక్తారైన 'ఏ' అట్టి ముక్తారుగా తనకు 'బీ'పై గల పలుకుబడిని 'సీ'కి అనుకూలముగా వినియోగించెదనని వాగ్దానము చేయును. 'ఏ'కు 1000 రూపాయలు చెల్లించెదనని 'సీ' వాగ్దానము చేయును. ఆ కరారు అవినీతికరమైనది. అందువలన అది చెల్లదు.

(కే) 'ఏ' తన కూతురును, ఉంపుడుకత్తెగా ఉంచుకొనుటకై 'బీ'కి కిరాయికి ఇచ్చెదనని కరారు చేయును. అట్లు కిరాయికి యిచ్చుట భారత శిక్షా స్మృతి క్రింద శిక్షింపదగినది కాకున్నను, ఆ కరారు అవినీతికరమైనది. అందువలన అది చెల్లదు. 1860లో 45వది.

## చెల్లని కరారులు

24. ఒకటి, లేక అంతకుమించిన ఉద్దేశములకు సంబంధించిన ఏకైక ప్రతిఫలములోని ఏదేని భాగము, లేక ఏకైక ఉద్దేశమునకు సంబంధించిన అనేక ప్రతిఫలములలో ఏదేని ఒక ప్రతిఫలము, లేక ఏదేని ఒక ప్రతిఫలములోని ఏదేని భాగము శాసనసమ్మతము కానిచో, ఆ కరారు చెల్లదు.

ప్రతిఫలముల లోను ఉద్దేశముల లోను కొంత భాగము శాసన సమ్మతము కాకున్నచో కరారులు చెల్లవు.

### ఉదాహరణము

నీలిమందును శాసనబద్ధముగా తయారుచేయుటలోను, ఇతర వస్తువుల అక్రమ వ్యాపారములోను 'బీ' తరపున అధీక్షణ చేయుదునని 'ఏ' వాగ్దానము చేయును. 'ఏ'కు ప్రతి సంవత్సరము 10,000 రూపాయల జీతము చెల్లించెదనని 'బీ' వాగ్దానము చేయును. 'ఏ' చేసిన వాగ్దానపు ఉద్దేశము, 'బీ' చేసిన వాగ్దానమునకు ప్రతిఫలము కొంత భాగము శాసనసమ్మతమైనది కానందువలన ఆ కరారు చెల్లదు.

25. ప్రతిఫల రహితమైన కరారు—

ప్రతిఫలరహితమైన కరారు.

(1) అది వ్రాతమూలకముగా అభివ్యక్తము చేయబడి దస్తావేజుల రిజిస్ట్రీకరణకై తత్సమయమున అమలునందున్న శాసనము క్రింద రిజిస్టరు చేయబడి, ఒకరికొకరు సన్నిహిత సంబంధము కలిగియున్న పక్షకారుల మధ్యగల సహజ ప్రేమానురాగముల కారణముగ చేసికొనినదైననే తప్ప, లేక

వ్రాతమూలకముగా ఉండి రిజిస్టరు చేయబడిననే తప్ప.

లేక చేయబడిన దేనికైనను పరిహారము నిచ్చు వాగ్దానమైననే తప్ప.

(2) అది వాగ్దాత కొరకు స్వచ్ఛందముగా ఇదివరకే ఏదైన చేసియుండిన, లేక వాగ్దాత శాసనసమ్మతముగా తప్పనిసరిగా చేయవలసినదేనినైనను చేసియుండిన వ్యక్తికి పూర్తిగాగాని, కొంతగాని పరిహారము నిచ్చుటకొరకైన వాగ్దానమైననే తప్ప; లేక

లేక కాలపరిమితి శాసనము ననుసరించి కాలదోషముపట్టిన ఋణమును చెల్లించుట కొరకైన వాగ్దానమైననే తప్ప.-

(3) ఏ ఋణమును ఋణదాత, దావాల కాలపరిమితి శాసనము లేకుండినచో చెల్లింపు చేయించుకొనియుండెడివాడో ఆ ఋణమును పూర్తిగాగాని, కొంతగాని చెల్లించుట కొరకై సంతకము చేసిన వాగ్దానమైయుండి ఆ వాగ్దాన భారము తనపైగాని, తద్విషయమున సాధారణముగానైనను, ప్రత్యేకముగానైనను ప్రాధికారము హొందిన అతని ఏజెంటుగాని వ్రాతమూలకముగా చేసిన వాగ్దానమైననే తప్ప.

చెల్లదు.

చెల్లదు.

ఈ సందర్భములలో దేనిలోనైనను అట్టి కరారు కాంట్రాక్టు అగును.

<u>విశదీకరణము 1</u>:- ఈ పరిచ్ఛేదములో నున్నదేదియు వాస్తవముగా చేయబడిన ఏదేని దానము యొక్క శాసనమాన్యతకు, దాత మరియు దానగ్రహీతలకు సంబంధించినంతవరకు, భంగము కలిగించదు.

<u>విశదీకరణము 2</u>:-వాగ్దాత ఏ కరారుకు తన సమ్మతిని స్వేచ్ఛగా ఇచ్చినాడో ఆ కరారు, ప్రతిఫలము చాలనిదైనంత మాత్రమున చెల్లనిదికాదు; కాని, వాగ్దాత సమ్మతిని స్వేచ్ఛగా ఇచ్చినాడా లేదా అను ప్రశ్నను నిర్ధారణ చేయుటలో న్యాయస్థానము ప్రతిఫలము చాలినంతగా లేకపోవుటను పరిగణనలోనికి తీసుకొన వచ్చును.

<u>ఉదాహరణములు</u>

(ఏ) 'ఏ' ప్రతిఫలమేదియు లేకుండ 'బీ'కి రూపాయలు 1000 ఇచ్చుటకు వాగ్దానము చేయును, ఇది చెల్లని కరారు.

(బీ) 'ఏ' సహజ ప్రేమానురాగములతో తన కుమారుడైన 'బీ'కి రూపాయలు 1,000 ఇచ్చుటకు వాగ్దానము చేయును. 'ఏ', 'బీ'కి చేసిన తన వాగ్దానమును వ్రాతబద్ధముచేసి రిజిస్టరు చేయును. ఇది ఒక కాంట్రాక్టు.

(సీ) 'బీ' యొక్క పర్సు 'ఏ'కు దొరుకును; అతడు దానిని 'బీ'కి ఇచ్చును. 'ఏ'కు రూ. 50లు ఇచ్చెదనని 'బీ' వాగ్దానము చేయును. ఇది ఒక కాంట్రాక్టు.

(డీ) 'బీ' యొక్క కుమారుడైన పసిబాలుడిని 'ఏ' పోషించును. అట్లు పోషించుటకైన ఖర్చులు 'ఏ'కు చెల్లించెదనని 'బీ' వాగ్దానము చేయును. ఇది ఒక కాంట్రాక్టు.

(ఈ) 'ఏ', 'బీ'కి 1000 రూపాయలు ఋణపడి ఉండెను. కాని ఆ ఋణమునకు కాలపరిమితి చట్టము ననుసరించి కాలదోషము పట్టెను. ఆ ఋణము బాపతు 500 రూపాయలు 'బీ'కి చెల్లించెదనని 'ఏ' వ్రాలమూలకమైన వాగ్దానముపై సంతకము చేయును. ఇది ఒక కాంట్రాక్టు.

(ఎఫ్) 1000 రూపాయల విలువగల గుర్రమును 10 రూపాయలకు విక్రయించుటకు 'ఏ' కరారు చేయును. ఆ కరారుకు 'ఏ' స్వేచ్ఛగా సమ్మతినిచ్చెను. ప్రతిఫలము చాలనిదైనప్పటికిని ఆ కరారు ఒక కాంట్రాక్టు.

(జీ) 1000 రూపాయల విలువగల గుర్రమును 10 రూపాయలకు విక్రయించుటకు 'ఏ' కరారు చేయును. 'ఏ' ఆ కరారుకు స్వేచ్ఛగా తన సమ్మతిని ఈయలేదనుము.

(ఏ) తన సమ్మతిని స్వేచ్ఛగా ఇచ్చినాడా లేదా అని పర్యాలోచించునపుడు ప్రతిఫలము చాలినంతగా లేకపోవుటను న్యాయస్థానము పరిగణనలోనికి తీసుకొనవలసిన సంగతియైయుండును.

వివాహమును అవరోధించు కరారు చెల్లదు.

26. మైనరు కానట్టి ఏ వ్యక్తి వివాహమునైనను అవరోధించు ప్రతియొక కరారు చెల్లదు.

వ్యాపారమును అవరోధించు కరారు చెల్లదు.

27. శాసనసమ్మతమగు ఏ రకపు వృత్తినైనను, వ్యాపారమునైనను, వర్తకమునైనను, చేయుట నుండి ఎవరినైనను అవరోధించు ప్రతియొక కరారు ఆ మేరకు చెల్లదు.

వ్యాపార ఖ్యాతి (గుడ్‌విల్) విక్రయింపబడిన వర్తకము సాగించకుండుటకు చేసుకొన్న కరారుయొక్క వ్యావృత్తి.

మినహాయింపు 1:– ఏదేని వర్తకపు వ్యాపార ఖ్యాతిని (గుడ్‌విల్‌ను) విక్రయించు వ్యక్తి, నిర్దిష్ట స్థానిక హద్దులలో కొనుగోలుదారు, లేక అతని నుండి ఆ వ్యాపార ఖ్యాతికి హక్కును పొందిన ఎవరేని వ్యక్తి అదేరకపు వర్తకమును సాగించుమన్నంతవరకు, ఆ హద్దులలో అటువంటి వర్తకమును సాగించరాదని కొనుగోలుదారుతో కరారు చేసుకొనవచ్చును. అయితే, అట్టి హద్దులు ఆ వర్తకపు స్వభావమునుబట్టి యుక్తమైనవని న్యాయస్థానమునకు తోచునవైయుండవలెను.

శాసనిక చర్యలను అవరోధించు కరారులు చెల్లవు.

28. ఏ కరారు, దాని యొక్క ఏ పక్షకారునైనను ఏదేని కాంట్రాక్టు క్రింద గాని దానికి సంబంధించి గాని అతనికి గల హక్కులను సాధారణ ట్రిబ్యునళ్ళలో మామూలు శాసనిక చర్యల ద్వారా అమలు జరిపించుట నుండి పూర్తిగా అవరోధించునో, లేక అతడు అతని హక్కులను అట్లు అమలు జరిపించ గలిగెడి కాలావధిని పరిమితపరచునో, అట్టి ప్రతియొక కరారు ఆ మేరకు చెల్లదు.

ఉత్పన్నమగు వివాదమును మధ్యవర్తిత్వమునకు నిర్దేశించుటకైన కాంట్రాక్టు యొక్క వ్యావృత్తి.

మినహాయింపు 1:– ఏ కాంట్రాక్టు ద్వారా ఇద్దరు లేక అంతకెక్కువ మంది వ్యక్తులు ఏదేని విషయమునకు లేక విషయముల వర్గమునకు సంబంధించి వారి మధ్య ఉత్పన్నమగు ఏదేని వివాదమును మధ్యవర్తిత్వమునకు నిర్దేశించవలెననియు అట్టి మధ్యవర్తిత్వమునందు అధినిర్ణయించబడిన మొత్తము మాత్రమే అట్లు నిర్దేశించబడిన వివాదమునకు సంబంధించి రాబట్టుకొనబడవలెననియు కరారు చేసుకొందురో, ఆ కాంట్రాక్టును ఈ పరిచ్ఛేదము శాసనవిరుద్ధమొనర్చదు.

ఇదివరకే ఉత్పన్నమైన ప్రశ్నలను నిర్దేశించుటకైన కాంట్రాక్టు యొక్క వ్యావృత్తి.

మినహాయింపు 2:– ఈ పరిచ్ఛేదము వ్రాతబద్ధమైన ఏ కాంట్రాక్టు ద్వారా ఇద్దరు లేక అంతకెక్కువ మంది వ్యక్తులు వారి మధ్య ఇదివరకే ఉత్పన్నమైన ఏదేని ప్రశ్నను మధ్యవర్తిత్వమునకు నిర్దేశించుటకు కరారు చేసుకొందురో ఆ కాంట్రాక్టును శాసనవిరుద్ధమొనర్చదు, లేక మధ్యవర్తిత్వమునకు చేయు నిర్దేశములను గూర్చి తత్సమయమున అమలునందున్న ఏదేని శాసనమునందలి ఏ నిబంధనకైనను భంగము కలిగించదు.

*అనిశ్చితతవలన కరారులు చెల్లవు.*

29. అర్థము నిశ్చితముగాలేని, లేక నిశ్చితము చేయ వీలులేని కరారులు చెల్లవు.

## ఉదాహరణములు

(ఏ) 'ఏ' వంద టన్నుల నూనెను 'బీ'కి విక్రయించుటకు కరారు చేయును. ఏరకపు నూనె ఉద్దేశింపబడినదో తెలియజేయుటకు అందు ఏదియు లేదు, ఆ కరారు అనిశ్చితమైనదైనందున చెల్లదు.

(బీ) వాణిజ్య వస్తువుగా పేర్కొనబడెడి నిర్దిష్ట రకపు వంద టన్నుల నూనె 'బీ'కి విక్రయించుటకు 'ఏ' కరారు చేసికొనును. ఇందు ఆ కరారును చెల్లనిదిగా చేయు అనిశ్చితత ఏదియు లేదు.

(సీ) కొబ్బరినూనెయందు మాత్రమే వ్యాపారముచేయు 'ఏ' "వంద టన్నుల నూనెను" 'బీ'కి విక్రయించుటకు కరారు చేసికొనును. 'ఏ' యొక్క వ్యాపార స్వభావమును ఆ మాటల అర్థమును సూచించును; మరియు 'ఏ' వంద టన్నుల కొబ్బరినూనెను విక్రయించుటకు కాంట్రాక్టు చేసుకొనెను.

(డీ) 'ఏ' "రామనగర్‌లోని తన ధాన్యాగారములో నున్న మొత్తము ధాన్యమును" 'బీ'కి విక్రయించుటకు కరారు చేసుకొనును ఇందు ఆ కరారును చెల్లనిదిగ చేయు అనిశ్చితత ఏదియు లేదు.

(ఈ) 'సీ' నియతము చేయు ధరచొప్పున వేయి మణుగుల బియ్యమును 'బీ'కి విక్రయించుటకై 'ఏ' కరారు చేసికొనును. ధరను నిశ్చితము చేయుటకు వీలున్నందు వలన, ఇందు కరారును చెల్లనిదిగా చేయు అనిశ్చితత ఏదియు లేదు.

(యఫ్) 'ఏ' "నా తెల్ల గుర్రమును ఐదువందల రూపాయలకు గాని, వెయ్యి రూపాయలకు గాని" 'బీ'కి విక్రయింతునని కరారు చేసుకొనెను. ఇందు రెండు ధరలలో ఏది ఈయవలెనో తెలుపుటకు ఏమియు లేదు. కరారు చెల్లదు.

*పందెపు రూపపు కరారులు చెల్లవు.*

30. పందెపు రూపపు కరారులు చెల్లవు ఏ పందెములోనైనను గెలువబడినట్లు చెప్పబడిన లేక ఏదేని పందెము కాసిన ఏదేని ఆట లేక అనిశ్చిత సంఘటన ఫలితమును పాటించుటకై ఎవరేని వ్యక్తి అప్పగింపబడిన దేనినైనను రాబట్టుకొనుటకై దావా ఏదియు తేరాదు.

*గుర్రపు పందెములలో కొన్ని బహుమతుల కనుకూలముగ మినహాయింపు.*

ఈ పరిచ్ఛేదము, ఏదేని గుర్రపు పందెపు విజేతకు లేక విజేతలకు ఈయబడవలసిన ఐదువందల రూపాయలు లేక అంతకుమించిన విలువగల ఏదేని (ఫలకము) ప్లేటు లేక పారితోషికము లేక డబ్బు మొత్తము కొరకు లేక అందుకుగాను ఈయబడు చందానుగాని అభిదాయమునుగాని, చందా ఇచ్చుటకు, లేక అభిదాయము చేయుటకు చేసుకొనబడు కరారునుగాని శాసనవిరుద్ధమొనర్చునదిగ భావించరాదు.

*భారత శిక్షాస్మృతి యొక్క పరిచ్ఛేదము 294-ఏకు భంగము కలుగకుండుట.*

ఈ పరిచ్ఛేదములో నున్నదేదియు, భారత శిక్షాస్మృతి యొక్క పరిచ్ఛేదము 294-ఏ లోని నిబంధనలు వర్తించునట్టి గుర్రపు పందెమునకు సంబంధించిన ఏ వ్యవహారమును గాని శాసనసమ్మత మొనర్చునట్లు భావింపబడరాదు.

## అధ్యాయము - 3

## సమాశ్రిత కాంట్రాక్ట్లను గూర్చి

31. ఏ కాంట్రాక్టు, దానికి పార్శ్వికమైన ఒకానొక సంఘటన జరిగినచో, లేక జరుగనిచో ఒకానొక కార్యమును చేయుటకు, లేక చేయకుండుటకు, చేసుకొనబడునో ఆ కాంట్రాక్టు "సమాశ్రిత కాంట్రాక్టు" అనబడును. 'సమాశ్రిత కాంట్రాక్టు' నిర్వచనము.

### ఉదాహరణ

'బీ' యొక్క ఇల్లు కాలిపోయినచో 'బీ'కి పదివేల రూపాయలు చెల్లించెదనని 'ఏ' కాంట్రాక్టు చేసుకొనును. ఇది సమాశ్రిత కాంట్రాక్టు.

32. ఒక అనిశ్చితమైన భావి సంఘటన జరిగినచో దేనినైనను చేయుటకు గాని చేయకుండుటకు గాని చేసుకొనబడు సమాశ్రిత కాంట్రాక్ట్లు, ఆ సంఘటన జరిగిననే తప్ప మరియు జరుగునంతవరకు అమలుపరచబడజాలనివగును. ఒక సంఘటన జరుగుటపై సమాశ్రితమగు కాంట్రాక్ట్లను అమలుపరచుట.

ఆ సంఘటన అసాధ్యమైనదైనచో, అట్టి కాంట్రాక్ట్లు చెల్లనివగును.

### ఉదాహరణములు

(ఏ) 'సీ' అనంతరము 'ఏ' జీవించుచో 'బీ' యొక్క గుర్రమును కొనుగోలు చేయుదునని 'బీ'తో 'ఏ' కాంట్రాక్టు చేసుకొనును. ఈ కాంట్రాక్టు, 'ఏ' జీవితకాలములో 'సీ' మరణించిననే తప్ప, మరియు అంతవరకు శాసనరీత్యా అమలుపరచబడజాలనిదగును.

(బీ) 'సీ'కు విక్రయింపజూపిన గుర్రమును 'సీ' కొనుటకు నిరాకరించినచో, ఆ గుర్రమును నిర్దిష్ట ధరకు 'బీ'కి విక్రయించుటకై 'బీ'తో 'ఏ' కాంట్రాక్టు చేసుకొనును. 'సీ' ఆ గుర్రమును కొనుటకు నిరాకరించిననే తప్ప, మరియు అంతవరకు ఆ కాంట్రాక్టు శాసనరీత్యా అమలుపరచబడజాలనిదగును.

(సీ) 'బీ' 'సీ'ని వివాహము చేసుకున్నప్పుడు 'బీ'కి కొంత డబ్బు చెల్లించెదనని 'ఏ' కాంట్రాక్టు చేయును. 'బీ'తో వివాహము జరగకుండనే 'సీ' మరణించును. ఆ కాంట్రాక్టు చెల్లనిదగును.

33. ఒక అనిశ్చితమైన భావి సంఘటన జరగకున్నచో దేనినైనను చేయుటకు గాని, చేయకుండుటకు గాని చేసుకొనబడు సమాశ్రిత కాంట్రాక్ట్లు, ఆ సంఘటన జరుగుట అసాధ్యమైనప్పుడు అమలుపరచబడవచ్చును, అంతకుముందు కాదు. ఒక సంఘటన జరుగకుండుటపై సమాశ్రితమగు కాంట్రాక్ట్లను అమలుపరచుట.

### ఉదాహరణ

ఒకానొక ఓడ తిరిగిరానిచో 'బీ'కి కొంత డబ్బు చెల్లించెదనని 'ఏ' కరారు చేసికొనును. ఆ ఓడ మునిగిపోయినది. ఆ ఓడ మునిగినప్పుడు ఆ కాంట్రాక్టు అమలుపరచబడవచ్చును.

ఏ సంఘటనపై కాంట్రాక్టు సమాశ్రితమై యున్నదో ఆ సంఘటన జీవించి యున్న వ్యక్తి యొక్క భావి నడవడికి సంబంధించిన దైనచో అది అసాధ్యమైనదని ఎప్పుడు భావింపబడును.

34. ఏ భావి సంఘటనపై కాంట్రాక్టు సమాశ్రితమైయున్నదో సంఘటన ఒక అనిర్దిష్ట సమయమున ఒక వ్యక్తి వ్యవహరించవలసిన తీర్నైనచో, అట్టి వ్యక్తి ఒక నియతమైన గడువులోపల లేక తదుపరి సమాశ్రిత సంఘటనలు జరిగిననే తప్ప, అట్లు వ్యవహరించగలుగుటను అసాధ్యమొనర్చునట్టి దానిని దేనినైనను చేసినప్పుడు, అట్టి సంఘటన అసాధ్యమైపోయినదని భావించబడవలెను.

## ఉదాహరణము

'సీ'ని 'బీ' వివాహము చేసికొనినచో 'బీ'కి కొంత డబ్బు చెల్లించెదనని 'ఏ' కరారు చేసికొనును. 'సీ' 'డీ'ని వివాహము చేసుకొనును. 'డీ' మరణించుటయు తదుపరి 'బీ'ని 'సీ' వివాహము చేసుకొనుటయు సాధ్యపడునప్పటికినీ, 'సీ'తో 'బీ' వివాహము ఇప్పుడు అసాధ్యమైనదని భావించవలెను.

నిర్దిష్ట సంఘటన నియతమైన గడువు లోపల జరుగుటపై సమాశ్రితమై యున్న కాంట్రాక్టులు ఎప్పుడు చెల్లనివగును.

35. నిర్దిష్ట అనిశ్చిత సంఘటన నియతమైన గడువులోపల జరిగినచో దేనినైనను చేయుటకు గాని చేయకుండుటకు గాని చేసుకొనబడిన సమాశ్రిత కాంట్రాక్టులు, నియతమైన గడువు ముగిసినప్పుడు అట్టి సంఘటన జరగనిచో లేక, నియతమైన గడువునకు ముందే అట్టి సంఘటన అసాధ్యమైపోయినచో చెల్లనివగును.

నిర్దిష్ట సంఘటన నియతమైన గడువులోపల జరుగక పోవుటపై సమాశ్రితమై యున్న కాంట్రాక్టులు ఎప్పుడు అమలుపరచబడవచ్చును.

నిర్దిష్ట అనిశ్చిత సంఘటన నియతమైన గడువులోపల జరగనిచో దేనినైనను చేయుటకుగాని చేయకుండుటకుగాని చేసుకొనబడిన సమాశ్రిత కాంట్రాక్టులు, నియతమైన గడువు ముగిసి అట్టి సంఘటన జరగకపోయినప్పుడు లేక, నియతమైన గడువు ముగియకముందే అట్టి సంఘటన జరగదని నిశ్చయమైపోయినచో, శాసనానుసారము అమలుపరచబడవచ్చును.

## ఉదాహరణములు

(ఏ) ఒకానొక ఓడ ఒక సంవత్సరము లోపల తిరిగి వచ్చినచో 'బీ'కి కొంత డబ్బు చెల్లించెదనని 'ఏ' వాగ్దానము చేయును. సంవత్సరము లోపల ఆ ఓడ తిరిగి వచ్చినచో ఆ కాంట్రాక్టు అమలుపరచబడవచ్చును. మరియు సంవత్సరము లోపల ఆ ఓడ కాలిపోయినచో, ఆ కాంట్రాక్టు చెల్లనిదగును.

(బీ) ఒకానొక ఓడ ఒక సంవత్సరము లోపల తిరిగి రానిచో 'బీ'కి కొంత డబ్బు చెల్లించెదనని 'ఏ' వాగ్దానము చేయును. ఆ ఓడ సంవత్సరము లోపల తిరిగి రానిచో, లేక సంవత్సరము లోపల కాలిపోయినచో ఆ కాంట్రాక్టు అమలుపరచబడవచ్చును.

అసాధ్యమగు సంఘటనలపై సమాశ్రితమైన కరారు చెల్లదు.

36. అసాధ్యమైన సంఘటన జరిగినచో దేనినైనను చేయుటకుగాని, చేయకుండుటకుగాని చేసుకున్న సమాశ్రిత కరారులు, కరారు చేసుకున్న సమయమున దాని పక్షకారులకు ఆ సంఘటన అసాధ్యమైనదని తెలిసియున్నను, తెలియకున్నను చెల్లవు.

ఉదాహరణములు

(ఏ) రెండు సరళరేఖలు ఒక స్థలమును చుట్టుకొనినచో 'బీ'కి 1,000 రూపాయలు చెల్లించెదనని 'ఏ' కరారు చేసికొనును. ఆ కరారు చెల్లదు.

(బీ) 'ఏ' యొక్క కూతురగు 'సీ'ని 'బీ' వివాహము చేసికొనినచో 'బీ'కి 1,000 రూపాయలు చెల్లించెదనని 'ఏ' కరారు చేసికొనును. కరారు సమయమునకే 'సీ' మరణించి యుండెను. ఆ కరారు చెల్లదు.

అధ్యాయము - 4

కాంట్రాక్టుల నిర్వర్తనను గూర్చి

ఏ కాంట్రాక్టులు నిర్వర్తించవలసియుండును

37. కాంట్రాక్టు పక్షకారులు తమతమ వాగ్దానములను ఈ చట్టపు, లేక ఏదేని ఇతర శాసనపు నిబంధనల క్రింద నిర్వర్తించనక్కర లేకున్ననే తప్ప, లేక నిర్వర్తనను మాఫీచేసిననే తప్ప, నిర్వర్తించవలెను, లేక నిర్వర్తింపజూపవలెను. కాంట్రాక్టు పక్షకారుల బాధ్యత.

కాంట్రాక్టునుబట్టి తద్విరుద్ధమైన ఉద్దేశము కన్పించిననే తప్ప, వాగ్దానములను నిర్వర్తించుటకు ముందే వాగ్దాతలు మరణించిన సందర్భములో అట్టి వాగ్దాతల ప్రతినిధులు అట్టి వాగ్దానములకు బద్ధులైయుందురు.

ఉదాహరణములు

(ఏ) 1,000 రూపాయలు చెల్లించిన మీదట ఒక నిశ్చిత దినమున 'బీ'కి సరుకులను అందజేయుటకై 'ఏ' వాగ్దానము చేయును. ఆ దినమునకు ముందే 'ఏ' మరణించును. 'ఏ' యొక్క ప్రతినిధులు 'బీ'కి సరుకులను అందజేయుటకు బద్ధులైయుందురు. మరియు 'ఏ' యొక్క ప్రతినిధులకు 1,000 రూపాయలు చెల్లించుటకు 'బీ' బద్ధుడైయుండును.

(బీ) నిశ్చిత ధరకు నిశ్చిత దినములోపల 'బీ' కొరకు ఒక వర్ణచిత్రము వేయుటకు 'ఏ' వాగ్దానము చేయును. ఆ దినమునకు ముందే 'ఏ' మరణించును. ఆ కాంట్రాక్టు 'ఏ' యొక్క ప్రతినిధులచే గాని, 'బీ'చే గాని అమలుపరచబడజాలదు.

38. వాగ్దాత వాక్గ్రహీతకు నిర్వర్తింపజూపిన దానిని అంగీకరించనిచో, నిర్వర్తించనందుకు వాగ్దాత ఉత్తరదాయికాడు, మరియు అతడు కాంట్రాక్టు క్రింద తనకుగల హక్కులను కోల్పోవడు. నిర్వర్తింపజూపినపుడు అంగీకరించుటకు నిరాకరించినందు వలన కలుగు ప్రభావము.

అట్టి ప్రతియొక నిర్వర్తింపజూపుటలో ఈ క్రింది షరతులను పూర్తి చేయవలెను:-

(1) నిర్వర్తింపజూపుట షరతురహితముగ ఉండవలెను.

(2) నిర్వర్తింపజూపుట సముచిత సమయమునను, స్థలమునను జరుగవలెను, మరియు దానిని నిర్వర్తింపజూపిన వ్యక్తి తన వాగ్దానము ద్వారా తాను

చేయుటకు బద్ధుడైయున్న దానినంతను అక్కడికక్కడే అప్పటికప్పుడే చేయగలడనియు, చేయుటకు ఇష్టపడుచున్నాడనియు తెలిసికొనుటకు ఎవరికి నిర్వర్తింపజూపడమైనదో ఆ వ్యక్తికి యుక్తమైన అవకాశము ఉండునట్టి పరిస్థితులలోను, జరుగవలెను.

(3) నిర్వర్తింపజూపుట వాక్గ్రహీతకు దేనినైనను అందజేయుటకైనదైనచో అందజేయజూపిన వస్తువు వాగ్దాత తన వాగ్దానము ద్వారా అందజేయుటకు బద్ధుడై యున్న వస్తువేనని చూచుకొనుటకు వాక్గ్రహీతకు, యుక్తమైన అవకాశము ఉండవలెను.

అనేక సంయుక్త వాక్గ్రహీతలలో ఒకరికి నిర్వర్తింపజూపుటకు వారందరికిని నిర్వర్తింపజూపుటకు ఉండగల శాసనిక పరిణామమే ఉండును.

<u>ఉదాహరణ</u>

'ఏ' 100 బేళ్ల ప్రత్యేక నాణ్యతగల దూదిని 1873 మార్చి 1వ దినమున 'బీ' యొక్క గిడ్డంగి వద్ద అతనికి అందజేయుటకు కాంట్రాక్టు చేసుకొనును. ఈ పరిచ్ఛేదములో చెప్పబడినట్లుగా నిర్వర్తింపజూపుటకుగాను 'ఏ' ఆ దూదిని నియమిత దినముననుు, అందజేయజూపబడిన వస్తువు కాంట్రాక్టు చేసికొనిన నాణ్యతగల దూదియేననియు, 100 బేళ్లు ఉన్నవనియు తృప్తిచెందు అవకాశము 'బీ'కి ఉండునట్టి పరిస్థితులలోను 'బీ' యొక్క గిడ్డంగికి తేసుకొని రావలెను.

వాగ్దానమును సంపూర్ణముగా నిర్వర్తించుటకు పక్షకారు నిరాకరించినందువలన కలుగు ప్రభావము.

39. కాంట్రాక్టు పక్షకారొకరు తన వాగ్దానమునంతను నిర్వర్తించుటకు నిరాకరించినప్పుడుగాని, తనను తాను నిరర్హునిగా చేసుకొనినప్పుడుగాని, వాక్గ్రహీత మాటల ద్వారాన్నైనను, నడవడి ద్వారాన్నైనను కాంట్రాక్టును కొనసాగించుటకు తన మౌనాంగీకారమును సూచించిననే తప్ప, అతడు దానిని సమాప్తము చేయవచ్చును.

<u>ఉదాహరణములు</u>

(ఏ) 'ఏ' అను గాయకి ఒక రంగశాల (థియేటరు) మేనేజరు అయిన 'బీ'తో అతని రంగశాలలో (థియేటరులో) రాబోవు రెండు మాసములలో ప్రతి వారము రెండు రాత్రులు గానము చేయుటకు కాంట్రాక్టు చేసుకొనును మరియు గానము చేసిన ప్రతి రాత్రికి ఆమెకు 100 రూపాయల చొప్పున చెల్లించుటకు 'బీ' వచనబద్ధుడగును. ఆరవరాత్రి 'ఏ' రంగశాలకు బుద్ధిపూర్వకముగా గైరుహాజరగును. కాంట్రాక్టును సమాప్తము చేయుటకు 'బీ'కి స్వేచ్ఛ ఉండును.

(బీ) 'ఏ' అను గాయకి ఒక రంగశాల (థియేటరు) మేనేజరు అగు 'బీ'తో, అతని రంగశాలలో (థియేటరులో) రాబోవు రెండు మాసములలో ప్రతి వారములో రెండు రాత్రులు గానము చేయుటకు కాంట్రాక్టు చేసుకొనును, మరియు ప్రతి రాత్రికి ఆమెకు 100 రూపాయల చొప్పున చెల్లించుటకు 'బీ' వచనబద్ధుడగును. ఆరవరాత్రి 'ఏ' బుద్ధిపూర్వకముగా గైరుహాజరగును. 'బీ' అనుమతితో 'ఏ' ఏడవరాత్రి గానము చేయును. 'బీ' కాంట్రాక్టు కొనసాగుటకు తన మౌనాంగీకారమును సూచించినాడు, కావున దానిని ఇప్పుడు సమాప్తము చేయలేడు. కాని ఆరవరాత్రి 'ఏ' గానము చేయనందువలన తనకు కలిగిన నష్టమునకై పరిహారము పొందుటకు హక్కు కలిగియుండును.

## కాంట్రాక్టులను ఎవరు నిర్వర్తించవలసియుండును

40. ఏదేని కాంట్రాక్టులోగల ఏ వాగ్దానమునైనను స్వయముగ వాగ్దాతయే నిర్వర్తించవలెనని దాని పక్షకారుల ఉద్దేశమైనట్లు కేసు స్వభావమునుబట్టి కాన్పించునో, అట్టి వాగ్దానమును వాగ్దాతయే నిర్వర్తించవలెను. ఇతర కేసులలో, వాగ్దాతగాని, అతని ప్రతినిధులుగాని దానిని నిర్వర్తించుటకు సమర్థుడైన వ్యక్తిని నియోగించవచ్చును.

వాగ్దానమును నిర్వర్తించవలసిన వ్యక్తి.

### ఉదాహరణములు

(ఏ) 'ఏ' కొంత డబ్బును 'బీ'కి చెల్లించెదనని వాగ్దానము చేయును. 'ఏ' ఈ వాగ్దానమును, 'బీ'కి తానే చెల్లించుట ద్వారా గాని, దానిని 'బీ'కి మరొకరు చెల్లించునట్లు చేయుట ద్వారా గాని నిర్వర్తించవచ్చును; మరియు చెల్లింపు కొరకు నియతము చేసిన గడువుకు ముందే 'ఏ' మరణించినచో అతని ప్రతినిధులు ఆ వాగ్దానమును నిర్వర్తించవలెను, లేక అట్లు చేయుటకై తగిన వ్యక్తిని నియోగించవలెను.

(బీ) 'బీ' కొరకు ఒక వర్ణచిత్రమును వేసెదనని 'ఏ' వాగ్దానము చేయును. 'ఏ' ఈ వాగ్దానమును తానే నిర్వర్తించవలెను.

41. వాగ్దానమును అన్యవ్యక్తి నిర్వర్తించుటకు వాగ్గ్రహీత అంగీకరించినప్పుడు, అతడు ఆ తరువాత వాగ్దాతపై దానిని అమలుపరచజాలడు.

అన్య వ్యక్తిచే నిర్వర్తింపబడుటకు అంగీకరించినందువలన కలుగు ప్రభావము.

42. ఇద్దరు, లేక అంతకెక్కువ మంది వ్యక్తులు సంయుక్తముగా వాగ్దానము చేసినప్పుడు, కాంట్రాక్టునుబట్టి తద్విరుద్ధమైన ఉద్దేశము కాన్పించిననే తప్ప, అట్టి వ్యక్తులందరి జీవితకాలములో వారందరును మరియు వారిలో ఎవరైనను మరణించిన తరువాత ఉత్తర జీవితో లేక ఉత్తర జీవులతో సంయుక్తముగా అతని ప్రతినిధి మరియు అంతిమ ఉత్తరజీవి మరణించిన తరువాత సంయుక్తముగా వారందరి ప్రతినిధులు ఆ వాగ్దానమును పూర్తి చేయవలెను.

సంయుక్త దాయిత్వముల సంక్రమణము.

43. ఇద్దరు, లేక అంతకెక్కువ మంది వ్యక్తులు సంయుక్తముగా వాగ్దానమును చేసినప్పుడు, తద్విరుద్ధముగ అభివ్యక్తమైన కరారు లేనప్పుడు, వాగ్గ్రహీత అట్టి సంయుక్త వాగ్దాతలలో ఏ ఒక్కరినైనను, ఒకరికంటె ఎక్కువ మందినైనను వాగ్దానమునంతయు నిర్వర్తించవలెనని బలవంతపెట్టవచ్చును.

సంయుక్త వాగ్దాతలలో ఏ ఒక్కరినైనను, నిర్వర్తించుటకు బలవంతపెట్టవచ్చును.

ఇద్దరు, లేక అంతకెక్కువ మంది సంయుక్త వాగ్దాతలలో ప్రతి ఒక్కరు, కాంట్రాక్టునుబట్టి తద్విరుద్ధమైన ఉద్దేశము కాన్పించిననే తప్ప, వాగ్దానమును నిర్వర్తించుటకు తనతో సమానముగా అభిదాయము చేయవలెనని ప్రతియొక ఇతర వాగ్దాతను బలవంతపెట్టవచ్చును.

ప్రతి వాగ్దాతయు (ఇతర వాగ్దాతలను) అభిదాయము కొరకు బలవంతపెట్టవచ్చును.

ఇద్దరు, లేక అంతకెక్కువ మంది సంయుక్త వాగ్దాతలలో ఏ ఒక్కరైనను అట్టి అభిదాయము చేయనిచో అట్లు చేయనందువలన కలిగిన నష్టమును, మిగిలిన సంయుక్త వాగ్దాతలు సమానముగ భరించవలెను.

అభిదాయము చేయనందువలన కలుగు నష్టమును పంచుకొనుట.

విశదీకరణము:- ఈ పరిచ్ఛేదములో నున్నదేదియు, మూలఋణస్థుని తరపున హామీదారుచే చేయబడిన చెల్లింపులను మూలఋణస్థుని నుండి హామీదారు రాబట్టుకొనుటను నివారించదు, లేక మూలఋణస్థునిచే చేయబడిన చెల్లింపుల బాబతున హామీదారు నుండి దేనినైనను రాబట్టుకొనుటకు మూలఋణస్థునికి హక్కు కలిగించదు.

## ఉదాహరణములు

(ఏ) 'డీ'కి 3,000 రూపాయలు చెల్లించెదనమని 'ఏ', 'బీ', 'సీ'లు సంయుక్తముగా వాగ్దానము చేయుదురు. 'ఏ'ని గాని 'బీ'ని గాని, 'సీ'ని గాని 3,000 రూపాయలు చెల్లించుమని 'డీ' బలవంతపెట్టవచ్చును.

(బీ) 'డీ'కి 3,000 రూపాయలు చెల్లించెదమని ఏ,బీ,సీలు సంయుక్తముగా వాగ్దానము చేయుదురు. ఆ పూర్తి మొత్తమును చెల్లించవలెనని 'సీ' బలవంతపెట్టబడును. 'ఏ' దివాలాదారు అయితే అతని ఆస్తులు అతని ఋణములలో సగము చెల్లించుటకు సరిపోవును. 'ఏ' యొక్క సంపద నుండి 500 రూపాయలను, 'బీ' నుండి 1,250 రూపాయలను పొందుటకు 'సీ'కి హక్కు ఉండును.

(సీ) 'డీ'కి 3,000 రూపాయలు చెల్లించుటకు ఏ,బీ,సీలు సంయుక్తముగా వాగ్దానము చేయుదురు. 'సీ' ఏమియు చెల్లించలేకున్నాడు. మరియు ఆ పూర్తి మొత్తమును చెల్లించుటకు 'ఏ' బలవంతపెట్టబడును. 'బీ' నుండి 1,500 రూపాయలు పొందుటకు 'ఏ'కు హక్కు ఉండును.

(డీ) 'డీ'కి 3,000 రూపాయలు చెల్లించుటకు ఏ,బీ,సీలు సంయుక్తముగా వాగ్దానము చేయుదురు. 'ఏ', 'బీ'లు 'సీ'కి హామీదారులు మాత్రమే అయియున్నారు. 'సీ' ఏమియు చెల్లించలేకపోయినాడు. ఆ పూర్తి మొత్తమును చెల్లించుటకు 'ఏ', 'బీ'లు బలవంతపెట్టబడినారు. దానిని 'సీ' నుండి పొందుటకు వారికి హక్కు ఉండును.

*సంయుక్త వాగ్దాతలలో ఒకరిని నిర్ముక్తుని చేసినందువలన కలుగు ప్రభావము.*

44. ఇద్దరు, లేక అంతకెక్కువ మంది వ్యక్తులు సంయుక్తముగా వాగ్దానమును చేసియుండినయెడల, వాక్గ్రహీత అట్టి సంయుక్త వాగ్దాతలలో ఒకరిని నిర్ముక్తుని చేసినందున, ఇతర సంయుక్త వాగ్దాత, ఉన్మోచితుడు కాడు లేక ఇతర సంయుక్త వాగ్దాతలు ఉన్మోచితులుకారు. మరియు దానివలన అట్లు నిర్ముక్తులైన సంయుక్త వాగ్దాతలకు ఇతర సంయుక్త వాగ్దాత, లేక సంయుక్త వాగ్దాతల పట్లగల బాధ్యత తీరిపోదు.

*సంయుక్త హక్కుల సంక్రమణ.*

45. ఒక వ్యక్తి, ఇద్దరు, లేక అంతకెక్కువ మంది వ్యక్తులకు సంయుక్తముగా వాగ్దానము చేసినప్పుడు, కాంట్రాక్టునుబట్టి తద్విరుద్ధమైన ఉద్దేశము కాన్పించిననే తప్ప, నిర్వర్తనను క్లెయిముచేయు హక్కు, అతనికిని వారికిని సంబంధించినంతవరకు, వారి జీవితకాలములో వారందరికిని, వారిలో ఎవరైనను మరణించిన తరువాత ఉత్తరజీవితో లేక ఉత్తరజీవులతో సంయుక్తముగా అట్టి మృత వ్యక్తి ప్రతినిధికిని, అంతిమ ఉత్తరజీవి మరణించిన తరువాత సంయుక్తముగా వారందరి ప్రతినిధులకును ఉండును.

## ఉదాహరణము

'బీ', 'సీ'లు తనకు అప్పుగా ఇచ్చిన 5,000 రూపాయలకు ప్రతిఫలముగా ఆ సొమ్మును 'ఏ' ఒక నిర్దిష్ట దినమున వడ్డీతో తిరిగి చెల్లించెదనని బీ, సీలకు సంయుక్తముగా వాగ్దానము చేయును. 'బీ' మరణించును. నిర్వర్తనను క్లెయిము చేయు హక్కు, 'సీ' జీవితకాలములో 'సీ'తో సంయుక్తముగా 'బీ' యొక్క ప్రతినిధికిని, 'సీ' మరణించిన తరువాత సంయుక్తముగా 'బీ' 'సీ'ల ప్రతినిధులకును ఉండును.

## నిర్వర్తింపవలసిన సమయము మరియు స్థలము

46. కాంట్రాక్టునుబట్టి, వాక్గ్రహీత దరఖాస్తు చేయకుండనే వాగ్దాత తన వాగ్దానమును నిర్వర్తింపవలసియుండి, నిర్వర్తించుటకు గడువేదియు నిర్దిష్టము కానియెడల, ఆ వచనబంధమును యుక్తమైన గడువు లోపల నిర్వర్తింపవలెను.

దరఖాస్తు చేయ నక్కర లేనియెడల గడువు నిర్దిష్టము కానియెడల వాగ్దానమును నిర్వర్తింపవలసిన సమయము.

<u>విశదీకరణము</u>:- 'ఏది యుక్తమైన గడువు' అను ప్రశ్న, ప్రతియొక ప్రత్యేకమైన కేసులోను సంగతి విషయక ప్రశ్నయైయుండును.

47. వాగ్దానము నిశ్చిత దినమున నిర్వర్తింపవలసియుండి, వాక్గ్రహీత దరఖాస్తు చేయబడకుండనే దానిని నిర్వర్తించుటకు వాగ్దాత ఒప్పుకొనినప్పుడు అట్టి దినమున మామూలు వ్యాపార వేళలలో ఏ సమయమునందైనను ఆ వాగ్దానము ఎచ్చట నిర్వర్తింపబడవలసియున్నదో ఆ స్థలమున వాగ్దాత దానిని నిర్వర్తింప వచ్చును.

గడువు నిర్దిష్టమైయుండి దరఖాస్తు చేయ నక్కరలేనియెడల వాగ్దానమును నిర్వర్తింపవలసిన సమయమును, మరియు స్థలము.

## ఉదాహరణము

'ఏ' జనవరి మొదటి దినము 'బీ' యొక్క గిడ్డంగి వద్ద సరుకులను అందజేయుదునని వాగ్దానము చేయును. 'ఏ' ఆ దినమున 'బీ' యొక్క గిడ్డంగికి సరుకులను తెచ్చును, కాని మామూలుగా అది మూసివేయు వేళదాటిన తరువాత తెచ్చినందున అవి తీసికొనబడలేదు. 'ఏ' తన వాగ్దానమును నిర్వర్తించలేదు.

48. వాగ్దానము నిశ్చిత దినమున నిర్వర్తింపవలసియుండి, వాక్గ్రహీత దరఖాస్తు చేయకుండనే దానిని నిర్వర్తించు భారమును వాగ్దాత వహించనప్పుడు, సముచిత స్థలమునను, మామూలు వ్యాపార వేళలందును నిర్వర్తించుటకై దరఖాస్తు చేయుట వాక్గ్రహీత కర్తవ్యమైయుండును.

నిశ్చిత దినమున నిర్వర్తింపవలెనని దరఖాస్తు సముచిత సమయమున మరియు స్థలమున చేయ వలసియుండుట.

<u>విశదీకరణము</u>:- "ఏది సముచిత సమయము మరియు స్థలము" అను ప్రశ్న ప్రతియొక ప్రత్యేకమైన కేసులోను సంగతి విషయక ప్రశ్నయైయుండును.

**నిర్వర్తన కొరకు దరఖాస్తు చేయ నక్కరలేకయుండి స్థలము నియతము కానియెడల, వాగ్దానమును నిర్వర్తింపవలసిన స్థలము.**

49. వాక్‌గ్రహీత దరఖాస్తు చేయకుండనే, వాగ్దానము నిర్వర్తింపబడవలసి యుండి, దానిని నిర్వర్తించుటకు స్థలమేదియు నియతము కానప్పుడు, వాగ్దానమును నిర్వర్తించుటకు యుక్తమైన స్థలమును నియతము చేయుమని వాక్‌గ్రహీతకు దరఖాస్తు చేయుటయు, అట్టి స్థలమున దానిని నిర్వర్తించుటయు వాగ్దాత కర్తవ్యమైయుండును.

## ఉదాహరణ

వేయి మణుగుల జనుమును ఒక నియత దినమున 'బీ'కి అందజేసెదనని 'ఏ' ఒప్పుకొనును. దానిని తీసుకొనుటకై యుక్తమైన స్థలమును నియతము చేయుటకై 'ఏ', 'బీ'కి దరఖాస్తు చేయవలెను; మరియు అట్టి స్థలమున దానిని అతనికి అందజేయవలెను.

**వాక్‌గ్రహీత విహితపరచిన, లేక అనుమతించిన రీతిలో, లేక స్థలమున నిర్వర్తింపవలసి యుండుట.**

50. ఏదేని వాగ్దానమును, వాక్‌గ్రహీత విహితపరచిన, లేక అనుమతించిన ఏ రీతిలోనైనను, ఏ స్థలమునందైనను నిర్వర్తింపవచ్చును.

## ఉదాహరణములు

(ఏ) 'ఏ'కి 'బీ' 2,000 రూపాయలు బాకీ ఉండును. ఆ మొత్తమును 'సీ' అను బ్యాంకరు వద్ద 'ఏ' యొక్క ఖాతాలో జమకట్టుమని 'ఏ' 'బీ'ని కోరును. 'సీ' అను బ్యాంకరు వద్ద 'బీ' ఖాతా కూడ కలదు. 'బీ' ఆ మొత్తమును తన ఖాతా నుండి 'ఏ' ఖాతాకు బదిలీ చేయుట [illegible] ఆదేశించును మరియు 'సీ' ఆ విధముగా చేయును. ఆ తరువాత, ఆ బదిలీ [illegible] ని 'ఏ'కు తెలియకముందే 'సీ' యొక్క వ్యాపారము దెబ్బతినును. '[illegible]' సక్రమమైన చెల్లింపు చేయబడినది.

(బీ) 'ఏ' 'బీ'లు ఒకరికొకరు ఋణపడియుందురు. 'ఏ', 'బీ'లు ఒక పద్దును మరొక దానికి చెల్లుబెట్టును లెక్క పరిష్కారము చేసుకొని అట్టి పరిష్కారమునుప్పు తాను బాకీ ఉన్నట్లు కనుగొనబడిన మిగిలిన పైకమును 'బీ' 'ఏ'కి చెల్లించును. ఇది, 'ఏ' 'బీ'లు ఒకరికొకరు బాకీ ఉన్న మొత్తములను వారు చెల్లించినట్లు అగును.

(సీ) 'బీ'కి 'ఏ' 2,000 రూపాయలు బాకీ ఉండును. అప్పును తగ్గించుటకై 'ఏ' యొక్క సరుకులను 'బీ' స్వీకరించును. సరుకులను అందజేయుట అంశిక చెల్లింపు అగును.

(డీ) 'ఏ' తనకు 100 రూపాయలు బాకీ ఉన్న 'బీ'ని 100 రూపాయల కొరకు ఒక ప్రామిసరీ నోటును తనకు తపాల ద్వారా పంపుమని కోరును. 'బీ' ఆ నోటు కలిగియుండు జాబును యథోచితముగా 'ఏ' యొక్క చిరునామా వ్రాసి తపాలలో వేసిన వెంటనే ఆ అప్పు తీరినట్లగును.

## పరస్పర వాగ్దానముల నిర్వర్తన

51. కాంట్రాక్టు ఏకకాలములో నిర్వర్తించవలసియుండు పరస్పర వాగ్దానములతో కూడియున్నప్పుడు, వాగ్గ్రహీత తన పరస్పర వాగ్దానమును నిర్వర్తించుటకు సిద్ధముగను, సుముఖముగను ఉన్ననే తప్ప, వాగ్దాత తన వాగ్దానమును నిర్వర్తించనక్కరలేదు.

పరస్పర వాగ్గ్రహీత నిర్వర్తించుటకు సిద్ధముగను సుముఖముగను ఉన్ననే తప్ప, వాగ్దాత నిర్వర్తించుటకు బద్ధుడు కాకుండుట.

### ఉదాహరణములు

(ఏ) సరుకులను 'ఏ' 'బీ'కి అందజేయవలెనని, అవి అందిన మీదట 'బీ' అందుకై చెల్లింపు చేయవలెనని 'ఏ' 'బీ'లు కాంట్రాక్టు చేసుకొందురు.

సరుకులు అందిన మీదట చెల్లింపు చేయుటకు 'బీ' సిద్ధముగను సుముఖముగను ఉన్ననే తప్ప, 'ఏ' సరుకులను అందజేయనక్కరలేదు.

చెల్లించిన మీదట సరుకుల నందజేయుటకు 'ఏ' సిద్ధముగను సుముఖముగను ఉన్ననే తప్ప, 'బీ' వాటికి చెల్లింపు చేయనక్కరలేదు.

(బీ) 'ఏ' ఒక ధరకు సరుకులను 'బీ'కి అందజేయవలెనని, ఆ ధర వాయిదాలలో చెల్లింపబడవలెనని, మొదటి వాయిదాను సరుకులు అందిన మీదట చెల్లించవలెనని 'ఏ' 'బీ'లు కాంట్రాక్టు చేసుకొందురు.

సరుకులు అందిన మీదట మొదటి వాయిదాను చెల్లించుటకు 'బీ' సిద్ధముగను సుముఖముగను ఉన్ననే తప్ప, 'ఏ' సరుకులను అందజేయనక్కరలేదు.

మొదటి వాయిదాను చెల్లించిన మీదట 'ఏ' సరుకులను అందజేయుటకు సిద్ధముగను సుముఖముగను ఉన్ననే తప్ప, 'బీ' మొదటి వాయిదాను చెల్లించనక్కరలేదు.

52. పరస్పర వాగ్దానములను నిర్వర్తించవలసిన క్రమము కాంట్రాక్టు ద్వారా అభివ్యక్తముగా నియతము చేయబడినయెడల, అవి ఆ క్రమములో నిర్వర్తింపబడవలెను; ఆ క్రమము కాంట్రాక్టు ద్వారా అభివ్యక్తముగా నియతము చేయబడనియెడల, అవి ఆ వ్యవహార స్వభావమునుబట్టి అవసరమగు క్రమములో నిర్వర్తింపబడవలెను.

పరస్పర వాగ్దానములను నిర్వర్తించవలసిన క్రమము.

### ఉదాహరణములు

(ఏ) నియతమైన ధరకు 'బీ' కొరకు 'ఏ' ఒక ఇల్లు కట్టించవలెనని 'ఏ', 'బీ'లు కాంట్రాక్టు చేసుకొందురు. ఇల్లు కట్టుటకై 'ఏ' చేసిన వాగ్దానము, దానికై చెల్లించుట కొరకు 'బీ' చేసిన వాగ్దానమునకు ముందే నిర్వర్తింపబడవలెను.

(బీ) 'ఏ' తన వ్యాపార నిల్వలను 'బీ'కి నియతమైన ధరకు ఇచ్చునట్లు 'ఏ', 'బీ'లు కాంట్రాక్టు చేసుకొందురు. మరియు 'బీ' ఆ డబ్బు చెల్లింపునకై ప్రతిభూతి నిచ్చుటకు వాగ్దానము చేయును. వ్యవహార స్వభావమునుబట్టి 'ఏ' తన నిల్వలను అందజేయుటకు ముందు ప్రతిభూతి (సెక్యూరిటీ) తీసికొనుట అవసరము

కనుక 'ఏ' చేసిన వాగ్దానము, ప్రతిభూతి ఈయబడునంతవరకు నిర్వర్తింపబడ నక్కరలేదు.

ఏ సంఘటన జరిగిన మీదట కాంట్రాక్టు అమలు అగునో ఆ సంఘటనను నివారించు పక్షకారుయొక్క దాయిత్వము.

53. కాంట్రాక్టులో పరస్పర వాగ్దానములు ఉండి, ఆ కాంట్రాక్టు పక్షకారొకరు ఇతర పక్షకారును అతని వాగ్దానమును నిర్వర్తించకుండ నివారించినప్పుడు, కాంట్రాక్టు అట్లు నివారించబడిన పక్షకారు అభిమతానుసారము చెల్లనిదిగ చేయదగినదగును. మరియు ఆ కాంట్రాక్టు నిర్వర్తింపబడనందువలన తనకు కలిగిన ఏదేని నష్టమునకు ఇతర పక్షకారు నుండి నష్టపరిహారమును పొందుటకు అతనికి హక్కు ఉండును.

ఉదాహరణ

'ఏ' కొరకు 'బీ' ఫలానా పనిని వేయి రూపాయలకు చేయవలెనని 'ఏ' 'బీ'లు, కాంట్రాక్టు చేసుకొందురు. తదనుసారముగా 'బీ' ఆ పనిని చేయుటకు సిద్ధముగను సుముఖముగను ఉండును, కాని 'ఏ' అతనిని అట్లు చేయకుండ నివారించును. కాంట్రాక్టు 'బీ' అభిమతానుసారము చెల్లనిదిగ చేయదగినదగును; మరియు అతడు దానిని రద్దుచేయుటకు ఎంచుకొనినచో, అది నిర్వర్తించబడనందువలన తనకు కలిగిన ఏదేని నష్టమునకు 'ఏ' నుండి నష్టపరిహారమును రాబట్టుకొనుటకు అతనికి హక్కు ఉండును.

పరస్పర వాగ్దానములతో కూడిన కాంట్రాక్టులో మొదట నిర్వర్తింపబడ వలసిన వాగ్దానమును నిర్వర్తించనందువలన కలుగు ప్రభావము.

54. కాంట్రాక్టు పరస్పర వాగ్దానములతో కూడియుండి, వాటిలో ఒకటి, రెండవది నిర్వర్తింపబడువరకు నిర్వర్తింపబడజాలనిదిగాని, నిర్వర్తింపబడవలెనని క్లెయిము చేయబడజాలనిదిగాని అయియుండి, అట్టి రెండవ వాగ్దానపు వాగ్దాత దానిని నిర్వర్తించనప్పుడు, అట్టి వాగ్దాత పరస్పర వాగ్దానమును నిర్వర్తించవలెనని క్లెయిము చేయజాలడు, మరియు కాంట్రాక్టు నిర్వర్తింపబడనందువలన కాంట్రాక్టు యొక్క ఇతర పక్షకారుకు కలిగిన ఏదేని నష్టమునకు అట్టి ఇతర పక్షకారుకు నష్టపరిహారమును చెల్లించవలెను.

ఉదాహరణములు

(ఏ) 'ఏ' తాను ఇచ్చెడి సరుకులను నింపుకొని, వాటిని కలకత్తా నుండి మారిషస్‌కు చేరవేయుటకై 'బీ' యొక్క ఓడను కిరాయికి తీసుకొనును. అందుకు 'బీ' కొంత సరుకు రవాణా చార్జి తీసికొనవలసియుండును. 'ఏ' ఆ ఓడకు ఎట్టి సరుకులను ఈయడు. 'బీ' చేసిన వాగ్దానము నిర్వర్తించబడవలెనని 'ఏ' క్లెయిము చేయజాలడు, మరియు అతడు కాంట్రాక్టు నిర్వర్తింపబడనందువలన 'బీ'కి కలిగిన నష్టమునకు 'బీ'కి నష్టపరిహారమును చెల్లించవలసియుండును.

(బీ) ఫలానా కట్టడపు పనిని ఒక నియతమైన ధరకు చేసెదననియు ఆ పనికి అవసరమగు మంచెకట్టు సామాగ్రి మరియు కలప 'బీ' సరఫరా చేయవలెననియు 'ఏ' 'బీ'తో కాంట్రాక్టు చేసుకొనును. 'బీ' ఎట్టి మంచెకట్టు సామాగ్రిని గాని కలపను గాని ఇచ్చుటకు నిరాకరించును మరియు ఆ పని జరుగుటకు వీలుకాదు. 'ఏ' ఆ పనిని చేయనక్కరలేదు మరియు కాంట్రాక్టు నిర్వర్తింపబడనందువలన 'ఏ'కు కలిగిన ఏదేని నష్టమునకు అతనికి నష్టపరిహారము చెల్లించుటకు 'బీ' బద్ధుడైయుండును.

(సీ) ఒక మాసము వరకు వచ్చుటకు వీలులేని ఒక ఓడలోనున్న నిశ్చితమైన వాణిజ్య సరుకును నిర్దిష్టమైన ధరకు 'బీ'కి అందజేసెదనని 'బీ'తో 'ఏ'

కాంట్రాక్టు చేసుకొనును; ఆ కాంట్రాక్టు తేదీనుండి ఒక వారము లోపల ఆ వాణిజ్య సరుకు కొరకు చెల్లించుటకు 'బీ' వచనబద్ధుడగును. 'బీ' ఆ వారము లోపల చెల్లించడు. అందజేయుదునని 'ఏ' చేసిన వాగ్దానము నిర్వర్తింపబడనక్కరలేదు మరియు 'బీ' నష్టపరిహారమును చెల్లించవలసియుండును.

(డీ) 'ఏ' నూరుబేళ్ల వాణిజ్య సరకును 'బీ'కి విక్రయింతుననియు దానిని మరుసటి దినమున అందజేయుదుననియు 'బీ'కి వాగ్దానము చేయును మరియు 'బీ' మాసములోపల వాటికై చెల్లించెదనని 'ఏ'కు వాగ్దానము చేయును. 'ఏ' తన వాగ్దానము ప్రకారము అందజేయడు. చెల్లించెదనని 'బీ' చేసిన వాగ్దానమును నిర్వర్తించనక్కరలేదు; 'ఏ' నష్టపరిహారమును చెల్లించవలెను.

*సమయము ముఖ్యాంశమైన కాంట్రాక్టులో నియత సమయమునకు నిర్వర్తించనందు వలన కలుగు ప్రభావము.*

55. కాంట్రాక్టు పక్షకారు ఒకరు ఫలానా పనిని నిర్దిష్ట సమయమున లేక అంతకుముందు, లేక ఫలానా పనులను నిర్దిష్ట సమయములలో, లేక అంతకు ముందు చేయుదునని వాగ్దానము చేసియుండి అట్టి ఏదేని పనిని నిర్దిష్ట సమయమున, లేక అంతకుముందు చేయనప్పుడు, సమయము ఆ కాంట్రాక్టుకు ముఖ్యాంశమైనదని పక్షకారుల ఉద్దేశమైయుండినచో ఆ కాంట్రాక్టుగాని, నిర్వర్తించబడని అందలి భాగముగాని వాక్‌గ్రహీత అభిమతానుసారము చెల్లనిదిగ చేయదగినదగును.

*సమయము ముఖ్యాంశము కానప్పుడు అట్లు నిర్వర్తించనందు వలన కలుగు ప్రభావము.*

కాంట్రాక్టుకు సమయము ముఖ్యాంశమని పక్షకారుల ఉద్దేశముకానిచో, కాంట్రాక్టు, అట్టి పనిని నిర్దిష్ట సమయమున లేక అంతకుముందు చేయనందు వలన చెల్లనిదిగ చేయదగినదికాదు. కాని అట్లు చేయనందువలన వాక్‌గ్రహీతకు కలిగిన ఏదేని నష్టమునకు వాగ్దాత నుండి నష్టపరిహారమును పొందుటకు అతనికి హక్కు ఉండును.

*కరారు చేసికొనబడిన సమయమున కాక మరొక సమయమున నిర్వర్తనను అంగీకరించినందు వలన కలుగు ప్రభావము.*

వాగ్దాత తన వాగ్దానమును, కరారు చేసికొనబడిన సమయమున నిర్వర్తించనందువలన చెల్లనిదిగ చేయదగినదగు కాంట్రాక్టు విషయములో, కరారు చేసికొనబడిన సమయమున కాక మరొక సమయమున అట్టి వాగ్దానమును నిర్వర్తించుటను వాక్‌గ్రహీత అంగీకరించినచో, కరారు చేసికొనిన సమయమున వాగ్దానము నిర్వర్తింపబడనందువలన కలిగిన ఏదేని నష్టమునకు నష్టపరిహారమును క్లెయిము చేయుటకు తనకు గల ఉద్దేశమును గూర్చి వాక్‌గ్రహీత అట్లు అంగీకరించిన సమయమున వాగ్దాతకు నోటీసు ఇచ్చిననే తప్ప, అట్టి నష్టమునకై వాక్‌గ్రహీత నష్టపరిహారమును క్లెయిము చేయజాలడు.

*అసాధ్యమగు కార్యమును చేయుటకైన కరారు.*

56. స్వతః గా అసాధ్యమగు కార్యమును చేయుటకై చేసికొనిన కరారు చెల్లదు.

*కార్యము చేయుటకు కాంట్రాక్టు చేసికొనియుండి ఆ తరువాత ఆ కార్యము అసాధ్యమైపోవుట లేక శాసన సమ్మతము కానిదైపోవుట.*

ఒక కార్యము చేయుటకు కాంట్రాక్టు చేసికొనియుండి ఆ తరువాత అది అసాధ్యమైపోయినచో, లేక వాగ్దాత నివారింపజాలని ఒకానొక సంఘటన కారణముగా శాసనసమ్మతము కానిదైపోయినచో ఆ కాంట్రాక్టు, కార్యము అసాధ్యమైనదైనప్పుడు, లేక శాసనసమ్మతము కానిదైనప్పుడు చెల్లనిదగును.

అసాధ్యమైనదని, లేక శాసన సమ్మతము కానిదని తెలిసిన కార్యము నిర్వర్తింపబడనందు వలన కలుగు నష్టమునకు నష్ట పరిహారము.

ఒక వ్యక్తి దేనినైనను చేయుటకు వాగ్దానము చేసియుండి అది అసాధ్యమైనదని, లేక శాసనసమ్మతము కానిదని అతనికి తెలిసియుండినట్టిదై లేక యుక్తమైన జాగరూకత వహించినట్లయితే తెలిసికొనగలిగియుండెడిదై, అట్టిదని వాక్‌గ్రహీతకు తెలియనట్టిదైనయెడల, అట్టి వాగ్దాత ఆ వాగ్దానము నిర్వర్తింపబడనందువలన అట్టి వాక్‌గ్రహీతకు కలిగిన ఏదేని నష్టమునకై నష్టపరిహారమును చెల్లించవలెను.

## ఉదాహరణములు

(ఏ) 'ఏ' ఇంద్రజాలముతో నిక్షేపాన్ని కనిపెట్టెదనని 'బీ'తో కరారు చేసికొనును. ఆ కరారు చెల్లదు.

(బీ) 'ఏ' 'బీ'లు ఒకరినొకరు వివాహము చేసికొనుటకై కాంట్రాక్టు చేసుకొందురు. వివాహమునకు నియతము చేయుబడిన సమయమునకు ముందే 'ఏ' పిచ్చివాడగును. కాంట్రాక్టు చెల్లనిదగును.

(సీ) 'ఏ' అదివరకే 'సీ'ని వివాహము చేసికొనియుండియు, తనకు వర్తించెడి శాసనము ప్రకారము బహుభార్యాత్వము నిషిద్ధమైయుండి, 'బీ'ని వివాహము చేసుకొనుటకు కాంట్రాక్టు చేసుకొనును. 'ఏ' చేసిన వాగ్దానము నిర్వర్తింపబడనందువలన 'బీ'కి కలిగిన నష్టమునకు ఆమెకు 'ఏ' నష్టపరిహారమును చెల్లించవలసియుండును.

(డీ) 'ఏ' ఒక విదేశీ ఓడరేవునందు 'బీ' కొరకు సరుకులను నింపుకొందునని కాంట్రాక్టు చేసుకొనును. ఆ తరువాత 'ఏ' యొక్క ప్రభుత్వము ఆ ఓడరేవు ఉన్న దేశముతో యుద్ధము ప్రకటించును. యుద్ధము ప్రకటింపబడినప్పుడు ఆ కాంట్రాక్టు చెల్లనిదగును.

(ఈ) 'బీ'చే ముందుగా చెల్లింపబడిన డబ్బుకు ప్రతిఫలముగా ఆరు మాసములు ఒక రంగశాలలో (థియేటరు) నటించెదనని 'ఏ' కాంట్రాక్టు చేసుకొనును. 'ఏ' అనేక సందర్భములందు నటించలేనంతగా జబ్బుపడును. ఆ సందర్భములందు నటించుటకై చేసికొనిన కాంట్రాక్టు చెల్లనిదగును.

శాసనబద్ధమైన పనులను, మరియు శాసన విరుద్ధమైన ఇతర పనులను కూడ చేయుటకైన పరస్పర వాగ్దానము.

57. వ్యక్తులు, ప్రథమత: కొన్ని శాసనబద్ధమైన పనులు చేయుటకు ద్వితీయత: నిర్దిష్ట పరిస్థితులలో కొన్ని శాసనవిరుద్ధమైన ఇతర పనులు చేయుటకు, పరస్పరము వాగ్దానము చేసుకొన్నయెడల, మొదటి వాగ్దాన వర్గము కాంట్రాక్టు అగును — కాని రెండవది చెల్లని కరారు అగును.

## ఉదాహరణము

'ఏ' ఒక ఇంటిని 'బీ'కి 10,000 రూపాయలకు విక్రయించవలెనని, కాని, 'బీ' దానిని జూదగృహముగా ఉపయోగించుచో అతడు దానికి 50,000 రూపాయలు 'ఏ'కు చెల్లించవలెనని కరారు చేసుకొందురు.

మొదటి వర్గపు పరస్పర వాగ్దానములు, అనగా ఇంటిని విక్రయించుటకు, అందుకై 10,000 రూపాయలు చెల్లించుటకు చేసిన వాగ్దానములు కాంట్రాక్టు అగును.

రెండవ వర్గము శాసనవిరుద్ధ లక్ష్యము కొరకు అనగా 'బీ' ఆ ఇంటిని జూదగృహముగ ఉపయోగించుట కొరకు అయినది; అది చెల్లని కరారు అగును.

ప్రత్యామ్నాయ వాగ్దానము-ఒక శాఖ శాసన విరుద్ధమైయుండుట.

58. ప్రత్యామ్నాయ వాగ్దానపు ఒక శాఖ శాసనబద్ధమైయుండి మరొకటి శాసనవిరుద్ధమైయుండు సందర్భములో శాసనబద్ధమగు శాఖ మాత్రమే అమలు పరచదగియుండును.

## ఉదాహరణము

'ఏ' 'బీ'కి 1,000 రూపాయలు చెల్లించవలెనని, అందుకు 'బీ' ఆ తరువాత 'ఏ'కు బియ్యము గాని దొంగ రవాణా నల్లమందు గాని అందజేయవలెనని 'ఏ' 'బీ'లు కరారు చేసుకొందురు.

బియ్యము అందజేయుటకైనది శాసనమాన్యమైన కాంట్రాక్టు, మరియు నల్ల మందును గూర్చినది చెల్లని కరారు, అగును.

## చెల్లింపుల వినియోగము

ఉన్మోచన చేయవలసిన ఋణము సూచింపబడిన యెడల, చెల్లింపును ఉపయోగించుట.

59. ఒక ఋణస్థుడు ఒకే వ్యక్తికి అనేక విభిన్న ఋణములు బాకీ ఉండి, అతనికి చెల్లింపు చేయుచు దానిని ఒకానొక ప్రత్యేక ఋణము యొక్క ఉన్మోచనకై ఉపయోగింపవలెనని అభివ్యక్తముగ తెలియపరచినయెడల, లేక అట్లు ఉపయోగించ వలెనను భావమును గర్భితముగా సూచించు పరిస్థితులలో అతనికి చెల్లింపు చేసిన యెడల, ఆ చెల్లింపును అంగీకరించినచో, తదనుసారముగా ఉపయోగించవలసి యుండును.

## ఉదాహరణములు

(ఏ) 'ఏ' 'బీ'కి ఇతర ఋణములతోపాటు ఒక ప్రామిసరీ నోటుపై 1,000 రూపాయలు బాకీ ఉన్నాడు. ఆ బాకీని అతను జూను మొదటి దినమున చెల్లించ వలసియున్నది. అతడు 'బీ'కి అదే మొత్తమునకు ఇతర ఋణమేదియు బాకీలేదు. 'ఏ' జూను మొదటి దినమున 'బీ'కి 1,000 రూపాయలు చెల్లించును. ఆ చెల్లింపును ప్రామిసరీ నోటుయొక్క ఉన్మోచనకై ఉపయోగించవలెను.

(బీ) 'ఏ' 'బీ'కి ఇతర ఋణములతోపాటు 567 రూపాయల మొత్తమును బాకీ ఉన్నాడు. 'బీ' 'ఏ'కు వ్రాసి ఈ మొత్తమును చెల్లించుమని అడుగును. 'ఏ' 'బీ'కి 567 రూపాయలు పంపును. ఈ చెల్లింపును దేనిని చెల్లించుమని 'బీ' అడిగినాడో ఆ ఋణము యొక్క ఉన్మోచనకై ఉపయోగించవలెను.

ఉన్మోచన చేయవలసిన ఋణము సూచింపబడని యెడల చెల్లింపును ఉపయోగించుట.

60. ఏఋణమునకై చెల్లింపును ఉపయోగించవలెనో ఋణస్థుడు తెలియ జేయనియెడల మరియు అట్లు సూచించు ఇతర పరిస్థితులేవియు లేనియెడల, ఋణదాత, ఋణస్థుని నుండి తనకు వాస్తవముగా రావలసియుండి తనకు చెల్లించవలసియున్న శాసనసమ్మతమైన ఏ ఋణమునకైనను, దాని వసూలుకు, దావాల కాలపరిమితికి సంబంధించి తత్సమయమున అమలునందున్న శాసనము ద్వారా కాలదోషము పట్టినను పట్టకున్నను, తన వివేచనానుసారము ఉపయోగించ వచ్చును.

ఏ పక్షకారుగాని వినియోజనము చేయనియెడల, చెల్లింపును ఉపయోగించుట.

61. ఏపక్షకారుగాని వినియోజనమేదియు చేయనియెడల చెల్లింపును, కాలక్రమానుసారము ఋణముల ఉన్మోచనకై, అవి దావాల కాలపరిమితికి సంబంధించి తత్సమయమున అమలునందున్న శాసనము ద్వారా కాలదోషము పట్టనివైనను పట్టినవైనను ఉపయోగించవలెను, ఆ ఋణములు సమకాలికమైనవైనచో, ఆ చెల్లింపును అనుపాతికముగా ప్రతియొక దాని ఉన్మోచనకై ఉపయోగించవలెను.

## <u>నిర్వర్తించనక్కరలేని కాంట్రాక్టులు</u>

కాంట్రాక్టును నవీయనము, రద్దు మరియు మార్పుచేసినందు వలన కలుగు ప్రభావము.

62. కాంట్రాక్టు పక్షకారుల దానికి బదులు క్రొత్త కాంట్రాక్టును చేసుకొనుటకు, లేక దానిని రద్దు చేయుటకు లేక మార్పు చేయుటకు కరారు చేసుకొనినచో మూల కాంట్రాక్టును నిర్వర్తించనక్కరలేదు.

### <u>ఉదాహరణములు</u>

(ఏ) 'ఏ' ఒక కాంట్రాక్టు క్రింద 'బీ'కి డబ్బు బాకీ ఉన్నాడు. 'ఏ'కు బదులు 'సీ'ని 'బీ' తన ఋణస్థునిగ అంగీకరించవలెనని 'ఏ', 'బీ' 'సీ'లు కరారు చేసికొన్నారు. 'ఏ' 'బీ'కి చెల్లించవలసిన పాత ఋణము అంతమైనది మరియు 'సీ' నుండి 'బీ'కి రావలసియుండు క్రొత్త ఋణమునకై కాంట్రాక్టు చేసుకొనబడినది.

(బీ) 'ఏ' 'బీ'కి 10,000 రూపాయలు బాకీ ఉన్నాడు. 'ఏ' 'బీ'తో ఏర్పాటు చేసికొని 10,000 రూపాయల ఋణమునకు బదులు 5,000 రూపాయలకు తన ('ఏ' యొక్క) సంపదను 'బీ'కి తాకట్టు పెట్టును. ఇది ఒక క్రొత్త కాంట్రాక్టు, మరియు ఇది పాతదానిని అంతరింపజేయును.

(సీ) 'ఏ' 'బీ'కి ఒక కాంట్రాక్టు క్రింద 1,000 రూపాయలు బాకీ ఉన్నాడు. 'బీ' 'సీ'కి 1,000 రూపాయలు బాకీ ఉన్నాడు. 'బీ', 'ఏ'ని అతని పుస్తకములలో 'సీ'కి 1,000 రూపాయలు జమకట్టవలెనని ఆదేశించును, కాని 'సీ' ఈ ఏర్పాటుకు అనుమతించడు. 'బీ' ఇప్పటికిని 'సీ'కి 1,000 రూపాయలు బాకీ ఉన్నాడు మరియు క్రొత్త కాంట్రాక్టు ఏదియు చేసుకొనబడలేదు.

వాగ్గ్రహీత వాగ్దానమును నిర్వర్తించనక్కరలేదనవచ్చును, లేక దాని నిర్వర్తనమును తగ్గించవచ్చును.

63. ప్రతి వాగ్గ్రహీత తనకు చేసిన వాగ్దానమును పూర్తిగాగాని అందు కొంత గాని నిర్వర్తించనక్కరలేదనవచ్చును లేక దాని నిర్వర్తనమును తగ్గించవచ్చును, లేక దానిని నిర్వర్తించు గడువును పొడిగించవచ్చును, లేక దానికి బదులుగా సరియైనదని తాను తలచు ఏ తీరుదలనైనను అంగీకరించవచ్చును.

### <u>ఉదాహరణములు</u>

(ఏ) 'ఏ' 'బీ' కొరకు ఒక వర్ణచిత్రము వేసెదనని వాగ్దానము చేయును. 'బీ' ఆ తరువాత అతనిని ఆ చిత్రము వేయకూడదనును. 'ఏ' ఇక ఆ వాగ్దానమును నిర్వర్తించుటకు బద్ధుడుకాడు.

(బీ) 'ఏ' 'బీ'కి 5000 రూపాయలు బాకీ ఉన్నాడు. ఆ 5000 రూపాయలు చెల్లించవలసిన సమయమున మరియు స్థలమున 'ఏ' 'బీ'కి 2000 రూపాయలు చెల్లించగా మొత్తము ఋణము తీరుదల క్రింద 'బీ' స్వీకరించును, మొత్తము ఋణము ఉన్మోచనమైనది.

(సీ) 'ఏ' 'బీ'కి 5000 రూపాయలు బాకీ ఉన్నాడు. 'సీ' 'బీ'కి 1000 రూపాయలు చెల్లించగా 'ఏ'పై 'బీ'కి గల క్లెయిము తీరుదల క్రింద 'బీ' స్వీకరించును. ఈ చెల్లింపు మొత్తము క్లెయిము యొక్క ఉన్మోచన అగును.

(డీ) 'ఏ' ఎంత మొత్తమో అభినిశ్చయించబడని కొంత పైకమును ఒక కాంట్రాక్టు క్రింద 'బీ'కి బాకీ ఉన్నాడు. 'ఏ' ఎంత మొత్తమో అభినిశ్చయించకుండ 'బీ'కి 2000 రూపాయలు ఈయగా 'బీ' ఆ బాకీ తీరుదల క్రింద దానిని స్వీకరించును. ఇది, ఆ ఋణము ఎంత మొత్తమైననూ దాని యొక్క ఉన్మోచన అగును.

(ఈ) 'ఏ' 'బీ'కి 2000 రూపాయలు బాకీ ఉన్నాడు. మరియు ఇతర ఋణదాతలకు కూడ ఋణపడి ఉన్నాడు. 'ఏ' 'బీ'తో సహా తన ఋణదాతలతో వారి అభ్యర్థనలపై రాజీ మొత్తముగా రూపాయకు ఎనిమిది అణాలు వారికి చెల్లించుటకు ఏర్పాటు చేసుకొనును. 'బీ'కి చెల్లించిన 1000 రూపాయలు 'బీ' అభ్యర్థన యొక్క ఉన్మోచన అగును.

64. కాంట్రాక్టు ఎవరి అభిమతానుసారము చెల్లనిదిగ చేయదగినదో ఆ వ్యక్తి దానిని రద్దుచేసినయెడల, దాని ఇతర పక్షకారు దానిలో గల ఏ వాగ్దానమునకు అతడు వాగ్దాతయో ఆ వాగ్దానమును నిర్వర్తింపనక్కరలేదు. చెల్లనిదిగ చేయదగు కాంట్రాక్టును రద్దుచేయు పక్షకారు, అట్టి కాంట్రాక్టు యొక్క ఇతర పక్షకారు నుండి దాని క్రింద ఏదేని మేలు పొందియున్నచో అతడు అట్టి మేలు ఎవరి నుండి పొందినాడో ఆ వ్యక్తికి దానిని వీలైనంతమేరకు తిరిగి ఇచ్చివేయవలెను. చెల్లనిదిగ చేయదగిన కాంట్రాక్టును రద్దుచేసినందు వలన కలుగు పరిణామము.

65. ఒక కరారు చెల్లదని కనుగొనబడినప్పుడు, లేక కాంట్రాక్టు చెల్లనిదై పోయినప్పుడు అట్టి కరారు, లేక కాంట్రాక్టు క్రింద ఏదేని అనుకూల్యమును పొందిన ఏ వ్యక్తియైనను ఎవరి నుండి దానిని పొందినాడో ఆ వ్యక్తికి దానిని తిరిగి ఇచ్చివేయుటకు, లేక దానికి నష్టపరిహారము చెల్లించుటకు బద్ధుడైయుండును. చెల్లని కరారు క్రింద గాని చెల్లనిదైపోయిన కాంట్రాక్టు క్రింద గాని అనుకూల్యమును పొందిన వ్యక్తి యొక్క బాధ్యత.

## ఉదాహరణములు

(ఏ) 'ఏ' యొక్క కూతురగు 'సీ'ని వివాహము చేసుకొనెదనని 'బీ' వాగ్దానము చేసినందుకు ప్రతిఫలముగా 'ఏ' 'బీ'కి 1000 రూపాయలు చెల్లించును. ఆ వాగ్దానము చేసిన సమయమున 'సీ' మరణించియుండెను. ఆ కరారు చెల్లదు కాని 'బీ' 'ఏ'కు ఆ 1000 రూపాయలు తిరిగి చెల్లించవలెను.

(బీ) 'ఏ' మే నెల మొదటి దినమునకు ముందు 250 మణుగుల బియ్యమును 'బీ'కి అందజేయుదునని అతనితో కాంట్రాక్టు చేసుకొనును. 'ఏ' ఆ దినమునకు ముందు 130 మణుగుల బియ్యమును మాత్రమే అందజేయును మరియు ఆ తరువాత ఏమియు అందజేయడు. 'బీ' మే నెల మొదటి దినము తరువాత వాటిని ఉంచుకొనును. అతడు దానికై 'ఏ'కు చెల్లించుటకు బద్ధుడై యుండును.

(సీ) 'ఏ' అను గాయకి ఒక రంగశాల (థియేటరు) మేనేజరగు 'బీ' యొక్క రంగశాలలో (థియేటరు) మరుసటి రెండు మాసములలో ప్రతి వారము రెండు రాత్రులందు గానము చేయుటకు 'బీ'తో కాంట్రాక్టు చేసుకొనును.

మరియు గానము చేసిన ప్రతి రాత్రికి ఆమెకు వంద రూపాయలు చెల్లించుటకు 'బి' వచనబద్ధుడగును. 'ఏ' ఆరవరాత్రి బుద్ధిపూర్వకముగా రంగశాలకు గైరు హాజరగును మరియు 'బి' తత్పరిణామముగా కాంట్రాక్టును రద్దుచేయును. 'బి' 'ఏ'కు ఆమె గానము చేసిన ఐదు రాత్రులకు చెల్లించవలసియుండును.

(డి) ముందుగా చెల్లింపబడిన 1000 రూపాయలకు 'ఏ' ఒక సంగీత కచేరిలో 'బి' కొరకు గానము చేయుటకు కాంట్రాక్టు చేసుకొనును. 'ఏ' గానము చేయలేనంతగా జబ్బుపడును. 'ఏ' గానము చేయగలిగియుండినచో 'బి' హొంది యుండెడి లాభములను నష్టపోయినందుకు 'ఏ' 'బి'కి నష్టపరిహారమును చెల్లించుటకు బద్ధుడుకాడు, కాని ముందుగా చెల్లింపబడిన ఆ 1000 రూపాయలను 'బి'కి వాపసు చేయవలెను.

చెల్లనిదిగ చేయదగు కాంట్రాక్టును రద్దుచేయుటను, లేక ప్రతిసంహరించుటను సంసూచించు పద్ధతి.

66. చెల్లనిదిగ చేయదగు కాంట్రాక్టును రద్దుచేయుటను, ప్రతిపాదన యొక్క సంసూచనకు, లేక ప్రతిసంహరణకు వర్తించునట్టి రీతిగానే మరియు అట్టి నియమములకు లోబడియే సంసూచించవచ్చును లేక ప్రతిసంహరించవచ్చును.

నిర్వర్తించుటకు వాగ్దాతకు యుక్తమైన సదుపాయములను కలుగ చేయుటయందు వాక్గ్రహీత నిర్లక్ష్యముచేసినందువలన కలుగు ప్రభావము.

67. ఏవాక్గ్రహీతయైనను, వాగ్దాతకు అతని వాగ్దానమును నిర్వర్తించుటకు యుక్తమైన సౌకర్యములను కలుగజేయుటకు నిర్లక్ష్యము చేసినచో లేక నిరాకరించుచో, అట్టి నిర్లక్ష్యము లేక నిరాకరణ వలన దేనినైనను నిర్వర్తించినందుకు వాగ్దాత క్షమింపబడును.

<u>ఉదాహరణ</u>

'బి' యొక్క ఇంటిని మరమ్మతు చేయుదునని 'బి'తో 'ఏ' కాంట్రాక్టు చేసుకొనును.

'బి' తన ఇంటిలో మరమ్మతు చేయవలసిన స్థలములను 'ఏ'కు చూపుటకు నిర్లక్ష్యము చేయును లేక నిరాకరించును.

అట్టి నిర్లక్ష్యము, లేక నిరాకరణ వలన కాంట్రాక్టు నిర్వర్తింపబడకపోవుట జరిగినచో 'ఏ' అందుకు క్షమింపబడును.

<u>అధ్యాయము – 5</u>

<u>కాంట్రాక్టు ద్వారా ఏర్పరచబడు వాటిని పోలిన కొన్ని సంబంధములను గూర్చి</u>

కాంట్రాక్టు చేసుకొనుటకు అసమర్థుడగు వ్యక్తికి గాని, అతని బాబతున గాని సరఫరా చేయబడిన అవసర వస్తువుల విషయమున క్లెయిము.

68. కాంట్రాక్టు చేసుకొనుటకు అసమర్థుడైన వ్యక్తికి, లేక అతడు ఎవరిని పోషించుటకు శాసనరీత్యా బద్ధుడైయున్నాడో అట్టి ఏ వ్యక్తికైనను, అతని జీవన స్థాయికి తగినట్లు అవసరవస్తువులను మరొక వ్యక్తి సరఫరా చేసినచో, వాటికై అట్టి అసమర్థ వ్యక్తి ఆస్తినుండి చెల్లింపును పొందుటకు అట్టి వస్తువులను సమకూర్చిన వ్యక్తికి హక్కు ఉండును.

## ఉదాహరణములు

(ఏ) 'ఏ' ఉన్మాదుడగు 'బీ'కి అతని జీవనస్థాయికి తగినట్లు అవసర వస్తువులను సరఫరా చేయును. వాటికై 'బీ' ఆస్తి నుండి చెల్లింపును పొందుటకు 'ఏ'కు హక్కు ఉండును.

(బీ) 'ఏ' ఉన్మాదుడగు 'బీ' యొక్క భార్యాబిడ్డలకు వారి జీవనస్థాయికి తగినట్లు అవసరవస్తువులను సరఫరా చేయును. వాటికై 'బీ' ఆస్తి నుండి చెల్లింపును పొందుటకు 'ఏ'కు హక్కు ఉండును.

69. శాసనరీత్యా మరొకరు చెల్లించవలసిన డబ్బును చెల్లించుటలో హితము కలిగియున్నందున దానిని చెల్లించిన వ్యక్తికి, ఆ మరొకరి నుండి దానిని తిరిగి పొందుటకు హక్కు ఉండును.

మరొకరు చెల్లించవలసిన డబ్బును చెల్లించుటలో హితము కలిగియుండి చెల్లించిన వ్యక్తి దానిని తిరిగి పొందుట.

## ఉదాహరణము

'ఏ' అను జమీందారుచే ఈయబడిన కౌలుపై 'బీ' బెంగాలులో భూమిని కలిగియుండును. 'ఏ'చే ప్రభుత్వమునకు చెల్లించబడవలసిన శిస్తు బకాయపడి యున్నందున అతని భూమిని ప్రభుత్వము విక్రయమునకై ప్రకటించినది. అట్టి విక్రయ పరిణామముగా 'బీ' యొక్క కౌలు, రెవిన్యూ శాసనము క్రింద రద్దు అగును. 'బీ' ఆ విక్రయమును, తత్పరిణామముగ తన కౌలు రద్దు అగుటను నివారించుటకై 'ఏ' చెల్లించవలసిన డబ్బును ప్రభుత్వమునకు చెల్లించును. అట్లు చెల్లించిన మొత్తమును 'బీ'కి ప్రతిపూర్తి చేయుటకు 'ఏ' బద్ధుడైయుండును.

70. ఒక వ్యక్తి ప్రతిఫలరహితముగ చేయుటకు ఉద్దేశించక మరొక వ్యక్తి కొరకు దేనినైనను శాసనసమ్మతముగ చేసియుండి, లేక అతనికి దేనినైనను అందజేసి యుండి అట్టి మరొక వ్యక్తి దాని వలన కలిగిన మేలును అనుభవించినయెడల, ఆ వ్యక్తికొరకై అట్లు చేయబడిన కార్యము విషయమున నష్టపరిహారమును చెల్లించుటకు, లేక అట్లు అందజేయబడిన దానిని తిరిగి ఇచ్చుటకు ఆ మరొక వ్యక్తి బద్ధుడైయుండును.

సప్రతిఫల కార్యము వలన కలిగిన మేలును అనుభవించు వ్యక్తియొక్క బాధ్యత.

## ఉదాహరణములు

(ఏ) 'ఏ' అను వ్యాపారస్థుడు సరుకులను పొరపాటున 'బీ' ఇంటిలో పెట్టును. 'బీ' ఆ సరుకులను తన సొంతపువిగా ఉపయోగించుకొనును. అతడు వాటి కొరకు 'ఏ'కు చెల్లించుటకు బద్ధుడైయుండును.

(బీ) 'బీ' ఆస్తిని 'ఏ' అగ్నినుండి కాపాడును. 'ఏ' ప్రతిఫలరహితముగా అట్లు చేయుటకు ఉద్దేశించెనని పరిస్థితుల వలన విదితమగుచో 'బీ' నుండి నష్ట పరిహారము పొందుటకు 'ఏ'కు హక్కు ఉండదు.

71. మరొకరికి చెందిన సరుకులు దొరికినపుడు, వాటిని తన అధీనము లోనికి తీసికొనిన వ్యక్తి ఒక ఉపనిహితి (బెయిలీ) వలెనే ఉత్తరదాయిత్వమునకు లోబడియుండును.

సరుకులు దొరికిన వ్యక్తి యొక్క ఉత్తరదాయిత్వము.

హొరపాటు వలన గాని, పీడింపు వలన గాని డబ్బు ఎవరికి చెల్లింపబడినదో, లేక వస్తువు ఎవరికి అంద జేయబడినదో ఆ వ్యక్తి యొక్క దాయిత్వము.

72. హొరపాటు వలన గాని, పీడింపు వలన గాని ఎవరికి డబ్బు చెల్లింప బడినదో, లేక ఏదేని అందజేయబడినదో ఆ వ్యక్తి దానిని తిరిగి చెల్లించవలెను లేక తిరిగి ఇచ్చివేయవలెను.

ఉదాహరణములు

(ఏ) 'ఏ', 'బీ'లు 'సీ'కి సంయుక్తముగ 100 రూపాయలు బాకీ ఉండి 'ఏ' ఒక్కడే 'సీ'కి ఆ మొత్తమును చెల్లించును మరియు 'బీ' ఈ సంగతి తెలియక 'సీ'కి మరల 100 రూపాయలను చెల్లించును. 'సీ' ఆ మొత్తమును 'బీ'కి తిరిగి చెల్లించుటకు బద్ధుడైయుండును.

(బీ) ఒక రైల్వే కంపెనీ, నిశ్చిత సరుకులను రవాణా చేసినందులకు తమకు శాసనవిరుద్ధమైన చార్జిని చెల్లించిననే తప్ప, సరకుల రవాణాదారుకు (కన్‌స్నైనీకి) వాటిని అందజేయుటకు నిరాకరించును. సరుకుల రవాణాదారు, సరుకులను హొందు టకుగాను, చార్జి చేయబడిన ఆ మొత్తమును చెల్లించును. ఆ చార్జిని, శాసన విరుద్ధముగ ఎక్కువగ నున్నంతమేరకు తిరిగి రాబట్టుకొనుటకు అతనికి హక్కు ఉండును.

## అధ్యాయము - 6

## కాంట్రాక్టు భంగమువలని పరిణామములను గూర్చి

కాంట్రాక్టు భంగమువలన కలగిన నష్టము, లేక చెరుపునకు నష్టపరిహారము.

73. కాంట్రాక్టు భంగపరచబడినప్పుడు అట్టి భంగము వలన నష్టపడిన పక్షకారు అందువలన తనకు కలిగినట్టి సంఘటనల యొక్క మామూలు అను క్రమములో అట్టి భంగము నుండి ఉత్పన్నమైన, లేక పక్షకారులు కాంట్రాక్టు చేసుకున్నప్పుడు దాని భంగము వలన కలుగగలదని వారికి తెలిసియున్న ఏదేని నష్టము లేక చెరుపునకు కాంట్రాక్టును భంగపరచిన పక్షకారు నుండి నష్ట పరిహారము హొందుటకు హక్కు కలిగియుండును.

ఆ భంగము కారణముగ భరింపబడిన ఏదేని సుదూర లేక పరోక్ష నష్టము నకు, లేక చెరుపునకు అట్టి నష్టపరిహారమును ఈయనక్కరలేదు.

కాంట్రాక్టు ద్వారా ఏర్పరచిన వాటిని పోలిన బాధ్యతను నెర వేర్చనందుకు నష్టపరిహారము.

కాంట్రాక్టు ద్వారా ఏర్పరచబడు వాటిని పోలిన ఏదేని బాధ్యతకులోనైయుండి అది నెరవేర్చబడినప్పుడు, అది నెరవేర్చబడనందున హానికి గురియైన ఏ వ్యక్తి కైనను, నెరవేర్చని పక్షకారు నుండి, అతడు దానిని నెరవేర్చుటకు కాంట్రాక్టు చేసుకొనియుండి తన కాంట్రాక్టును భంగపరచియుండిన ఎట్లో అట్లే అదే నష్ట పరిహారమును హొందుటకు హక్కు ఉండును.

విశదీకరణము:- కాంట్రాక్టు భంగము నుండి ఉత్పన్నమైన నష్టమును, లేక చెరుపును అంచనా వేయుటలో, కాంట్రాక్టు నిర్వర్తింపబడనందులకు కలిగిన అసౌకర్యమును నివారించుటకు ఉన్న సాధనములను దృష్టియందుంచుకొనవలసి యుండును.

ఉదాహరణములు

(ఏ) నిశ్చిత ధరకు 50 మణుగుల సురేకారమును 'బీ'కి విక్రయించు టకును, అందజేయుటకును అందజేసిన మీదట చెల్లించవలసినట్లు 'ఏ' కాంట్రాక్టు

చేసుకొనును. 'ఏ' తాను చేసిన వాగ్దానమును భంగముచేయును. సురేకారము అందజేయవలసిన సమయమున అదేరకపు 50 మణుగుల సురేకారమును 'బీ' ఎంత ధరకు పొందగలిగియుండెడివాడో ఆ ధరకంటె కాంట్రాక్టు ధర ఎంత తక్కువ ఉన్నదో ఆ మొత్తమును నష్టపరిహార రూపమున 'ఏ' నుండి పొందుటకు 'బీ'కి హక్కు ఉండును.

(బీ) 'ఏ', 'బీ' యొక్క ఓడను, బొంబాయికి వెళ్ళి అచ్చట జనవరి మొదటి దినమున 'ఏ' సమకూర్చు సరుకులను ఓడపై ఎక్కించుకొని వాటిని కలకత్తాకు తెచ్చుటకును, రవాణా శుల్కమును ఆర్జించినప్పుడు చెల్లించునట్లును అద్దెకు తీసికొనును. 'బీ' యొక్క ఓడ బొంబాయికి వెళ్లదు. కాని 'ఏ' తాను ఏ నిబంధనలపై ఓడను అద్దెకు తీసుకొనెనో ఆ నిబంధనలంత అనుకూలమగు నిబంధనలపై తగిన వాహనమును సరుకుల కొరకు సేకరించుకొనుటకు అవకాశములుండెను. 'ఏ' ఆ అవకాశములను వినియోగించుకొనినాడు. కాని అట్లు చేయుటలో వ్యయప్రయాసలకు గురిఅయినాడు. అట్టి వ్యయప్రయాసల విషయమున 'బీ' నుండి నష్టపరిహారమును పొందుటకు 'ఏ'కు హక్కు ఉండును.

(సీ) 'ఏ' ఒక నిర్ణీత ధరకు 50 మణుగుల బియ్యమును 'బీ' నుండి కొనుటకు కాంట్రాక్టు చేసుకొనును. ఆ బియ్యము అందజేయుటకు గడువు ఏదియు నియతము కాలేదు. ఆ తరువాత 'ఏ' తనకు బియ్యము పంపబడినచో వాటిని తీసుకొనననని 'బీ'కి తెలియజేయును. "ఏ" తాను బియ్యమును తీసుకొనననని "బీ"కి తెలియజేసిన సమయమున 'బీ' ఆ బియ్యమునకు పొందగలిగెడి ధరకంటె కాంట్రాక్టు ధర ఎంత ఎక్కువ ఉండునో ఆ మొత్తమును నష్టపరిహార రూపమున 'ఏ' నుండి పొందుటకు 'బీ'కి హక్కు ఉండును.

(డీ) 'ఏ', 'బీ' యొక్క ఓడను 60,000 రూపాయలకు కొనుటకు కాంట్రాక్టు చేసుకొనును, కాని తన వాగ్దానమును భంగము చేయును. వాగ్దానము భంగమైనపుడు ఓడకొరకు 'బీ' పొందగలిగెడి ధరకంటె కాంట్రాక్టు ధర ఏమైన ఎక్కువ ఉన్నచో ఆ ఎక్కువ మొత్తమును నష్టపరిహార రూపమున 'ఏ', 'బీ'కి చెల్లించవలెను.

(ఈ) ఒక పడవ సొంతదారగు 'ఏ' ఒక నిర్దిష్ట దినమున బయలుదేరి జనుప సరుకును మీర్జాపూరులో విక్రయించుట కొరకు ఆ స్థలమునకు తీసికొని పోయెదనని 'బీ'తో కాంట్రాక్టు చేసుకొనును. నివారింపదగిన కారణము వలన పడవ నియత సమయమున బయలుదేరలేదు. అందువలన, ఆ రవాణా సరుకు మీర్జాపూరు చేరుట, కాంట్రాక్టు ప్రకారము పడవ బయలుదేరియుండినచో అది చేరియుండెడి సమయము దాటి ఆలస్యమైనది. ఆ తేదీ తరువాతను ఆ రవాణా సరుకు చేరుటకు పూర్వమును, జనుము ధర పడిపోవును. ఆ సరుకు యుక్త కాలమున పంపబడి యుండినచో, అది మీర్జాపూరుకు చేరియుండెడి సమయమున 'బీ' దానికి పొంద గలిగియుండెడి ధరకు, మరియు అది వాస్తవముగ చేరిన సమయమున దాని మార్కెట్టు ధరకు మధ్యగల వ్యత్యాసమును 'ఏ' 'బీ'కి చెల్లింపదగు నష్ట పరిహారపు మొత్తమైయుండును.

(యఫ్) 'బీ' యొక్క ఇంటిని నిశ్చిత రీతిగా మరమ్మత్తు చేయుటకు 'ఏ' కాంట్రాక్టు చేసుకొని ముందుగ చెల్లింపును పుచ్చుకొనును. 'ఏ' ఆ ఇంటిని మరమ్మత్తు చేయును. కాని కాంట్రాక్టు ప్రకారము కాదు. 'బీ' కాంట్రాక్టుకు అనుగుణముగా నుండునట్లు మరమ్మత్తు చేయుటకగు ఖర్చును 'ఏ' నుండి రాబట్టుకొనుటకు 'బీ'కి హక్కు ఉండును.

(జీ) 'ఏ' తన ఓడను జనవరి మొదటి దినము నుండి ఒక సంవత్సరమునకు నిశ్చిత ధరకు 'బీ'కి అద్దెకిచ్చుటకు కాంట్రాక్టు చేసుకొనును. రవాణా శుల్కము రిగినది మరియు జనవరి మొదటి దినమున ఓడకొరకు పొందదగిన అద్దె ట్రాక్టు ధరకంటె మించి ఉన్నది. 'ఏ' తన వాగ్దానమును భంగము చేయును. ., కాంట్రాక్టు ధరకు, మరియు జనవరి మొదటి దినమున మరియు అప్పటి నుండి 'బీ' అటువంటి ఓడను ఒక సంవత్సరమునకు అద్దెకు తీసికొనగలిగియుండెడి ధరకు మధ్యగల వ్యత్యాసమునకు సమానమగు మొత్తమును 'బీ'కి నష్టపరిహార రూపమున చెల్లించవలెను.

(హెచ్) 'ఏ' తాను ఇనుమును సేకరించి అందజేయగల ధరకంటె హెచ్చుదగు నియతమైన ధరకు నిశ్చిత పరిమాణపు ఇనుమును 'బీ'కి సరఫరా చేయుదునని కాంట్రాక్టు చేసుకొనును. అట్టి ధర ఆ ఇనుమును 'ఏ' సేకరించి సరఫరా చేయ గలిగెడి దానికంటె ఎక్కువగా ఉన్నది. 'బీ' ఇనుమును పుచ్చుకొనుటకు తప్పుగా నిరాకరించును. 'బీ' ఇనుము యొక్క కాంట్రాక్టు ధరకు మరియు 'ఏ' దానిని పొంది అందజేయగలిగియుండెడి వ్యైకమునకు మధ్యగల వ్యత్యాసమును 'ఏ'కు నష్టపరిహార రూపమున చెల్లించవలెను.

(ఐ) 'ఏ' ఒక యంత్రమును తన మిల్లుకు ఆలస్యము లేకుండ చేర్చుటకు గాను సామాన్య వాహకుడైన 'బీ'కి అందజేయును. ఆ యంత్రము లేనందున తన మిల్లు నిలిపివేయబడినదని "ఏ", 'బీ'కి తెలియపరచును. 'బీ' యంత్రమును అందజేయుటకు నిష్కారణముగా ఆలస్యము చేయును, తత్పరిణామముగా 'ఏ' ప్రభుత్వముతో లాభదాయకమైన కాంట్రాక్టును పోగొట్టుకొనును. ఆ యంత్రము అందజేయబడుటకు ఆలస్యము జరిగిన కాలములో మిల్లు పనిచేసియుండినచో వచ్చి యుండెడి సగటు లాభపు మొత్తమును నష్టపరిహార రూపమున 'బీ' నుండి పొందుటకు 'ఏ'కు హక్కు ఉండును, కాని ప్రభుత్వ కాంట్రాక్టును పోగొట్టు కొనుట వలన కలిగిన నష్టమును పొందుటకు హక్కు ఉండదు.

(జే) 'ఏ' 1,000 టన్నుల ఇనుమును టన్ను 100 రూపాయల చొప్పున 'బీ'కి సరఫరా చేయుటకును, దానిని ఒక నిర్ణీత సమయమున అందజేయుటకును 'బీ'తో కాంట్రాక్టు చేసుకొనియుండి, తనకు 'బీ'తో గల కాంట్రాక్టును నిర్వర్తించుటకు ఇనుము కొనుగోలు చేయుచున్నట్లు 'సీ'తో చెప్పి టన్ను 80 రూపాయల చొప్పున 1000 టన్నుల ఇనుము కొనుగోలు చేయుటకు 'సీ'తో కాంట్రాక్టు చేసికొనును. 'సీ' తనకు 'ఏ'తో గల కాంట్రాక్టును నిర్వర్తించడు, 'ఏ' మరొక ఇనుమును సేకరించలేనందువలన 'బీ' కాంట్రాక్టును రద్దుచేయును. 'ఏ' 'బీ'తో తనకు గల కాంట్రాక్టును నిర్వర్తించియుండినట్లయితే లాభముగా పొందియుండెడి 20,000 రూపాయలను 'సీ' 'ఏ'కు చెల్లించవలెను.

(కే) 'ఏ' ఒక యంత్రమును నిర్దిష్ట ధరకు నియత దినము వరకు తయారుచేసి అందజేయుదునని 'బీ'తో కాంట్రాక్టు చేసుకొనును; నిర్దిష్ట సమయమునకు ఆ యంత్రమును 'ఏ' అందజేయనందున 'బీ' తాను 'ఏ'కు చెల్లించియుండెడి ధరకంటె ఎక్కువ ధరకు మరొక దానిని సేకరించవలసివచ్చినది. మరియు తాను 'ఏ'తో కాంట్రాక్టు చేసుకున్న సమయమున అన్యవ్యక్తితో చేసు కున్నట్టి (అప్పుడు 'ఏ'కు సంసూచింపబడని) కాంట్రాక్టును నిర్వర్తించలేక పోయినాడు మరియు ఆ కాంట్రాక్టును భంగముచేసినందుకు నష్టపరిహారమును చెల్లించవలసివచ్చినది. ఆ యంత్రము యొక్క కాంట్రాక్టు ధరకు మరియు

మరొకదాని కొరకు 'బీ' చెల్లించిన ప్రైకమునకు మధ్యగల వ్యత్యాసమును 'బీ'కి నష్టపరిహారముగా 'ఏ' చెల్లింపవలసియుండును, కాని నష్టపరిహార రూపమున 'బీ' అన్యవ్యక్తికి చెల్లించిన ప్రైకమును కాదు.

(యల్). భవన నిర్మాత అయిన 'ఏ' జనవరి మొదటి దినము వరకు ఒక ఇల్లుకట్టి పూర్తిచేయుటకు 'బీ'తో కాంట్రాక్టు చేసుకొనును. ఆ ఇంటిని 'సీ'కి అద్దెకిచ్చుటకై 'సీ'తో 'బీ' కాంట్రాక్టు చేసికొనియున్నందున దానిని జనవరి మొదటి దినమున 'సీ'కి స్వాధీనము చేయుటకు వీలుండుటకు గాను ఆ సమయమునకు దానిని నిర్మించి పూర్తిచేయవలెనని అట్టి కాంట్రాక్టు చేసుకొనబడినది. 'బీ' 'సీ'ల మధ్యగల కాంట్రాక్టును గురించి 'ఏ'కు తెలియపరచబడినది. 'ఏ' ఆ ఇంటిని చాల అధ్వాన్నముగా నిర్మించినందున అది జనవరి మొదటి దినమునకు పూర్వమే కూలిపోయినది. మరియు దానిని 'బీ' తిరిగి నిర్మించవలసివచ్చినది. తత్పరిణామముగా 'సీ' నుండి పొందియుండెడి అద్దెను 'బీ' నష్టపోవును మరియు తన కాంట్రాక్టును భంగము చేసినందువలన 'సీ'కి నష్టపరిహారమును చెల్లించవలసివచ్చినది. ఆ ఇంటిని మరల నిర్మించుటకైన ఖర్చుకు, నష్టపోయిన అద్దెకు మరియు 'సీ'కి చెల్లించబడిన నష్టపరిహారమునకు 'ఏ' 'బీ'కి నష్టపరిహారమును చెల్లించవలెను.

(యమ్) 'ఏ' నిశ్చిత వాణిజ్య సరుకును అది ఒక ప్రత్యేక నాణ్యతగలదని వారంటీ ఇచ్చుచు 'బీ'కి విక్రయించును మరియు ఈ వారంటీ భరోసాపై అదే రకపు వారంటీతో దానిని 'సీ'కి విక్రయించును. సరుకులు వారంటీ ప్రకారము లేవని రుజువగును. మరియు 'బీ' నష్టపరిహార రూపమున కొంత డబ్బును 'సీ'కి చెల్లించవలసివచ్చినది. ఈ ప్రైకమును 'ఏ' నుండి తిరిగి పొందుటకు 'బీ'కి హక్కు ఉండును.

(యన్) ఒక నిర్దిష్ట దినమున 'బీ'కి కొంత డబ్బు చెల్లిస్తానని 'ఏ' కాంట్రాక్టు చేసుకొనును. ఆ దినమున 'ఏ' ఆ డబ్బు చెల్లించలేదు. 'బీ' ఆ దినమున డబ్బు అందని పరిణామముగా తన అప్పులను చెల్లింపజాలనివాడై పూర్తిగా పతనమైపోయెను. చెల్లింతునని 'ఏ' తాను కాంట్రాక్టు చేసుకున్న అసలు డబ్బును, చెల్లింపు దినము వరకు అగు వడ్డీని తప్ప వేనిని గాని 'బీ'కి చెల్లించుటకు బాధ్యుడు కాడు.

(ఓ) 'ఏ' 50 మణుగుల సురేకారమును నిర్దిష్ట ధరకు జనవరి మొదటి దినమున 'బీ'కి అందజేయుదునని కాంట్రాక్టు చేసుకొనును. 'బీ' ఆ తరువాత, జనవరి మొదటి దినపు మార్కెట్టు ధరకంటె ఎక్కువ ధరకు 'సీ'కి సురేకారమును విక్రయించుటకు జనవరి మొదటి దినమునకు పూర్వమే కాంట్రాక్టు చేసుకొనును. 'ఏ' తన వాగ్దానమును భంగము చేయును. 'ఏ' 'బీ'కి చెల్లించవలసిన నష్టపరిహారమును అంచనా వేయుటలో, జనవరి మొదటి దినపు మార్కెట్టు ధరను లెక్కలోనికి తీసుకొనవలసియుండును కాని 'సీ'కి విక్రయించుట వలన 'బీ'కి వచ్చియుండెడి లాభమును కాదు.

(పీ) 'ఏ' 500 బేళ్ల దూదిని ఒక నియత దినమున 'బీ'కి విక్రయించి అందజేయుటకు కాంట్రాక్టు చేసుకొనును. 'బీ' తన వ్యాపారమును నిర్వహించు పద్ధతిని గూర్చి 'ఏ'కు ఏమియు తెలియదు. 'ఏ' తన వాగ్దానమును భంగము చేయును మరియు 'బీ' దూది లేనందున తన మిల్లును మూసివేయుట తప్పనిసరి

అయినది. మిల్లు మూతపడినందున 'బీ'కి కలిగిన నష్టమునకు 'ఏ' 'బీ'కి ఉత్తరదాయి కాడు.

(క్యూ) ఒకానొక బట్టను 'బీ'కి జనవరి మొదటి దినమున విక్రయించి అంద జేయుదునని 'ఏ' కాంట్రాక్టు చేసుకొనును. ఆ బట్టతో ఒక ప్రత్యేక రకపు టోపీలను తయారు చేయవలెనని 'బీ' ఉద్దేశించెను. ఆ టోపీలకు ఆ కాలం (సీజను)లో తప్ప గిరాకీ ఉండదు. నియతమైన గడువు దాటువరకు ఆ బట్టను అందజేయలేదు. ఆ సంవత్సరము టోపీలు తయారుచేయుటలో దానిని ఉపయో గించుటకు వీలులేనంత ఆలస్యమైపోయినది. ఆ బట్టకై కాంట్రాక్టు చేసుకున్న ధరకు మరియు దానిని అందజేయవలసిన సమయమున దాని మార్కెట్టు ధరకు మధ్యగల వ్యత్యాసమును 'ఏ' నుండి నష్టపరిహార రూపమున పొందుటకు 'బీ'కి హక్కు ఉండును. కాని అతడు టోపీలు తయారుచేసి పొందదలచిన లాభములుగాని టోపీలు చేయుటకు చేసిన తయారీలో అతనికి అయిన వ్యయములు గాని పొందుటకు అతనికి హక్కు ఉండదు.

(ఆర్) ఒక ఓడ సొంతదారైన 'ఏ' జనవరి మొదటి దినమున బయలుదేరు నట్టి 'ఏ' యొక్క ఓడలో 'బీ'ని కలకత్తా నుండి సిడ్నీకి చేర్చుటకు కాంట్రాక్టు చేసుకొనును మరియు 'బీ' తన ప్రయాణపు కిరాయిలో సగమును 'ఏ'కు డిపాజిటు రూపమున చెల్లించును ఓడ జనవరి మొదటి దినమున బయలుదేరలేదు. తత్పరి ణామముగా 'బీ' కొంతకాలము పాటు కలకత్తాలో ఉండిపోయినందున కొంత వ్యయమునకు గురియైన తరువాత మరియొక జలయానములో సిడ్నీకి వెళ్ళను. తత్పరిణామముగా సిడ్నీకి చాల ఆలస్యముగా చేరుకొని కొంత డబ్బును నష్టపోవును. కలకత్తాలో అతడు ఉండిపోయినందున అతనికి అయిన వ్యయములు, మరియు ముదటి ఓడకు కరారు చేసుకొనిన ప్రయాణపు కిరాయి కంటె ఎక్కువ రెండవ దానికి చెల్లించినయెడల అట్టి ఎక్కువ మొత్తముతో సహా, వడ్డీన, 'బీ' యొక్క డిపాజిటును 'ఏ' 'బీ'కి తిరిగి చెల్లించుటకు బాధ్యుడైయుండును. కాని సిడ్నీకి చాల ఆలస్యముగ చేరుటవలన 'బీ' నష్టపడిన డబ్బుకు కాదు.

*శాస్తికొరకు ఉపబంధన చేయబడిన యెడల కాంట్రాక్టు భంగమునకు నష్టపరిహారము.*

74. కాంట్రాక్టు భంగము చేయబడినప్పుడు, అట్టి భంగము జరుగు సందర్భములో చెల్లించబడవలసిన మొత్తమని ఒక మొత్తము కాంట్రాక్టులో పేర్కొన బడినదో, లేక శాస్తి రూపమున ఏదేని ఇతర ఉపబంధన ఆ కాంట్రాక్టులో ఉన్నదో, అట్టి భంగమును గూర్చి ఫిర్యాదుచేయు పక్షకారు, వాస్తవమైన చెరుపు, లేక నష్టము అందువలన కలిగినదని రుజువు చేసినను, చేయకున్నను, అట్లు పేర్కొన బడిన మొత్తమునకు గాని, సందర్భానుసారముగా, ఉపబంధన చేయబడిన శాస్తికి గాని మించకుండ యుక్తమైన నష్టపరిహారమును, కాంట్రాక్టును భంగముచేసిన పక్షకారు నుండి పొందుటకు హక్కు కలిగియుండును.

<u>విశదీకరణము</u>:–వ్యతిక్రమము జరిగిన తేదీ నుండి హెచ్చు వడ్డీ కొరకైన ఉపబంధన శాస్తి రూపపు ఉపబంధన కావచ్చును.

<u>మినహాయింపు</u>:– ఎవరేని వ్యక్తి ఏదేని జామీను బాండును, ముచ్చిలకను, లేక అదే స్వభావము గల ఇతర పత్రమును వ్రాసి ఇచ్చినప్పుడు లేక ప్రజలకు హితము గల ఏదేని కర్తవ్యమును, లేక కార్యమును నిర్వర్తించుటకై ఏదేని శాసనపు నిబంధనల క్రింద గాని, కేంద్ర లేక ఏదేని రాజ్యప్రభుత్వ ఉత్తరువుల క్రింద గాని ఏదేని బాండు ఇచ్చినప్పుడు, అతడు, అట్టి ఏదేని పత్రమునందలి షరతు భంగము చేయబడిన మీదట, అందులో పేర్కొనిన పూర్తి మొత్తమును చెల్లించవలసి యుండును.

విశదీకరణము:- ప్రభుత్వముతో కాంట్రాక్టు చేసుకొనిన వ్యక్తి, తద్వారా అవశ్యకముగా ఏదేని పబ్లికు కర్తవ్యమును చేయపూనినట్లు గాని, ప్రజలకు హితము గల కార్యమును చేయుటకు వాగ్దానము చేసినట్లుగాని కాదు.

## ఉదాహరణములు

(ఏ) ఒక ఫలానా దినమున 'బీ'కి 500 రూపాయలు చెల్లించనిచో 'బీ'కి 1000 రూపాయలు చెల్లించెదనని 'ఏ' 'బీ'తో కాంట్రాక్టు చేసుకొనును. 'ఏ' ఆ దినమున 'బీ'కి 500 రూపాయలు చెల్లించడు. న్యాయస్థానము యుక్తమని తలచునట్లు, 1000 రూపాయలకు మించనట్టి నష్టపరిహారమును 'ఏ' నుండి రాబట్టుకొనుటకు 'బీ'కి హక్కు ఉండును.

(బీ) 'ఏ' 'బీ'తో, 'ఏ' కలకత్తా లోపల శస్త్రచికిత్సకుడుగా పనిచేయుచో తాను 'బీ'కి 5000 రూపాయలు చెల్లించెదనని కాంట్రాక్టు చేసుకొనును. 'ఏ' కలకత్తాలో శస్త్రచికిత్సకుడుగా పనిచేయుచుండును. న్యాయస్థానము యుక్తమని తలచునట్లు, 5000 రూపాయలకు మించనట్టి నష్టపరిహారమునకు 'బీ'కి హక్కు ఉండును.

(సీ) 'ఏ' ఒక నిశ్చిత దినమున న్యాయస్థానమునకు హాజరగుదుననియు అట్లు హాజరుకాని పక్షమున 500 రూపాయల శాస్తి చెల్లింతుననియు ముచ్చిలక నిచ్చును. అతని ముచ్చిలక సమపహృతమగును. అతడు మొత్తము శాస్తిని చెల్లించ వలసియుండును.

(డీ) 1000 రూపాయలను 12 శాతము వడ్డీ చొప్పున ఆరుమాసముల అంతమున తిరిగి చెల్లించెదనని 'ఏ', 'బీ'కి బాండు ఇచ్చును. అట్లు చెల్లించనిచో ఆ తేదీ నుండి 75 శాతము రేటు చొప్పున వడ్డీ చెల్లించవలసియుండునని ఆ బాండులో ఉపబంధన చేయబడినది. ఇది శాస్తి రూపపు ఉపబంధన మరియు న్యాయ స్థానము యుక్తమని తలచునట్టి నష్టపరిహారమును మాత్రమే 'ఏ' నుండి రాబట్టు కొనుటకు 'బీ'కి హక్కు ఉండును.

(ఈ) షాహుకారు అయిన 'బీ'కి డబ్బు బాకీ ఉన్న 'ఏ', అతనికి ఒక నిశ్చిత దినమున 10 మణుగుల ధాన్యమును అందజేయుట ద్వారా తిరిగి చెల్లించు టకు వచనబద్ధుడగును మరియు తాను నియత పరిమాణమును నియత తేదీనాటికి అందజేయని పక్షములో 20 మణుగుల ధాన్యము నందజేయుటకు బాధ్యుడనగుదునని ఉపబంధన చేయును. ఇది శాస్తి రూపపు, ఉపబంధన మరియు భంగము జరుగు సందర్భములో యుక్తమైన నష్టపరిహారమునకు మాత్రమే 'బీ'కి హక్కు ఉండును.

(యఫ్) 1000 రూపాయల అప్పును సమానముగ ఐదు మాసవారీ కిస్తులలో 'బీ'కి తిరిగి చెల్లించుటకు "ఏ" వచనబద్ధుడై ఏదేని కిస్తును చెల్లించనిచో పూర్తి మొత్తము చెల్లింపబడవలసియుండునను ఉపబంధనచేయును. ఇది శాస్తి రూపపు ఉపబంధన కాదు మరియు కాంట్రాక్టు నిబంధనల ప్రకారము దానిని అమలుపరచ వచ్చును.

(జీ) 'ఏ' 100 రూపాయలను 'బీ' నుండి అప్పు తీసికొని, 40 రూపాయల చొప్పున వార్షికమైన ఐదు కిస్తులలో 200 రూపాయలు చెల్లించెదనని బాండు

ఇవ్వను. ఏదేని కిస్తును చెల్లించనిచో పూర్తి మొత్తము చెల్లింపబడవలసి యుండునని ఆ బాండులో ఉపబంధన చేయబడినది. ఇది శాస్తి రూపపు ఉపబంధన.

హక్కు పూర్వకముగా కాంట్రాక్టును రద్దుచేయు పక్షకారు నష్టపరిహారమునకు హక్కు కలిగియుండుట.

75. హక్కు పూర్వకముగా కాంట్రాక్టును రద్దుచేయు వ్యక్తి, కాంట్రాక్టు నిర్వర్తింపబడనందున తనకు కలిగిన ఏదేని చెరుపుకై నష్టపరిహారమునకు హక్కు కలిగియుండును.

ఉదాహరణము

'ఏ' అను గాయకి ఒక రంగశాల (థియేటరు) మేనేజరగు 'బీ' యొక్క రంగశాలలో మరుసటి రెండు మాసములలో, ప్రతి వారము రెండు రాత్రులందు గానము చేయుటకు 'బీ'తో కాంట్రాక్టు చేసికొనును, మరియు గానము చేసిన ప్రతి రాత్రికి ఆమెకు 100 రూపాయలు చెల్లించుటకు 'బీ' వచనబద్ధుడగును. 'ఏ' ఆరవరాత్రి బుద్ధిపూర్వకముగా రంగశాలకు (థియేటరు) గైరుహాజరగును, మరియు 'బీ' తత్పరిణామముగా కాంట్రాక్టును రద్దుచేయును. కాంట్రాక్టు నెరవేర్చబడనందున తనకు కలిగిన చెరుపుకై నష్టపరిహారమును క్లెయిము చేయుటకు 'బీ'కి హక్కుయుండును.

(అధ్యాయము 7, పరిచ్ఛేదములు 76 నుండి 123 వరకు – (సరుకుల విక్రయము) సరుకుల విక్రయ చట్టము, 1930 యొక్క పరిచ్ఛేదము 65 ద్వారా రద్దు చేయబడినది).

## అధ్యాయము – 8

## నష్టపూర్తి మరియు హామీని గూర్చి

"నష్టపూర్తి కాంట్రాక్టు" నిర్వచనము.

124. ఏకాంట్రాక్టు ద్వారా ఒక పక్షకారు తన నడవడివలననే గాని, ఎవరేని ఇతర వ్యక్తి నడవడివలన గాని ఇతర పక్షకారుకు కలిగిన నష్టము నుండి అతనిని కాపాడెదనని వాగ్దానము చేయునో ఆ కాంట్రాక్టు "నష్టపూర్తి కాంట్రాక్టు" అనబడును.

ఉదాహరణము

200 రూపాయల నిశ్చిత మొత్తము విషయమున 'బీ'పై 'సీ' తెచ్చు ఏవేని చర్యల పరిణామముగ 'బీ'కి కలుగు నష్టమును పూర్తిచేసెదనని 'ఏ' కాంట్రాక్టు చేయును. ఇది నష్టపూర్తి కాంట్రాక్టు అగును.

దావా వేయబడినప్పుడు, నష్టపూర్తిదారి హక్కులు.

125. నష్టపూర్తి కాంట్రాక్టులోని వాక్‌గ్రహీతకు, తన ప్రాధికారము మేరకు వ్యవహరించుచు వాగ్దాత నుండి ఈ క్రింద తెలిపినవి రాబట్టుకొనుటకు హక్కు ఉండును:–

(1) నష్టపూర్తిచేయు వాగ్దానము వర్తించు ఏదేని విషయమును గురించిన ఏ దావాలోనైనను తాను తప్పనిసరిగ చెల్లించవలసియుండు అన్ని నష్టపరిహారములు;

(2) అట్టి ఏదేని దావాను వేయుటలో గాని, అందు ప్రతివాదము చేయుటలో గాని తాను వాగ్దాత ఉత్తరువులను ఉల్లంఘించకయుండి, నష్టపూర్తి కాంట్రాక్టు ఏదియు లేనపుడు తాను వ్యవహరించుట ప్రాజ్ఞత అయియుండెడి రీతిగా వ్యవహరించియుండినచో లేక దావాను వేయుటకుగాని, అందు ప్రతివాదము చేయుటకు గాని వాగ్దాత తనకు ప్రాధికారమిచ్చియుండినచో, అట్టి దావాలో తాను తప్పనిసరిగ చెల్లింపవలసియుండు అన్ని ఖర్చులు;

(3) అట్టి ఏదేని దావాలో రాజీచేసికొనుట వాగ్దాత ఉత్తరువులకు విరుద్ధముకానిచో నష్టపూర్తి కాంట్రాక్టు ఏదియు లేనప్పుడు వాక్గ్రహీత అట్టి రాజీ చేసికొనుట ప్రాజ్ఞత అయియుండెడిదైనచో, లేక ఆ దావాలో రాజీచేసికొనుటకు వాగ్దాత తనకు ప్రాధికారమిచ్చియుండినచో అట్టి రాజీ నిబంధనల ననుసరించి తాను చెల్లించిన అన్ని మొత్తములు.

126. "హామీ కాంట్రాక్టు" అనగా అన్యవ్యక్తి వ్యతిక్రమము జరిపినచో అతని వాగ్దానమును నిర్వర్తించుటకు, లేక దాయిత్వమును నిర్వహించుటకు అయిన కాంట్రాక్టు. హామీ ఇచ్చిన వ్యక్తి "హామీదారు" అనబడును; ఎవరి వ్యతిక్రమము విషయమున హామీ ఇవ్వబడినదో ఆ వ్యక్తి "మూలఋణస్థుడు" అనబడును; హామీ ఎవరికి ఈయబడినదో ఆ వ్యక్తి "ఋణదాత" అనబడును. హామీ వాగ్రూపమైనదైనను, లేక వ్రాతపూర్వకమైనదైనను కావచ్చును.

**"హామీ కాంట్రాక్టు" "హామీదారు" "మూల ఋణస్థుడు" మరియు "ఋణదాత".**

127. మూలఋణస్థుని మేలుకొరకు చేయబడిన ఏ పనియైనను, చేయబడిన ఏ వాగ్దానమైనను హామీ నిచ్చుటకొరకై హామీదారుకు చాలిన ప్రతిఫలమగును.

**హామీకి ప్రతిఫలము.**

## ఉదాహరణములు

(ఏ) తనకు సరుకులను అరువుగ విక్రయించి అందజేయవలెనని 'బీ' 'ఏ'ని కోరును. ఆ సరుకుల ధర చెల్లించుటకు 'సీ' హామీ ఇచ్చినట్లయితే అట్లు విక్రయించి అందజేయుటకు 'ఏ' ఒప్పుకొనును. సరుకులనందజేయుటకు 'ఏ' చేసిన వాగ్దానమునకు ప్రతిఫలముగ, చెల్లింపునకు హామీనిచ్చుటకు 'సీ' వాగ్దానము చేయును. ఇది 'సీ' చేసిన వాగ్దానమునకు చాలిన ప్రతిఫలమగును.

(బీ) 'ఏ' 'బీ'కి సరుకులను విక్రయించి అందజేయును. ఆ తదుపరి ఒక సంవత్సరము వరకు ఆ అప్పుకై 'బీ'పై దావా వేయకుండ ఉండవలెనని 'సీ' 'ఏ'ని కోరి అతడు అట్లు వేయకుండ ఉండుచో 'బీ' వ్యతిక్రమము జరిపినట్లయితే ఆ సరుకులకై తాను చెల్లించెదనని 'సీ' వాగ్దానము చేయును. కోరిన విధముగ దావావేయకుండుటకు 'ఏ' ఒప్పుకొనును. ఇది 'సీ' చేసిన వాగ్దానమునకు చాలిన ప్రతిఫలమగును;

(సీ) 'ఏ' 'బీ'కి సరుకులను విక్రయించి అందజేయును. ఆ తదుపరి, 'బీ' వ్యతిక్రమము జరిపినట్లయితే వాటికి తాను చెల్లించెదనని 'సీ' ప్రతిఫలము లేకుండ కరారు చేయును. ఆ కరారు చెల్లదు.

128. కాంట్రాక్టు ద్వారా వేరు విధముగా నిబంధింపబడిననే తప్ప, హామీదారు దాయిత్వము మూలఋణస్థుని దాయిత్వము ఉండునంత కాలము మరియు అంతమేరకు ఉండును.

**హామీదారు దాయిత్వము.**

ఉదాహరణము

అంగీకరణదారగు 'సీ' చెల్లించవలసిన వినిమయపత్రపు చెల్లింపునకై 'ఏ', 'బీ'కి హామీ ఇచ్చును. ఆ వినిమయపత్రము 'సీ'చే అనాదరింపబడినది. 'ఏ' వినిమయపత్రపు మొత్తమునేకాక దానిపై రావలసిన వడ్డీని మరియు చార్జీలను కూడ చెల్లించవలసియుండును.

అవిచ్ఛిన్నమైన హామీ.

129. వ్యవహారముల పరంపరకు విస్తరించు హామీ "అవిచ్ఛిన్నమైన హామీ" అనబడును.

ఉదాహరణములు

(ఏ) 'బీ'కి చెందిన జమీందారీ మక్తాలను వసూలు చేయుటలో 'బీ' 'సీ'ని నియోగించుటకు ప్రతిఫలముగ ఆ మక్తాలను 'సీ' తగురీతిగా వసూలుచేసి చెల్లించుటకై 5000 రూపాయల మొత్తమునకు బాధ్యతవహించెదనని 'ఏ' 'బీ'కి వాగ్దానము చేయును. ఇది అవిచ్ఛిన్నమైన హామీ.

(బీ) తేయాకు వర్తకుడగు 'బీ' అయా సమయములందు 'సీ'కి సరఫరా చేయు ఏదేని తేయాకు కొరకై 100 పౌనుల మొత్తము వరకు 'బీ'కి "ఏ" చెల్లించుటకై హామీ ఇచ్చును. 'బీ' 100 పౌనులకు మించిన విలువగల తేయాకును 'సీ'కి సరఫరా చేయును మరియు 'సీ' దానికై 'బీ'కి చెల్లింపు చేయును. ఆ తదుపరి 'బీ' 200 పౌనుల విలువగల తేయాకును 'సీ'కి సరఫరా చేయును. 'సీ' చెల్లింపు చేయడు. 'ఏ'చే ఈయబడిన హామీ అవిచ్ఛిన్నమైన హామీ, తదను సారముగా 100 పౌనుల మేరకు 'బీ'కి బాధ్యుడైయుండును.

(సీ) 'బీ'చే 'సీ'కి అందజేయబడవలసినట్టియు—ఒక మాసములోపల అందుకై చెల్లింపబడవలసియున్నట్టియు ఐదు సంచుల పిండి ధర చెల్లించుటకై 'ఏ' 'బీ'కి హామీ ఇచ్చును. 'బీ' ఐదు సంచులను 'సీ'కి అందజేయును. వాటికి 'సీ' చెల్లింపు చేయును. ఆ తదుపరి 'బీ' నాలుగు సంచులను 'సీ'కి అంద జేయును. దానికి 'సీ' చెల్లింపు చేయడు. 'ఏ'చే ఈయబడిన హామీ అవిచ్ఛిన్న మైన హామీకాదు, తదనుసారముగ ఆ నాలుగు సంచుల ధరకు అతడు బాధ్యుడు కాడు.

అవిచ్ఛిన్నమైన హామీయొక్క ప్రతిసంహరణ.

130. అవిచ్ఛిన్నమైన హామీని భావి వ్యవహారములకు సంబంధించినంతవరకు ఎప్పుడైనను హామీదారు ఋణదాతకు నోటీసు ఇచ్చి ప్రతిసంహరించవచ్చును.

ఉదాహరణములు

(ఏ) 'ఏ' కోరికపై 'సీ' కొరకైన వినిమయపత్రములను 'బీ' డిస్కౌంటు చేసినందుకు ప్రతిఫలముగ 'ఏ' 5000 రూపాయల మేరకు పండ్రెండు మాసముల వరకు అట్టి వినిమయపత్రములన్నింటి యొక్క సరియైన చెల్లింపునకై హామీ ఇచ్చును. 'బీ' 2000 రూపాయల మేరకు 'సీ' కొరకైన వినిమయపత్రములను డిస్కౌంటు చేయును. ఆ తదుపరి మూడు మాసముల అంతమున 'ఏ' హామీని ప్రతిసంహరించుకొనును. ఈ ప్రతిసంహరణ ఆ తరువాతి డిస్కౌంటు కొరకు 'బీ'పట్ల కలిగెడు మొత్తము దాయిత్వము నుండి 'ఏ'ని ఉన్మోచితుని చేయును. కాని 'సీ' వ్యతిక్రమము జరిపినట్లయితే 'ఏ' 2000 రూపాయలకు 'బీ'కి బాధ్యుడైయుండును.

(బీ) 'సీ'పై 'బీ' వ్రాయు వినిమయపత్రములన్నింటిని 'సీ' చెల్లించుననని 'ఏ' 10,000 రూపాయల వరకు 'బీ'కి హామీ ఇచ్చును. 'సీ'పై 'బీ' వినిమయ పత్రమును వ్రాయును; 'సీ' దానిని అంగీకరించును. 'ఏ' ప్రతిసంహరణ నోటీసు ఇచ్చును. ఆ వినిమయపత్రము పరిపక్వమైన మీదట 'సీ' దానిని అనాదరించును. 'ఏ' తన హామీ ప్రకారము బాధ్యుడైయుండును.

131. తద్విరుద్ధమైన కాంట్రాక్టు ఏదియు లేనపుడు, భావి వ్యవహారము లకు సంబంధించినంతవరకు అవిచ్ఛిన్నమైన హామీ, హామీదారు మరణించుటతో ప్రతిసంహరించబడినదగును.

హామీదారు మరణించుటవలన, అవిచ్ఛిన్నమైన హామీ యొక్క ప్రతిసంహరణ—

132. ఇద్దరు వ్యక్తులు ఒక నిశ్చిత దాయిత్వమును నిర్వర్తించు భారము వహించుటకు అన్య వ్యక్తితో కాంట్రాక్టు చేసుకొనియుండి, వారిలో ఒకరు వ్యతి క్రమము జరుపుతో మాత్రమే మరొకరు బాధ్యులగుదురని పరస్పరము కాంట్రాక్టు కూడ, ఆ అన్యవ్యక్తి అట్టి కాంట్రాక్టుకు పక్షకారు కాకుండ, చేసుకొనియున్న యెడల, అట్టి అన్యవ్యక్తికి రెండవ కాంట్రాక్టు ఉన్నదని తెలిసియుండినప్పటికిని, రెండవ కాంట్రాక్టు ఉన్నందువలన మొదటి కాంట్రాక్టు క్రింద అట్టి ఇద్దరు వ్యక్తులలో ప్రతి ఒకరికి ఆ అన్యవ్యక్తిపట్ల గల దాయిత్వమునకు భంగము కలుగదు.

ప్రధానముగా బాధ్యులగు ఇద్దరు వ్యక్తుల దాయిత్వమునకు, వారిలో ఒకరు వ్యతిక్రమము జరుపుతో మరొకరు హామీదారుగా ఉందురని వారు తమలో తాము చేసుకున్న ఏర్పాటు వలన భంగము కలుగదు.

ఉదాహరణము

'ఏ' 'బీ'లు సంయుక్తముగను, వేరువేరుగను బాధ్యులగునట్లు 'సీ'కి ఒక ప్రామిసరీనోటు రూపొందించి ఇచ్చినారు. 'ఏ' వాస్తవముగ, దానిని 'బీ'కి హామీదారుగ ఉండుటకే రూపొందించును మరియు ఆ నోటును రూపొందించినపుడు 'సీ'కి ఆ విషయము తెలిసియుండును; 'బీ'కి హామీదారుగ ఉండుటకు 'ఏ' ఆ నోటును రూపొందించెను మరియు ఆ విషయము 'సీ'కి తెలిసియుండినను సంగతి ఆ నోటును గూర్చి 'ఏ'పై 'సీ' వేయు దావాకు జవాబు కాదు.

133. మూల ఋణస్థునకును మరియు ఋణదాతకు మధ్యగల ఏదేని కాంట్రాక్టు నిబంధనలలో హామీదారు సమ్మతి లేకుండ ఏదేని మార్పు చేయబడినచో ఆ మార్పుకు తరువాత జరిగిన వ్యవహారములకు సంబంధించి హామీదారు ఉన్మోచితు డగును.

కాంట్రాక్టు నిబంధనలలో చేసిన మార్పు వలన హామీదారు ఉన్మోచితుడగుట.

ఉదాహరణములు

(ఏ) 'సీ' యొక్క బ్యాంకులో మేనేజరుగ 'బీ' నడవడికి 'ఏ' హామీదారు అగును. ఆ తరువాత, 'బీ' జీతము పెంచబడునట్లును, అతడు ఓవర్‌డ్రాఫ్టులపై వచ్చు నష్టములో నాల్గవ వంతుకు బాధ్యుడగునట్లును 'ఏ' సమ్మతి లేకుండ 'బీ' 'సీ'లు కాంట్రాక్టు చేసుకొందురు; "బీ" ఒక ఖాతాదారును ఓవరుడ్రా చేయుటకు అనుమతించును మరియు బ్యాంకు కొంత డబ్బును నష్టపోవును. 'ఏ' తన సమ్మతి లేకుండ కాంట్రాక్టులో మార్పు జరిగినందున తానిచ్చిన హామీ నుండి ఉన్మోచితుడగును మరియు ఈ నష్టమును పూరించుటకు అతనికి బాధ్యత ఉండదు.

(బీ) శాసనమండలి చట్టము ద్వారా కర్తవ్యములు నిశ్చయింపబడినట్టి పదవిలో 'బీ'ని 'సీ' నియమించినాడు ఆ పదవిలో 'బీ' చెడు నడవడికి పాల్పడినచో

తాను బాధ్యుడనగుదునని 'ఏ' 'సీ'కి హామీ ఇచ్చును. ఆ తదుపరి చట్టము ద్వారా పదవి స్వభావము ముఖ్యముగా మార్చబడినది. ఆ తరువాత 'బీ' చెడునడవడికి పాల్పడును; 'బీ' యొక్క చెడునడవడి, తరువాతి చట్టము వలన భంగము కలుగని కర్తవ్యమునకు సంబంధించినదైనప్పటికిని; 'ఏ' ఆ మార్పు వలన, తన హామీ క్రింద భావి బాధ్యత నుండి ఉన్మోచితుడగును.

(సీ) సరుకులను విక్రయించుటకు 'సీ' యొక్క గుమాస్తాగా నియమింపబడిన తరువాత "బీ" అట్టి గుమాస్తాగా అతనికి అందిన డబ్బుకు తగురీతిగా లెక్క చెప్పుటకు "సీ"కి 'ఏ' హామీ ఇచ్చును 'ఏ' హామీదారు అయిన మీదట, 'బీ'ని వార్షిక వేతనముపై తన గుమాస్తాగా నియమించుటకు 'సీ' అంగీకరించును. ఆ తరువాత, 'బీ'చే విక్రయింపబడిన సరుకులకు అతనికి కమీషను చెల్లింపవలయుననియు, నియతమైన జీతము కాదనియు 'సీ' 'బీ'లు 'ఏ'కి తెలియకుండ, లేక అతని సమ్మతి లేకుండ కరారు చేసుకొందురు. ఆ తరువాత 'బీ' పాల్పడిన చెడునడవడికి 'ఏ' బాధ్యుడు కాడు.

(డీ) 'సీ'చే అరువుపై 'బీ'కి సరఫరా చేయబడిన ఏదేని చమురుకు 3000 రూపాయల వరకు 'ఏ' 'సీ'కి అవిచ్ఛిన్నమైన హామీ ఇచ్చును. ఆ తరువాత 'బీ' ఇబ్బందికిలోనై, నగదు డబ్బు చెల్లింపుపై 'బీ'కి చమురును "ఏ" సరఫరా చేయుచుండవలెననియు, ఆ చెల్లింపులను 'బీ' 'సీ'ల మధ్య అప్పుడున్న ఋణములకు వినియోగించవలెననియు 'ఏ'కి తెలియకుండ 'బీ' 'సీ'లు కాంట్రాక్టు చేసుకొందురు. ఈ క్రొత్త ఏర్పాటు చేసికొనిన తరువాత సరఫరా చేయబడిన ఏవేని సరుకులకు 'ఏ' తన హామీపై బాధ్యుడు కాడు.

(ఈ) మార్చి 1వ దినమున 'బీ'కి 5000 రూపాయలను అప్పు ఇచ్చెదనని 'సీ' కాంట్రాక్టు చేసుకొనును. తిరిగి చెల్లింపుకు 'ఏ' హామీ ఇచ్చును. జనవరి 1వ దినమున 'సీ' 'బీ'కి 5000 రూపాయలను చెల్లించును. ఆ డబ్బు కొరకు మార్చి మొదటి దినమునకు పూర్వమే 'బీ'పై 'సీ' దావా వేయగలుగునట్లు కాంట్రాక్టు మార్చబడినందున 'ఏ' తన బాధ్యత నుండి ఉన్మోచితుడగును.

మూల ఋణస్థుని నిర్ముక్తి, లేక ఉన్మోచన వలన హామీదారు ఉన్మోచితుడగుట.

134. మూల ఋణస్థుడిని నిర్ముక్తుని చేయుచు ఋణదాతకు మరియు మూల ఋణస్థునకు మధ్య ఏదేని కాంట్రాక్టు జరిగినచో, లేక ఋణదాత ఏదేని కార్యము, లేక కార్యలోపము చేసియుండి దాని శాసనిక పరిణామముగా మూల ఋణస్థుడు ఉన్మోచితుడైనచో, హామీదారు ఉన్మోచితుడగును.

## ఉదాహరణములు

(ఏ) 'బీ'కి 'సీ' సరఫరా చేయు సరుకులకై 'ఏ' 'సీ'కి హామీ ఇచ్చును. 'సీ' 'బీ'కి సరుకులను సరఫరా చేయును, మరియు ఆ తరువాత 'బీ' ఇబ్బందికిలోనై, తన ఋణదాతలతో ('సీ'తో సహా) వారు తమ అభ్యర్థనల నుండి తనను నిర్ముక్తుని చేసినందుకు ప్రతిఫలముగ వారికి తన ఆస్తిని హస్తాంతరణ చేయుటకు కాంట్రాక్టు చేసుకొనును. ఇచ్చట 'సీ'తో చేసుకొనబడిన కాంట్రాక్టు ద్వారా 'బీ' తన ఋణము నుండి నిర్ముక్తుడైనాడు మరియు 'ఏ' తాను ఇచ్చిన హామీ నుండి ఉన్మోచితుడైనాడు.

(బీ) 'ఏ' యొక్క భూమిపై నీలిమందు పంట పండించి దానిని 'బీ'కి ఒక నియతమైన రేటుకు అందజేయుటకు 'ఏ' 'బీ'తో కాంట్రాక్టు చేసుకొనును;

ఈ కాంట్రాక్టును 'ఏ' నిర్వర్తించుటకుగాను 'సీ' హామీ ఇచ్చును. 'ఏ' యొక్క భూమికి నీరు పారించుటకు అవసరమైన ఒక జలధారను 'బీ' మరలించి తద్వారా నేలిమందును పండించకుండ అతనిని నివారించును. హామీపై 'సీ'కి ఇక మీదట ఎట్టి బాధ్యత ఉండదు.

(సీ) అవసరమగు కలపను 'బీ' సరఫరా చేసినమీదట 'బీ' కొరకు నియత మైన గడువులో నియతమైన ధరకు ఒక ఇల్లు కట్టుటకు 'ఏ' కాంట్రాక్టు చేసుకొనును. కాంట్రాక్టును 'ఏ' నిర్వర్తించుటకై 'సీ' హామీ ఇచ్చును. 'బీ' కలపను సరఫరా చేయడు. 'సీ' తన హామీ నుండి ఉన్మోచితుడగును.

135. ఋణదాత, మూల ఋణస్థునితో రాజీపడుచు, లేక అతనికి గడువు ఇచ్చుటకు, లేక అతనిపై దావా వేయకుండుటకు వాగ్దానము చేయుచు ఋణదాత మరియు మూల ఋణస్థుడు కాంట్రాక్టు చేసుకొనినచో, హామీదారు అట్టి కాంట్రాక్టుకు అనుమతి నొసగిననే తప్ప హామీదారు ఉన్మోచితుడగును.

ఋణదాత మూల ఋణస్థునితో రాజీపడినప్పుడు, అతనికి గడువు ఇచ్చినప్పుడు, లేక దావావేయ కుండుటకు ఒప్పుకున్నప్పుడు హామీదారు ఉన్మోచితుడగుట.

136. మూల ఋణస్థునకు గడువు ఇచ్చుటకై ఋణదాత మూల ఋణస్థునితో కాక అన్య వ్యక్తితో కాంట్రాక్టు చేసుకొనినయెడల హామీదారు ఉన్మోచితుడు కాడు.

మూల ఋణస్థునకు గడువు ఇచ్చుటకై అన్య వ్యక్తితో కరారు చేసుకొనబడి నప్పుడు హామీదారు ఉన్మోచితుడు కాడు.

<u>ఉదాహరణము</u>

'బీ'కి హామీదారుగా 'ఏ'చే వ్రాయబడి 'బీ'చే అంగీకరింపబడిన ఒక వాయిదా మీరిన వినిమయపత్రము యొక్క ధారకుడైన 'సీ' 'బీ'కి గడువు ఇచ్చుటకు 'యమ్'తో కాంట్రాక్టు చేసుకొనును. 'ఏ' ఉన్మోచితుడు కాడు.

137. ఋణదాత మూల ఋణస్థునిపై దావా వేయకుండ, లేక అతనిపై ఏదేని ఇతర ప్రత్యుపాయమును అమలు జరుపకుండ ఉన్నంత మాత్రమున, హామీలో తద్విరుద్ధమైన నిబంధన ఏదియు లేనప్పుడు, హామీదారు ఉన్మోచితుడు కాడు.

ఋణదాత దావా వేయకుండ ఉండుట వలన హామీదారు ఉన్మోచితుడు కాడు.

<u>ఉదాహరణము</u>

'ఏ'చే హామీ ఈయబడిన ఋణమును 'బీ' 'సీ'కి బాకీ ఉన్నాడు. ఆ ఋణము చెల్లింపవలసినదగును. ఆ ఋణము చెల్లింపవలసినదైన పిమ్మట ఒక సంవత్సరము వరకు 'సీ' 'బీ'పై దావా వేయడు. 'ఏ' తాను ఇచ్చిన హామీ నుండి ఉన్మోచితుడు కాడు.

138. తోడి హామీదారులున్నయెడల, ఋణదాత వారిలో ఒకరిని నిర్ముక్తుని చేసినందున ఇతరులు ఉన్మోచితులు కారు. మరియు దాని వలన నిర్ముక్తుడైన హామీదారుకు ఇతర హామీదార్లపట్లగల బాధ్యత తీరదు.

తోడి హామీదారు ఒకరు నిర్ముక్తుడైనందున ఇతరులు ఉన్మోచితులు కారు.

హామీదారుకు గల పారిణామిక ప్రత్యుపాయము నకు భంగము కలిగించు కార్య మును లేక కార్యలోపమును ఋణదాత చేసి నందున హామీ దారు ఉన్మోచితుడగుట.

139. ఋణదాత హామీదారు హక్కులకు అనుగుణముగలేని ఏదేని కార్యమును చేసియుండి, లేక హామీదారుపట్ల తన కర్తవ్యమైయుండి చేయవలసిన ఏదేని కార్యమును చేయకుండి తద్వారా మూల ఋణస్థునిపై హామీదారుకుండు పారిణామిక ప్రత్యుపాయమునకు భంగము కలిగినచో హామీదారు ఉన్మోచితుడగును.

## ఉదాహరణములు

(ఏ) కొంత మొత్తమునకు 'సీ' కొరకు ఒక ఓడను నిర్మించుటకును అందుకై పని నిశ్చిత దశలకు చేరగానే కిస్తులపై చెల్లింపబడుటకును 'బీ' కాంట్రాక్టు చేసుకొనును. 'బీ' కాంట్రాక్టును తగురీతిగా నిర్వర్తించుటకై 'ఏ' 'సీ'కి హామీదారుగను. 'ఏ'కు తెలియకుండ చివరి రెండు కిస్తులను 'సీ' ముందుగనే 'బీ'కి చెల్లించును. ఇట్టి ముందు చెల్లింపు వలన 'ఏ' ఉన్మోచితు డగును.

(బీ) 'బీ' చేతను, 'బీ'కి హామీదారుగ 'ఏ' చేతను 'సీ' పేర రూపొం దించబడినట్టి సంయుక్తముగను వేరువేరుగను బాధ్యతగల ప్రామిసరీనోటు ప్రతిభూతితోపాటు (సెక్యూరిటీ) 'బీ'కి చెందిన ఫర్నిచరును విక్రయించి ఆ విక్రయ రాబడిని ఆ నోటు ఉన్మోచనకై వినియోగించు అధికారమును 'సీ'కి ఇచ్చునట్టి ఆ ఫర్నిచరు యొక్క విక్రయాధికార పత్రముపై 'సీ' 'బీ'కి డబ్బు అప్పిచ్చును. ఆ తరువాత 'సీ' ఆ ఫర్నిచరును విక్రయించును. కాని అతని చెడునడవడి మరియు బుద్ధిపూర్వక నిర్లక్ష్యము వలన చాల తక్కువ ధర వచ్చినది. 'ఏ' ఆ నోటుపై తన బాధ్యత నుండి ఉన్మోచితుడగును.

(సీ) 'ఏ' 'యమ్'ను 'బీ' వద్ద శిక్షణ పొందుటకు ఉంచి 'యమ్' యొక్క విశ్వసనీయతను గురించి 'బీ'కి హామీ ఇచ్చును. 'బీ' తన వంతుగా కనీసము మాసమున కొకసారి 'యమ్' రొక్కమును సరిచూపునట్లు చూచుటకు వాగ్దానము చేయును. "బీ" తన వాగ్దానము ప్రకారము చేయడు మరియు 'యమ్' ధనాపహరణము చేయును. 'ఏ' తన హామీపై బాధ్యుడు కాడు.

చెల్లించినమీదట, లేక నిర్వర్తించిన మీదట హామీదారు హక్కులు.

140. హామీ ఈయబడిన అప్పు చెల్లించవలసినదైపోయిన యెడల, లేక హామీ ఈయబడిన కర్తవ్యమును నిర్వర్తించుటలో మూల ఋణస్థుడు వ్యతిక్రమము జరిపినయెడల, హామీదారు తాను చెల్లించుటకు, లేక నిర్వర్తించుటకు బాధ్యుడై యున్న దానినంతను చెల్లించిన మీదట, లేక నిర్వర్తించిన మీదట, మూల ఋణస్థునిపై ఋణదాతకు ఉండిన హక్కులన్నియు హామీదారులో నిహితమగును.

ఋణదాత పొందిన ప్రతిభూతుల (సెక్యూరిటీల) మేలుపొందుటకు హామీదారుకు హక్కు.

141. హామీ కాంట్రాక్టు చేసుకొనబడినప్పుడు మూల ఋణస్థునిపై ఋణదాత కలిగియున్న ప్రతియొక ప్రతిభూతి (సెక్యూరిటీల) వలని మేలు పొందుటకు హామీ దారుకు, - అట్టి ప్రతిభూతి (సెక్యూరిటీల) ఉన్నదని ఆ హామీదారుకు తెలిసి యున్నను, తెలియకున్నను,- హక్కు ఉండును, మరియు ఋణదాత అట్టి ప్రతిభూతిని (సెక్యూరిటీల) పోగొట్టుకొనినచో, లేక హామీదారు సమ్మతి లేకుండ వదులుకొనినచో హామీదారు ఆ ప్రతిభూతి (సెక్యూరిటీల) విలువ మేరకు ఉన్మోచితు డగును.

## ఉదాహరణములు

(ఏ) 'ఏ' యొక్క హామీపై 'సీ' తన అద్దెదారు అయిన 'బీ'కి 2000 రూపాయలు అప్పు ఇచ్చును. 'బీ' యొక్క ఫర్నీచరును తాకట్టు పెట్టుకొని 'సీ' 2000 రూపాయలకై అదనపు ప్రతిభూతిని (సెక్యూరిటీల) కూడ పొందియున్నాడు. 'సీ' ఆ తాకట్టును రద్దుచేయును. 'బీ' దివాలా తీయును. మరియు 'సీ' 'ఏ'పై అతడు ఇచ్చిన హామీపై దావా వేయును. ఆ ఫర్నీచరు విలువ మొత్తము మేరకు 'ఏ' తన బాధ్యత నుండి ఉన్మోచితుడగును.

(బీ) 'బీ'కి అప్పు ఇచ్చిన ఋణదాతయగు 'సీ' అట్టి అప్పుకై డిక్రీ ద్వారా ప్రతిభూతిని (సెక్యూరిటీ) పొందియున్నాడు. 'సీ' ఆ అడ్వాన్సుపై 'ఏ' నుండి కూడ హామీ పొందియున్నాడు. తదుపరి 'సీ' డిక్రీ క్రింద అమలులో 'బీ' యొక్క సరుకులను తీసుకొని, ఆ తరువాత 'ఏ'కు తెలియకుండ ఆ అమలును ఉపసంహరించుకొనును. 'ఏ' ఉన్మోచితుడగును.

(సీ) 'సీ' నుండి 'బీ'కి ఋణమును చేకూర్చుటకై, 'బీ'కి హామీదారుగ 'ఏ' 'బీ'తో కలిసి 'సీ'కి ఒక బాండును వ్రాసి ఇచ్చును. ఆ తరువాత 'సీ' అదే ఋణమునకై 'బీ' నుండి అదనపు ప్రతిభూతిని (సెక్యూరిటీ) పొందును. తదుపరి 'సీ' అదనపు ప్రతిభూతిని (సెక్యూరిటీ) వదులుకొనును. 'ఏ' ఉన్మోచితుడు కాడు.

142. వ్యవహారము యొక్క ముఖ్యమైన భాగమునకు సంబంధించి ఋణదాతచే గాని అతనికి తెలిసియుండి అతని సమ్మతితో గాని చేయబడిన అసత్యకథనము ద్వారా పొందబడిన ఏదేని హామీ శాసనమాన్యత లేనిదగును. అసత్యకథనము ద్వారా పొందిన హామీ శాసన మాన్యతలేనిదగును.

143. ముఖ్యమైన పరిస్థితిని గురించి మౌనమువహించుట ద్వారా ఋణదాత పొందిన ఏదేని హామీ శాసనమాన్యత లేనిదగును. కప్పిపుచ్చుట ద్వారా పొంద బడిన హామీ శాసనమాన్యత లేనిదగును.

## ఉదాహరణములు

(ఏ) 'ఏ' తన కొరకు డబ్బు వసూలు చేయుటకై 'బీ'ని గుమాస్తాగా నియోగించును. 'బీ' తాను వసూలుచేసిన కొన్నింటికి లెక్కచూపకుండును. మరియు 'ఏ' తత్పరిణామముగ అతడు తగురీతిగా లెక్కచూపుటకై ప్రతిభూతిని ఇవ్వవలెనని అతనిని కోరును. 'బీ' తగురీతిగా లెక్కచూపుటకై 'సీ' హామీ ఇచ్చును. 'బీ' యొక్క పూర్వపు నడవడిని గురించి 'ఏ' 'సీ'కి తెలియజెప్పడు. ఆ తదుపరి 'బీ' వ్యతిక్రమము జరుపును. ఆ హామీ శాసనమాన్యత లేనిదగును.

(బీ) 'సీ'చే 'బీ'కి 2,000 టన్నుల పరిమాణము వరకు సరఫరా చేయబడెడు ఇనుమునకై చెల్లింపు కొరకు 'ఏ' 'సీ'కి హామీ ఇచ్చును. మార్కెటు ధరకు మించి టన్నుకు ఐదు రూపాయల చొప్పున 'బీ' చెల్లించవలెనని, అట్టి అదనపు మొత్తమును పాత బాకీ తీరుదలకై వినియోగించబడవలెనని 'బీ' మరియు 'సీ' ప్రైవేటుగా కరారు చేసుకొందురు. ఆ కరారు 'ఏ' నుండి కప్పిపుచ్చబడినది. 'ఏ' హామీదారుగ బాధ్యుడు కాడు.

తోడి హామీదారు చేరునంతవరకు ఋణదాత కాంట్రాక్టుపై వ్యవహరించరాదను కాంట్రాక్టు ద్వారా ఇచ్చిన హామీ.

144. కాంట్రాక్టులో మరొక వ్యక్తి తోడి హామీదారుగా చేరునంతవరకు ఋణదాత దానిపై వ్యవహరించరాదని ఒక వ్యక్తి ఆ కాంట్రాక్టు ద్వారా హామీ ఇచ్చిన యెడల, ఆ మరొక వ్యక్తి చేరనిచో ఆ హామీకి శాసనమాన్యత ఉండదు.

హామీదారుకు నష్టపూర్తి చేయుటకైన గర్భిత వాగ్దానము.

145. ప్రతియొక హామీ కాంట్రాక్టులోను మూల ఋణస్థుడు హామీదారుకు నష్టపూర్తి చేయుటకు గర్భిత వాగ్దానముండును, మరియు హామీ క్రింద తాను సక్రమముగ చెల్లించినదేదియైనను మూల ఋణస్థుని నుండి వసూలు చేయుటకు హామీదారుకు హక్కు ఉండును. కాని అక్రమముగ చెల్లించిన మొత్తములను వసూలు చేయుటకు అతనికి హక్కు ఉండదు.

## ఉదాహరణములు

(ఏ) 'బీ' 'సీ'కి ఋణపడియున్నాడు మరియు ఆ ఋణమునకు 'ఏ' హామీదారుగా ఉన్నాడు. ఆ ఋణము చెల్లించుమని 'ఏ'ని 'సీ' అడుగగా 'ఏ' చెల్లించుటకు నిరాకరించును. ఆ మొత్తమునకు "ఏ"పై 'సీ' దావా వేయును. ప్రతివాదము చేయుటకు యుక్తమైన కారణములు ఉన్నందున 'ఏ' ఆ దావాలో ప్రతివాదము చేయును; కాని అతడు ఆ ఋణమును ఖర్చులతో చెల్లించవలసివచ్చును. అతడు ఖర్చులు మరియు మూల ఋణమునకు గాను అతడు చెల్లించిన మొత్తమును 'బీ' నుండి వసూలు చేయవచ్చును.

(బీ) 'సీ' కొంత డబ్బు 'బీ'కి అప్పు ఇచ్చును, మరియు 'బీ' కోరికపై ఆ మొత్తమునకు హామీగా 'ఏ'పై 'బీ' వ్రాసిన వినిమయపత్రమును 'ఏ' స్వీకరించును. ఆ వినిమయపత్రపు ధారకుడైన 'సీ' దానిని చెల్లించుమని 'ఏ'ని అడుగును. 'ఏ' చెల్లించుటకు నిరాకరించును, ఆ వినిమయపత్రముపై అతనిపై 'సీ' దావా వేయును. ప్రతివాదము చేయుటకు యుక్తమైన కారణములు లేకున్నను 'ఏ' ఆ దావాలో ప్రతివాదము చేయును, మరియు వినిమయపత్రపు మొత్తమును, మరియు ఖర్చులను చెల్లించవలసివచ్చును. అతడు వినిమయపత్రపు మొత్తమును 'బీ' నుండి వసూలు చేయవచ్చును, కాని దావాకు ప్రతివాదము చేయుటకు వాస్తవమైన కారణమేదియు లేనందున ఖర్చులకై చెల్లించిన మొత్తమును వసూలు చేయజాలడు.

(సీ) 'సీ' 'బీ'కి సరఫరా చేసెడు బియ్యము కొరకు 2000 రూపాయల మేరకు చెల్లించబడునని 'ఏ' 'సీ'కి హామీ ఇచ్చును. 2000 రూపాయల కంటె తక్కువ మొత్తపు బియ్యమును 'సీ' 'బీ'కి సరఫరా చేయును, కాని సరఫరా చేసిన బియ్యము విషయమున 'ఏ' నుండి 2000 రూపాయల మొత్తము చెల్లింపు పొందును. వాస్తవముగ సరఫరా చేయబడిన బియ్యపు ధర కంటె ఎక్కువ 'బీ' నుండి 'ఏ' వసూలు చేయజాలడు.

తోడి హామీదారులు సమానముగా అభిదాయము చేయవలసి యుండుట.

146. ఒకే ఋణము, లేక కర్తవ్యమునకు ఇద్దరు లేక అంతకెక్కువ మంది వ్యక్తులు, ఒకే కాంట్రాక్టు క్రిందనైనను వేరువేరు కాంట్రాక్టుల క్రిందనైనను ఒకరికి మరొకరి హామీ విషయము తెలిసియున్నను, తెలియకుండనైనను సంయుక్తముగ లేక వేరువేరుగ బాధ్యులగునట్లు తోడి హామీదారులైనయెడల, తద్విరుద్ధమైన కాంట్రాక్టు ఏదియు లేనప్పుడు, తోడి హామీదారులు తమకు సంబంధించినంత వరకు మొత్తము ఋణమును గాని, మూల ఋణస్థునిచే చెల్లింపబడక మిగిలియున్న భాగమును గాని సమాన వాటాలలో చెల్లించవలసియుండును.

## ఉదాహరణములు

(ఏ) 'ఇ'కి అప్పుగా ఇచ్చిన 3,000 రూపాయల మొత్తమునకు 'ఏ' 'బీ' 'సీ'లు 'డీ'కి హామీదారులు. 'ఇ' చెల్లించుటలో వ్యతిక్రమము జరుపును. 'ఏ' 'బీ' 'సీ'లు తమకు సంబంధించినంతవరకు ఒక్కొక్కరు 1,000 రూపాయలు చెల్లించవలసియుండును.

(బీ) 'ఇ'కి అప్పుగా ఇచ్చిన 1,000 రూపాయల మొత్తమునకు 'ఏ' 'బీ' 'సీ'లు 'డీ'కి హామీదారులు, మరియు 'ఏ' నాల్గవ వంతు మేరకు 'బీ' నాల్గవ వంతు మేరకు మరియు 'సీ' సగము మేరకు బాధ్యులు కావలెనని 'ఏ' 'బీ' 'సీ'ల మధ్య కాంట్రాక్టు జరిగినది. 'ఇ' చెల్లించుటలో వ్యతిక్రమము జరుపును. హామీదారులు తమకు సంబంధించినంత వరకు 'ఏ' 250 రూపాయలను, 'బీ' 250 రూపాయలను, మరియు 'సీ' 500 రూపాయలను చెల్లించవలసియుండును.

వేరు వేరు మొత్తములకు బద్ధులైయున్న తోటి-హామీదారుల దాయిత్వము.

147. వేరువేరు మొత్తములకు బద్ధులైయున్న తోటి హామీదారులు తమ తమ బాధ్యతల పరిమితులు అనుమతించుమేరకు, సమానముగ చెల్లించవలసియుండును.

## ఉదాహరణములు

(ఏ) 'ఇ'కి 'డీ' తగురీతిగా లెక్క చూపునను షరతుపై 'డీ'కి హామీదారులుగ 'ఏ' 'బీ' 'సీ'లు వేరువేరుగా బాధ్యులగునట్లు మూడు బాండ్లను వేరువేరు శాస్తులకు అనగా 'ఏ' 10,000 రూపాయలకు 'బీ' 20,000 రూపాయలకు మరియు 'సీ' 40,000 రూపాయలకు వ్రాసి ఇచ్చినారు. 'డీ' 30,000 రూపాయల మేరకు వ్యతిక్రమము జరుపును. 'ఏ' 'బీ' 'సీ'లు ప్రతి ఒక్కరు 10,000 రూపాయలు చెల్లించుటకు బాధ్యులైయుందురు.

(బీ) 'ఇ'కి 'డీ' తగురీతిగా లెక్కచూపునను షరతుపై 'డీ'కి హామీదారులుగ "ఏ" "బీ" "సీ"లు వేరువేరుగా బాధ్యులగునట్లు మూడు బాండ్లను వేరువేరు శాస్తులకు అనగా 'ఏ' 10,000 రూపాయలకు 'బీ' 20,000 రూపాయలకు మరియు 'సీ' 40,000 రూపాయలకు వ్రాసి ఇచ్చినారు. 'డీ' 40,000 రూపాయల మేరకు వ్యతిక్రమము జరుపును. 'ఏ' 10,000 రూపాయలను, మరియు 'బీ' 'సీ'లు ప్రతి ఒక్కరు 15,000 రూపాయలను చెల్లించుటకు బాధ్యులైయుందురు.

(సీ) 'ఇ'కి 'డీ' తగురీతిగా లెక్కచూపునను షరతుపై 'డీ'కి హామీదారులుగ 'ఏ' 'బీ' 'సీ'లు వేరువేరుగా బాధ్యులగునట్లు మూడు బాండ్లను వేరువేరు శాస్తులకు అనగా 'ఏ' 10,000 రూపాయలకు 'బీ' 20,000 రూపాయలకు, 'సీ' 40,000 రూపాయలకు వ్రాసి ఇచ్చినారు. 'డీ' 70,000 రూపాయల మేరకు వ్యతిక్రమము జరుపును. 'ఏ', 'బీ', 'సీ'లు ప్రతి ఒక్కరు తన బాండు మొత్తము శాస్తిని చెల్లించవలసియుండును.

## అధ్యాయము - 9

## ఉపనిధానము (బెయిల్మెంటును) గూర్చి

"ఉపనిధానము" (బెయిల్మెంటు) "ఉపనిధాత" (బెయిలరు) "ఉపనిహితి" (బెయిలీ) నిర్వచనము.

148. ఒక వ్యక్తి ఏదేని ప్రయోజనము కొరకు మరొక వ్యక్తికి సరుకులను ఆ ప్రయోజనము నెరవేరినప్పుడు అవి వాపసు చేయబడవలెనను, లేక వాటిని అంద జేసిన వ్యక్తి ఆదేశము ననుసరించి అన్యథా వ్యయనము చేయబడవలెనను కాంట్రాక్టుపై అందజేయుట "ఉపవిధానము" (బెయిల్మెంటు) అనబడును. సరుకు లను అందజేయు వ్యక్తి "ఉపవిధాత" (బెయిలరు) అనబడును. అది ఎవరికి అంద జేయబడినదో ఆ వ్యక్తి "ఉపనిహితి" (బెయిల్) అనబడును.

విశదీకరణము:- మరొక వ్యక్తి యొక్క సరుకులను ఇదివరకే తన స్వాధీనమునందు కలిగియున్న వ్యక్తి వాటిని బెయిలీగా ఉంచుకొందునని కాంట్రాక్టు చేసుకొనినచో తద్వారా అతడు, అవి బెయిల్మెంటు రూపమున అందజేయబడి యుండక పోయినప్పటికిని, బెయిలీ అగును మరియు సొంతదారు అట్టి సరుకుల యొక్క బెయిలరు అగును.

బెయిలీకి ఎట్లు అంద జేయబడును.

149. బెయిలీకి అందజేయుట, ఉద్దేశించిన బెయిలీ స్వాధీనము నందుగాని లేక అతని తరఫున సరుకులను ఉంచుకొనుటకు ప్రాధికారము పొందిన ఎవరేని వ్యక్తి స్వాధీనము నందుగాని వాటిని పెట్టినట్లుకాగల ఏ పనినైనను చేయుట ద్వారా, చేయబడవచ్చును.

బెయిలుచేసిన సరుకులలోని లోపములను వెల్లడించుట బెయిలరు కర్తవ్యము.

150. బెయిలరు, బెయిలుచేసిన సరుకులలో ఉన్నవని తనకు తెలిసినట్టియు, వాటిని ఉపయోగించుటలో వాస్తవముగా ఇబ్బంది కలిగించునట్టియు, లేక బెయిలీని అసాధారణమైన కష్టమునకు గురిచేయగలట్టియు లోపములను బెయిలీకి తప్పని సరిగ వెల్లడించవలసియుండును; మరియు అతడు అట్లు వెల్లడించనిచో, ప్రత్యక్ష ముగా అట్టి లోపముల వలన బెయిలీకి కలుగు నష్టమునకు అతడు ఉత్తరదాయి అగును.

సరుకుల కిరాయికి బెయిలు చేయబడినచో, బెయిలు చేయబడిన సరుకు లలో అట్టి లోపములు ఉన్నవని బెయిలరుకు తెలిసియున్నను, తెలియకున్నను, బెయిలరు అట్టి నష్టమునకు ఉత్తరదాయి అగును.

### ఉదాహరణములు

(ఏ) అసాధువైనదని తనకు తెలిసిన గుర్రమును 'ఏ' 'బీ'కి అరువిచ్చును. ఆ గుర్రము అసాధువైనదను సంగతిని అతడు వెల్లడి చేయడు. గుర్రము పరుగెత్తి పోవును. అది 'బీ'ని క్రింద పడవేయును మరియు అతడు క్షతుడగును. 'బీ'కి కలిగిన నష్టమునకు 'ఏ' ఉత్తరదాయి అగును.

(బీ) 'బీ' యొక్క వాహనమును 'ఏ' కిరాయికి తీసికొనును. వాహనము సురక్షితమైనది కాదు. 'బీ'కి ఆ విషయము తెలియదు మరియు 'ఏ' క్షతుడగును. 'ఏ'కు కలిగిన క్షతికి 'బీ' ఉత్తరదాయి అగును.

బెయిలీ తీసికొనవలసిన జాగ్రత్త.

151. బెయిల్మెంటు కేసులన్నింటిలోను బెయిలీ, అతనికి బెయిలు చేయబడిన సరుకుల పరిమాణము, నాణ్యత మరియు విలువయే గల తన స్వంత సరుకులపట్ల సాధారణ ప్రజ్ఞగల వ్యక్తి అటువంటి పరిస్థితులలో తీసుకొనునంత జాగరూకతనే అట్టి బెయిలు చేయబడిన సరుకులపట్ల తీసికొనుటకు బద్ధుడైయుండును.

152. బెయిలీ, బెయిలు చేయబడిన వస్తువుపట్ల, 151వ పరిచ్ఛేదములో తెలిపినంత జాగరూకత తీసికొనినచో, ప్రత్యేక కాంట్రాక్టు ఏదియు లేనప్పుడు, అతడు దాని నష్టము, నాశనము, లేక క్షయమునకు ఉత్తరదాయి కాడు.

బెయిలు చేయబడిన వస్తువుకు కలిగిన నష్టము మొదలగు వాటికి బెయిలీ ఎప్పుడు బాధ్యుడు కాడు.

153. బెయిలు చేయబడిన సరుకుల విషయమున బెయిలీ బెయిల్మెంటు షరతులకు అనుగుణముగలేని ఏదేని కార్యమును చేయుచో, బెయిల్మెంటు కాంట్రాక్టు బెయిలీ అభిమతముపై చెల్లనిదిగ చేయదగినదగును.

షరతులకు అనుగుణముగ లేని కార్యమును బెయిలీ చేసినందున బెయిల్మెంటు అంతమగును.

## ఉదాహరణము

స్వయముగ 'బీ'యే స్వారీచేయుటకై "బీ"కి 'ఏ' ఒక గుర్రమును అద్దెకిచ్చును. 'బీ' ఆ గుర్రమును తన వాహనమునకు కట్టి నడుపును. ఇది 'ఏ' అభిమతముపై బెయిల్మెంటు అంతమైనదగును.

154. బెయిలు చేయబడిన సరుకులను బెయిలీ, బెయిల్మెంటు షరతులకు అనుగుణముగ కాకుండ ఏదేని ఇతర విధముగ ఉపయోగించుచో, అతడు సరుకులను అట్లు ఉపయోగించుట వలన, లేక ఉపయోగించునపుడు వాటికి కలిగిన ఏదేని నష్టమునకు గాను బెయిలరుకు నష్టపరిహారమును చెల్లించుటకు బాధ్యుడై యుండును.

బెయిలు చేయబడిన సరుకులను అప్రాధికృతముగ ఉపయోగించు బెయిలీ యొక్క దాయిత్వము.

## ఉదాహరణములు

(ఏ) స్వయముగ 'బీ' మాత్రమే స్వారీచేయుటకై 'బీ'కి 'ఏ' ఒక గుర్రమును అరువిచ్చును. 'బీ' తన కుటుంబ సభ్యుడైన 'సీ'ని ఆ గుర్రమును స్వారీచేయుటకు అనుమతించును. 'సీ' జాగ్రత్తగా స్వారీచేయును; కాని ఆ గుర్రము ప్రమాదవశాత్తు పడిపోయి క్షతినొందును. గుర్రమునకు కలిగిన క్షతికై 'ఏ'కు 'బీ' నష్టపరిహారము నిచ్చుటకు బాధ్యుడైయుండును.

(బీ) వారణాసికి వెళ్లుదునని స్పష్టముగా చెప్పి 'ఏ' కలకత్తాలో 'బీ' నుండి ఒక గుర్రమును కిరాయికి తీసికొనును. 'ఏ' తగు జాగ్రత్తతో స్వారీ చేయును. కాని వారణాసికి బదులు కటక్ వెళ్లును. గుర్రము ప్రమాదవశాత్తు పడిపోయి క్షతినొందును. గుర్రమునకు కలిగిన క్షతికై 'బీ'కి 'ఏ' నష్ట పరిహారమును ఇచ్చుటకు బాధ్యుడైయుండును.

బెయిలరు సమ్మతితో అతని సరుకులను బెయిలీ తన సరుకులతో కలిపి నందువలన కలుగు ప్రభావము.

155. బెయిలరు సమ్మతితో, బెయిలరు సరుకులను బెయిలీ తన స్వంత సరుకులతో కలిపినచో అట్లు తయారైన మిశ్రమములో బెయిలరు మరియు బెయిలీ తమతమ వాటాల అనుపాతములో హితము కలిగియుందురు.

బెయిలరు సమ్మతి లేకుండ కలిపినచో ఆ సరుకులను వేరుచేయుటకు వీలు లేనప్పుడు కలుగు ప్రభావము.

156. బెయిలరు సమ్మతి లేకుండ, బెయిలరు సరుకులను బెయిలీ తన స్వంత సరుకులతో కలిపియుండి ఆ సరుకులను వేరుచేయుటకు గాని విభజించుటకు గాని వీలున్నచో, ఆ సరుకుల స్వామ్యము ఆయా పక్షకారులయందే ఉండును; కాని వాటిని వేరుచేయుటకు లేక విభజించుటకు అగు వ్యయమును, మరియు వాటిని కలిపినందువలన కలుగు ఏదేని నష్టమును బెయిలీ భరించవలసియుండును.

ఉదాహరణము

'ఏ' ఒకానొక గుర్తుగల 100 బేళ్ల దూదిని 'బీ'కి బెయిలు చేయును. 'ఏ' సమ్మతి లేకుండ "బీ" ఆ 100 బేళ్లను వేరే గుర్తుగల తన ఇతర బేళ్లతో కలుపును, తన 100 బేళ్లను తిరిగి పొందుటకు 'ఏ'కు హక్కు ఉండును, మరియు ఆ బేళ్లను వేరుచేయుటకగు వ్యయమును మరియు ఏదేని ఇతర ఆనుషంగిక నష్టమును "బీ" భరించవలసియుండును.

బెయిలరు సమ్మతి లేకుండ కలిపినచో ఆ సరుకులను వేరుచేయుటకు వీలున్నపుడు కలుగు ప్రభావము.

157. బెయిలరు సమ్మతి లేకుండ బెయిలరు సరుకులను బెయిలీ తన స్వంత సరుకులతో, బెయిలు చేయబడిన సరుకులను ఇతర సరుకుల నుండి వేరుచేసి తిరిగి ఇచ్చివేయుట అసాధ్యమగు రీతిలో కలిపినచో ఆ సరుకుల నష్టమునకై బెయిలీ నుండి నష్టపరిహారమును పొందుటకు బెయిలరుకు హక్కు ఉండును.

ఉదాహరణము

'ఏ' 45 రూపాయల విలువగల ఒక బేరలు కేపు పిండిని 'బీ'కి బెయిలు చేయును; 'ఏ' సమ్మతి లేకుండ ఆ పిండిని 'బీ' ఒక బేరలు 25 రూపాయలు మాత్రమే విలువగలిగిన తన స్వంత దేశవాళీ పిండితో కలుపును. 'ఏ'కు అతని పిండి నష్టమైనందుకు 'బీ' నష్టపరిహారము నివ్వవలెను.

అవసరమైన వ్యయములను బెయిలరు తిరిగి చెల్లించుట.

158. బెయిల్మెంటు షరతుల ననుసరించి, సరుకులను బెయిలీ, బెయిలరు కొరకు ఉంచవలసినవి, లేక కొనిపోవలసినవి, లేక వాటిపై పనిచేయవలసినవి అయి యుండ, బెయిలీ ప్రతిమూల్యమేదియు పొందదగియుండనియెడల, బెయిల్మెంటు నిమిత్తమై బెయిలీచే భరించబడిన అవసరమగు వ్యయములను బెయిలరు అతనికి తిరగ చెల్లించవలెను.

ప్రతిఫల రహితముగ ఎరవేయబడిన సరుకులను తిరిగి ఇచ్చుట.

159. ఒక వస్తువును ఉపయోగార్థమై ఎరవిచ్చు వ్యక్తి తాను దానిని నిర్దిష్ట సమయము కొరకు గాని నిర్దిష్ట ప్రయోజనము కొరకు గాని ఎరవిచ్చి యుండినను, ఆ ఎరవు ప్రతిఫలరహితమైనదైనచో, దానిని తిరిగి ఇవ్వవలెనని ఎప్పుడైనను కోరవచ్చును. కాని నిర్దిష్ట సమయము వరకు లేక ప్రయోజనము కొరకు అట్లు ఎరవేయబడినదను నమ్మకముపై ఎరవుకు తీసికొనిన వ్యక్తి ఎరవేయబడిన వస్తువును ఒప్పుకొనిన సమయమునకు ముందే తిరిగి ఇచ్చివేయుటవలన ఎరవు తీసికొనినందున తాను వాస్తవముగ పొందిన లాభమునకు మించిన నష్టము తనకు కలుగు రీతిలో వ్యవహరించియుండినచో, ఎరవిచ్చిన వ్యక్తి, దానిని తిరిగి ఇచ్చి వేయుటను తప్పనిసరి చేయుచో, ఎరవు తీసికొనిన వ్యక్తికి, అట్లు పొందబడిన లాభమునకు మించి అట్లు కలిగిన నష్టపు మొత్తమునకు నష్టపూర్తి చేయవలెను.

బెయిలు చేయబడిన సరుకులను గడువు ముగిసిన మీదట లేక ప్రయోజనము నెరవేరిన మీదట తిరిగి ఇచ్చివేయుట.

160. సరుకులను బెయిలుచేసిన గడువు ముగిసిన వెంటనే గాని లేక అవి బెయిలు చేయబడిన ప్రయోజనము నెరవేరిన వెంటనే గాని, అడుగకుండనే వాటిని బెయిలరు ఆదేశానుసారముగ తిరిగి ఇచ్చివేయుట లేక అందజేయుట బెయిలీ యొక్క కర్తవ్యమైయుండును.

161. బెయిలీ తప్పిదము వలన సరుకులు సకాలములో తిరిగి ఇచ్చివేయ బడనిచో అందజేయబడనిచో లేక తిరిగి ఇవ్వజూపబడనిచో లేక అందజేయజూపబడనిచో, అప్పటి నుండి ఆ సరుకుల విషయమున కలిగిన ఏదేని నష్టమునకు నాశము, లేక క్షయమునకు అతడు బెయిలరుకు ఉత్తరదాయి అగును. సరుకులను తగు రీతిగా తిరిగి ఇచ్చి వేయనపుడు బెయిలీ యొక్క ఉత్తర దాయిత్వము.

162. ప్రతిఫలరహితమైన బెయిల్మెంటు బెయిలరు గాని, బెయిలీ గాని మరణించుటవలన అంతమొందును. మరణము వలన ప్రతిఫలరహిత మైన బెయిల్మెంటు అంతమగుట.

163. తద్విరుద్ధమైన కాంట్రాక్టు ఏదియు లేనప్పుడు, బెయిలు చేయబడిన సరుకుల నుండి ప్రాప్తించిన ఏదేని వృద్ధిని, లేక లాభమును బెయిలీ, బెయిలరుకు గాని, అతని ఆదేశానుసారము గాని అందజేయవలసియుండును. బెయిలు చేయ బడిన సరుకుల నుండి కలిగిన వృద్ధి, లేక లాభమునకు బెయిలరు హక్కు కలిగియుండుట.

<u>ఉదాహరణము</u>

'ఏ' ఒక ఆవును జాగ్రత్తగా చూచుకొనుటకు 'బీ' అధీరక్షలో ఉంచును. ఆవుకు ఒక దూడ కలుగును. 'బీ' ఆ ఆవును దానితోపాటు దూడను 'ఏ'కు అందజేయవలసియుండును.

164. బెయిల్మెంటు చేయుటకు, లేక సరుకులను వాపసు పొందుటకు లేక వాటిని గురించి ఆదేశములనిచ్చుటకు బెయిలరు హక్కు కలిగియుండని కారణముగ బెయిలీకి కలుగు ఏదేని నష్టమునకు బెయిలరు బెయిలీకి ఉత్తరదాయి అగును. బెయిలీపట్ల బెయిలరుయొక్క ఉత్తరదాయిత్వము.

165. సరుకుల యొక్క అనేక సంయుక్త సొంతదారులు వాటిని బెయిలు చేసినచో, తద్విరుద్ధమైన కరారు ఏదియు లేనప్పుడు, బెయిలీ వాటిని అందరి సమ్మతి లేకుండ ఒక సంయుక్త సొంతదారుకు గాని, అతని ఆదేశానుసారము గాని తిరిగి అందజేయవచ్చును. అనేక సంయుక్త సొంతదారులచే బెయిల్మెంటు.

166. బెయిలరు సరుకులకు హక్కుమూలము కలిగియుండక, బెయిలీ సద్భావముతో వాటిని బెయిలరుకు గాని, అతని ఆదేశానుసారము గాని తిరిగి అంద జేసినచో, బెయిలీ అట్లు అందజేసినందుకు సొంతదారుకు ఉత్తరదాయి కాడు. హక్కుమూలము లేని బెయిలరుకు తిరిగి అందజేసిన మీదట బెయిలీ ఉత్తరదాయికాడు.

167. బెయిలరు కానట్టి వ్యక్తి బెయిలు చేయబడిన సరుకులను క్లెయిము చేయుచో, అతడు ఆ సరుకులను బెయిలరుకు అందజేయుటను ఆపివేసి, ఆ సరుకు లకు హక్కుమూలమును నిర్ణయించవలెనని న్యాయస్థానమునకు దరఖాస్తు చేయ వచ్చును. బెయిలుచేసిన సరుకులను క్లెయిముచేయు అన్య వ్యక్తి యొక్క హక్కు.

168. సరుకులు దొరికిన వ్యక్తి, ఆ సరుకులను కాపాడుటకును వాటి సొంతదారును కనుగొనుటకును తాను స్వచ్ఛందముగపడిన ప్రయాసకు మరియు చేసిన వ్యయమునకై నష్టపరిహారము కొరకు సొంతదారుపై దావా వేయుటకు హక్కు కలిగి ఉండడు; కాని అతడు అట్టి పరిహారమును పొందువరకు సొంతదారుకు విరుద్ధముగ ఆ సరుకులను నిలిపి ఉంచుకొనవచ్చును; పోయిన సరుకుల వాపసు కొరకై సొంతదారు ఒక నిర్దిష్ట బహుమానమును ఇవ్వజూపినయెడల, అవి దొరికిన వ్యక్తి అట్టి బహుమానమునకై దావా వేయవచ్చును, మరియు అది తనకు అందు వరకు ఆ సరుకులను నిలిపి ఉంచుకొనవచ్చును. సరుకులు దొరికిన వ్యక్తి యొక్క హక్కు, ఇవ్వజూపిన నిర్దిష్ట బహుమానము కొరకు దావా వేయవచ్చును.

సామాన్యముగ విక్రయింపబడు వస్తువు దొరికిన వ్యక్తి దానిని ఎప్పుడు విక్రయించవచ్చును.

169. సామాన్యముగ విక్రయించబడునట్టి ఏదేని వస్తువు పోయినప్పుడు, అది దొరికిన వ్యక్తి యుక్తమైన తత్పరతతో దాని సొంతదారును కనుగొనజాలనిచో, లేక అది దొరికిన వ్యక్తికైన శాసనసమ్మత చార్జీలను అడిగిన మీదట చెల్లించుటకు అతడు నిరాకరించుచో;—

(1) ఆ వస్తువు నశించునట్టి, లేక దాని విలువలో ఎక్కువ భాగమును కోల్పోవునట్టి ప్రమాదము ఉన్నప్పుడు, లేక

(2) దొరికిన వస్తువు విషయమున అది దొరికిన వ్యక్తికైన శాసనసమ్మత చార్జీలు, దాని విలువలో మూడింట రెండు వంతులగునప్పుడు;

అది దొరికిన వ్యక్తి దానిని విక్రయించవచ్చును.

బెయిలీయొక్క ప్రత్యేకమైన ధారణాధికారము.

170. బెయిలు చేయబడిన సరుకుల విషయమున బెయిలీ, బెయిల్మెంటు ప్రయోజనమును ననుసరించి శ్రమ, లేక కౌశలముతో కూడిన ఏదేని సేవను చేసిన యెడల, తద్విరుద్ధమైన కాంట్రాక్టు ఏదియు లేనప్పుడు, వాటి విషయమున తాను చేసిన సేవలకై తగిన ప్రతిమూల్యము అందుకొనువరకు అట్టి సరుకులను నిలిపి ఉంచుకొను హక్కు అతనికి ఉండును.

## ఉదాహరణములు

(ఏ) 'ఏ' ఒక ముడి వజ్రమును కోసి సానపట్టుటకై (పాలిష్ చేయుటకై) నగల వ్యాపారియగు 'బీ'కి అందజేయును. తదనుసారముగా ఆ పని చేయబడినది; తాను చేసిన సేవలకు చెల్లింపు పొందువరకు ఆ వజ్రమును నిలిపి ఉంచుకొనుటకు "బీ"కి హక్కు ఉండును;

(బీ) 'బీ' అను దర్జీకి 'ఏ' కోటు తయారుచేయుటకై బట్ట ఇచ్చును. 'బీ' కోటు తయారైన వెంటనే దానిని అందజేయుదుననియు, మజూరీకై మూడు నెలలు గడువు ఇచ్చెదననియు 'ఏ'కు వాగ్దానము చేయును. తాను చెల్లింపు పొందువరకు ఆ కోటును నిలిపి ఉంచుకొనుటకు 'బీ'కి హక్కు ఉండదు.

బ్యాంకర్లు, అడ్తిదార్లు, వార్ఫుదార్లు, అటార్నీలు, మరియు భీమా దళారీల సాధారణ ధారణాధికారము.

171. తద్విరుద్ధమైన కాంట్రాక్టు లేనప్పుడు, బ్యాంకర్లు, అడ్తిదార్లు, వార్ఫుదార్లు, ఉన్నత న్యాయస్థానపు అటార్నీలు మరియు భీమా దళారీలు తమకు బెయిలీ చేయబడిన ఏవేని సరుకులను సమస్త ఖాతా బాకీలకు ప్రతిభూతిగ నిలిపి ఉంచుకొనవచ్చును. కాని, ఇతర ఏ వ్యక్తులకు గాని, తత్ప్రభావముగల అభివ్యక్తమైన కాంట్రాక్టు ఏదేని ఉన్ననే తప్ప, తమకు బెయిలు చేయబడిన సరుకులను అట్టి ఖాతా బాకీలకు ప్రతిభూతిగ (సెక్యూరిటీ) నిలిపి ఉంచుకొనుటకు హక్కు ఉండదు.

## గిర్వీ రూపపు బెయిల్మెంటు

"గిర్వీ", "కుదువకర్త", "కుదువదారు" నిర్వచనము.

172. ఋణము చెల్లింపునకు, లేక వాగ్దానమును నిర్వర్తించుటకు ప్రతిభూతిగ (సెక్యూరిటీ) సరుకులను బెయిలుచేయుట "గిర్వీ" అనబడును. ఈ విషయమున బెయిలరు "కుదువకర్త" అనబడును. బెయిలీ "కుదువదారు" అనబడును.

నిలిపి ఉంచుకొనుటకు కుదువదారు హక్కు.

173. కుదువదారు, ఋణము చెల్లింపునకు, లేక వాగ్దానమును నిర్వర్తించుటకు మాత్రమే కాక ఋణముపై వడ్డీ మరియు గిర్వీ పెట్టబడిన సరుకులను స్వాధీనమునందుంచుకొను, లేక కాపాడు విషయమున తాను భరించిన అవసరమైన వ్యయములన్నింటికొరకు కూడ గిర్వీ పెట్టబడిన సరుకులను నిలిపి ఉంచుకొనవచ్చును.

174. కుదువదారు, తత్ప్రభావము గల కాంట్రాక్టు లేనప్పుడు, సరుకులను, అవి ఏ ఋణము, లేక వాగ్దానము కొరకై గిర్వీపెట్టబడినవో ఆ ఋణము లేక వాగ్దానము కానట్టి దాని కొరకు నిలిపి ఉంచుకొనరాదు; కాని కుదువదారు ఇచ్చినట్టి ఆ తరువాతి అడ్వాన్సుల విషయమున, తద్విరుద్ధముగ ఏదియు లేనప్పుడు అట్టి కాంట్రాక్టు ఉన్నట్లు పురోభావన చేయువలెను.

కుదువదారు, దేనికై సరుకులు గిర్వీ పెట్టబడినవో ఆ ఋణము, లేక వాగ్దానము కానట్టి దాని కొరకు వాటిని నిలిపి ఉంచుకొనకూడదు. తరువాతి అడ్వాన్సుల విషయములో పురోభావన.

175. గిర్వీ పెట్టబడిన సరుకులను కాపాడుటకు తాను భరించిన అసాధారణ వ్యయములను, కుదువకర్త నుండి తీసికొనుటకు కుదువదారుకు హక్కు ఉండును.

భరింపబడిన అసాధారణ వ్యయముల విషయమున, కుదువదారు హక్కు.

176. దేని విషయమున సరుకులు గిర్వీ పెట్టబడినవో ఆ ఋణమును చెల్లించుటలో గాని, ఆ వాగ్దానమును నియత గడువుకు నిర్వర్తించుటలో గాని కుదువకర్త వ్యతిక్రమము జరుపువో, కుదువదారు ఆ ఋణముపై, లేక వాగ్దానముపై కుదువకర్తపై దావావేసి గిర్వీపెట్టబడిన సరుకులను అదనపు ప్రతిభూతిగ (సెక్యూరిటీ) నిలిపి ఉంచుకొనవచ్చును; లేక అతడు కుదువకర్తకు విక్రయమును గూర్చి యుక్తమైన నోటీసు ఇచ్చి గిర్వీపెట్టబడిన వస్తువును విక్రయించవచ్చును.

అట్టి విక్రయపు రాబడులు ఆ ఋణము, లేక వాగ్దానము విషయమున రావలసిన దానికంటె తక్కువగా నున్నచో, కుదువకర్త ఇంకను మిగిలిన దానిని చెల్లించుటకు బాధ్యుడైయుండును. విక్రయ రాబడులు అట్లు రావలసిన దానికంటె ఎక్కువగ నున్నచో, కుదువదారు ఆ మిగులును కుదువకర్తకు చెల్లించవలెను.

కుదువకర్త వ్యతిక్రమము జరుపునెడల కుదువదారు హక్కు.

177. దేనికొరకై గిర్వీపెట్టుట జరిగినదో ఆ ఋణము చెల్లింపు కొరకు గాని, ఆ వాగ్దానపు నిర్వర్తన కొరకు గాని గడువు నియతము చేయబడియుండి, నియత గడువుకు ఆ ఋణమును చెల్లించుటలో గాని, ఆ వాగ్దానమును నిర్వర్తించుటలో గాని కుదువకర్త వ్యతిక్రమము జరుపువో, అతడు ఆ తరువాత, సరుకులు వాస్తవముగ విక్రయింపబడుటకు పూర్వము ఎప్పుడైనను వాటిని విమోచన చేయించు కొనవచ్చును; కాని, అతడు, అట్టి సందర్భములో, అతని వ్యతిక్రమము వలన అయిన ఏవేని వ్యయములను అదనముగ చెల్లించవలెను.

విమోచన చేయించు కొనుటకు వ్యతిక్రమము జరిపిన కుదువ కర్తకు హక్కు.

178. సరుకులు గాని, సరుకులపై హక్కు కలిగించు దస్తావేజులు గాని, సొంతదారు సమ్మతితో వాణిజ్య ఏజెంటు స్వాధీనమునందున్నయెడల, వాణిజ్య ఏజెంటు మామూలు వర్తకసరళిలో వ్యవహరించుచు అతడు పెట్టిన ఏదేని గిర్వీ అట్లు పెట్టుటకు ఆ సరుకుల సొంతదారుచే అతడు అభివ్యక్తముగ ప్రాధికారము పొందియుండిన ఎట్లో అట్లే శాసనమాన్యమైనదగును; అయితే కుదువదారు సద్భావముతో వ్యవహరించియుండవలెను, మరియు కుదువకర్తకు గిర్వీపెట్టు ప్రాధికారము లేదని గిర్వీపెట్టు సమయమున అతనికి తెలిసియుండరాదు.

వాణిజ్య ఏజెంటుచే గిర్వీ.

<u>విశదీకరణము</u>:– ఈ పరిచ్ఛేదములో, "వాణిజ్య ఏజెంటు" మరియు "హక్కు కలిగించు దస్తావేజులు" అను పదబంధములు భారత సరుకుల విక్రయ చట్టము, 1930లో వాటికి ఒసగిన అర్థములనే కలిగియుండును.

1930లో 3.

చెల్లనిదిగ చేయదగు కాంట్రాక్టు క్రింద స్వాధీనము కలిగియున్న వ్యక్తిచే గిర్వీ.

178-ఏ. కుదువకర్త తాను గిర్వీపెట్టిన సరుకుల స్వాధీనమును 19వ పరిచ్ఛేదము, లేక 19ఏ పరిచ్ఛేదము క్రింద చెల్లనిదిగ చేయదగు కాంట్రాక్టు క్రింద పొందియుండి, గిర్వీపెట్టిన సమయమున ఆ కాంట్రాక్టు రద్దు చేయబడకయుండినప్పుడు, కుదువదారు సద్భావముతో, కుదువకర్త యొక్క లోపభూయిష్ట హక్కు మూలమునందలి లోపమును గూర్చి తెలియకుండ వ్యవహరించినట్లయితే ఆ సరుకులకు సక్రమమైన హక్కుమూలము అతనికి లభించును.

కుదువకర్తకు పరిమిత హితము మాత్రమే ఉన్నప్పుడు గిర్వీపెట్టుట.

179. సరుకులలో పరిమిత హితమును మాత్రమే కలిగియున్న వ్యక్తి వాటిని గిర్వీపెట్టునెడల, ఆ గిర్వీ అట్టి హితము మేరకు మాత్రమే శాసనమాన్యమైనదగును.

## బెయిలీలచే, లేక బెయిలర్లచే దోషకారులపై దావాలు

బెయిలీచే లేక బెయిలరుచే దోషకారిపై దావా.

180. అన్యవ్యక్తి, బెయిలు చేయబడిన సరుకులను బెయిలీ ఉపయోగించకుండ, లేక అతని స్వాధీనమునందు ఉండకుండ అక్రమముగా చేసినచో, లేక వాటికి ఏదేని హాని కలుగజేయుచో, బెయిల్మెంటు ఏదియు చేయబడనిచో అటువంటి సందర్భములో సొంతదారు ఉపయోగించుకొనియుండియుండెడి ప్రత్యుపాయములనే ఉపయోగించుకొనుటకు బెయిలీకి హక్కు ఉండును; మరియు ఉపయోగించకుండ లేక స్వాధీనమునందు ఉండకుండ చేసినందుకు, లేక హాని కలిగించినందుకు ఆ అన్య వ్యక్తిపై బెయిలీగాని, బెయిలరుగాని దావా వేయవచ్చును.

అట్టి దావాల ద్వారా పొందబడిన పరిహారము, లేక నష్టపరిహారపు భాగనిర్ణయము.

181. అట్టి ఏదేని దావాలో పరిహారరూపముగ గాని, నష్టపరిహార రూపముగ గాని పొందబడినదేదైనను, బెయిలరు మరియు బెయిలీల మధ్య వారివారి హితముల ప్రకారము పరిష్కారము చేయబడవలెను.

## అధ్యాయము 10

## ఏజెన్సీ

### ఏజెంట్ల నియామకము మరియు ప్రాధికారము

"ఏజెంటు" మరియు "యజమాని" నిర్వచనము.

182. మరొక వ్యక్తి కొరకై ఏదేని కార్యమును చేయుటకుగాని అన్య వ్యక్తులతో జరుపు వ్యవహారములలో మరొక వ్యక్తికి ప్రాతినిధ్యమువహించుటకు గాని నియోగింపబడిన వ్యక్తి "ఏజెంటు" అనబడును; ఎవరికొరకై ఆ కార్యము చేయబడినదో, లేక అట్లు ఎవరికి ప్రాతినిధ్యము వహించబడినదో ఆ వ్యక్తి "యజమాని" అనబడును.

ఏజెంటును ఎవరు నియోగించవచ్చును.

183. తాను లోబడియున్న శాసనము ప్రకారము మెజారిటీ వయసు కలిగియుండి మతిస్థిమితముగల ఏ వ్యక్తియైనను ఏజెంటును నియోగించవచ్చును.

ఎవరు ఏజెంటుగా ఉండవచ్చును.

184. యజమాని మరియు అన్యవ్యక్తుల మధ్య ఏ వ్యక్తియైనను ఏజెంటు కావచ్చును, కాని మెజారిటీ వయస్సుగాని మతిస్థిమితము గాని లేనట్టి ఏ వ్యక్తియు తన యజమానికి ఆ విషయములో ఇందలి నిబంధనల ప్రకారము ఉత్తరదాయి అగుటకు గాను ఏజెంటు కాజాలడు.

ప్రతిఫలము అవశ్యకము కాదు.

185. ఏజెన్సీని ఏర్పరచుటకు ప్రతిఫలమేదియు అవశ్యకము కాదు.

186. ఏజెంటు ప్రాధికారము అభివ్యక్తమైనదైనను, గర్భితమైనదైనను కావచ్చును. ఏజెంటు ప్రాధికారము అభివ్యక్తమైన దైనను, గర్భిత మైనదైనను కావచ్చును.

187. ఏదేని ప్రాధికారము, వాగ్రూపమైన, లేక వ్రాతపూర్వకమైన మాటల ద్వారా ఒసగబడినప్పుడు అభివ్యక్తమైనదని చెప్పబడును; ఏదేని ప్రాధికారము, కేసు పరిస్థితులనుబట్టి ఉన్నదని ఊహింపదగినదైనప్పుడు గర్భితమైనదని చెప్పబడును; వాగ్రూపముగా, లేక వ్రాతపూర్వకముగా చెప్పిన విషయములను, లేక మామూలు వ్యవహార సరళిని కేసు పరిస్థితులనుబట్టి పరిగణించవచ్చును. అభివ్యక్తము మరియు గర్భితము యొక్క నిర్వచనము.

## ఉదాహరణము

'ఏ'కు సరంపూరులో ఒక దుకాణము ఉన్నది. అతడు కలకత్తాలో నివసించుచు, అప్పుడప్పుడు ఆ దుకాణమునకు వెళ్ళివచ్చుచుండును. ఆ దుకాణము 'బీ'చే నిర్వహింపబడుచున్నది మరియు అతడు అలవాటుగా ఆ దుకాణము కొరకు 'ఏ' పేరుతో 'సీ' నుండి సరుకులు తెప్పించి (ఆర్డరుచేసి) 'ఏ' యొక్క ఎరుకతో 'ఏ' నిధుల నుండి వాటికి చెల్లింపు చేయుచున్నాడు. ఆ దుకాణము కొరకు 'ఏ' పేరుతో 'సీ' నుండి సరుకుల తెప్పించుటకై (ఆర్డరు చేయుటకు) 'ఏ' నుండి 'బీ' గర్భిత ప్రాధికారమును కలిగియున్నాడు.

188. ఒక కార్యమును చేయుటకు ప్రాధికారము కలిగియున్న ఏజెంటు, అట్టి కార్యమును చేయుటకుగాను ఆవశ్యకమగు శాసనసమ్మతమైన ప్రతి పనిని చేయుటకు ప్రాధికారము కలిగియుండును. ఏజెంటు ప్రాధికారము యొక్క విస్తృతి.

ఒక వ్యాపారమును సాగించుటకు ప్రాధికారము కలిగియున్న ఏజెంటు అట్టి వ్యాపార నిర్వహణ నిమిత్తము ఆవశ్యకమగు, లేక అట్టి వ్యాపార నిర్వహణ సరళిలో సాధారణముగ చేయబడు శాసనసమ్మతమైన ప్రతి పనిని చేయుటకు ప్రాధికారము కలిగియుండును.

## ఉదాహరణములు

(ఏ) 'బీ'కి రావలసిన ఋణమును బొంబాయిలో వసూలు చేయుటకై లండనులో నివసించుచున్న 'బీ'చే 'ఏ' నియోగింపబడినాడు. 'ఏ' ఆ ఋణమును వసూలుచేయు నిమిత్తమై ఆవశ్యకమగు శాసనబద్ధమైనట్టి ఏ ప్రక్రియనైనను అనుసరించవచ్చును మరియు దానికి శాసనమాన్యమైన తీరుదల చీటీని ఈయ వచ్చును.

(బీ) 'ఏ' తన నౌకా నిర్మాణమును సాగించుటకై 'బీ'ని తన ఏజెంటుగా నియమించును. 'బీ' ఆ వ్యాపారము సాగించు నిమిత్తమై కలప మరియు ఇతర సామగ్రిని కొనవచ్చును, మరియు పనివారిని బాడుగకు తీసికొనవచ్చును.

189. ఏజెంటు, అత్యయిక పరిస్థితిలో తన యజమానిని నష్టము నుండి కాపాడు నిమిత్తమై, అవే పరిస్థితుల క్రింద తన స్వంత విషయములో సాధారణ ప్రజ్ఞగల వ్యక్తిచేయునట్టి కార్యము లన్నింటిని చేయుటకు ప్రాధికారము కలిగి యుండును. అత్యయిక పరిస్థితిలో ఏజంటుయొక్క ప్రాధికారము.

## ఉదాహరణములు

(ఏ) విక్రయపు ఏజెంటు ఆవశ్యకమగుచో వస్తువులను మరమ్మత్తు చేయించవచ్చును;

(బీ) 'ఏ' కటక్‌లోనున్న 'సీ'కి వెంటనే పంపవలెనను ఆదేశములతో పదార్థములను, రవాణాకై కలకత్తాలోనున్న 'బీ'కి అప్పగించును. కటక్‌వరకు రవాణాలో ఆ పదార్థములు చెడిపోకుండా ఉండనివగుచో 'బీ' వాటిని కలకత్తాలో విక్రయించవచ్చును.

## ఉప-ఏజెంట్లు

ఏజెంటు ఎప్పుడు ప్రత్యాయోజనము చేయరాదు.

190. ఏజెంటు అభివ్యక్తముగ గాని, గర్భితముగ గాని, తాను స్వయముగ నిర్వర్తించు భారమువహించిన కార్యములను నిర్వర్తించుటకు మామూలుగా వ్యాపార ఆచారమునుబట్టి ఉపఏజెంటును నియోగించుటకు వీలున్ననే తప్ప, లేక ఏజెన్సీ స్వభావమునుబట్టి ఉపఏజెంటును తప్పక నియోగించవలసియున్ననే తప్ప,– మరొకరిని శాసనసమ్మతముగ నియోగింపజాలడు.

"ఉప ఏజెంటు" నిర్వచనము.

191. ఏజెన్సీ వర్తకములో మూల ఏజెంటుచే నియోగింపబడి అతని నియంత్రణ క్రింద వ్యవహరించు వ్యక్తి "ఉపఏజెంటు" అగును.

సముచితముగ నియమింపబడిన ఉప ఏజెంటు యజమానికి ప్రాతినిధ్యము వహించుట.

192. ఉపఏజెంటు సముచితముగ నియమింపబడినయెడల అన్య వ్యక్తులకు సంబంధించినంతమేరకు ఉపఏజెంటు యజమానికి ప్రాతినిధ్యము వహించును, మరియు అతడు తొలుతనే యజమానిచే నియమింపబడిన ఏజెంటు అయియుండిన ఏట్లో అట్లే అతని కార్యములకు యజమాని బద్ధుడైయుండును మరియు ఉత్తరదాయి అగును.

ఉప ఏజెంటు కొరకు ఏజెంటు ఉత్తర దాయిత్వము.

ఏజెంటు ఉప-ఏజెంటు యొక్క కార్యములకై యజమానికి ఉత్తరదాయి అగును.

ఉప ఏజెంటు ఉత్తర దాయిత్వము.

కపటములేని బుద్ధిపూర్వక దోషము జరిగిన సందర్భములలో తప్ప ఉపఏజెంటు తాను చేసిన కార్యములకై ఏజెంటుకు ఉత్తరదాయి అగును, కాని యజమానికి కాదు

ప్రాధికారము లేకుండ నియమింపబడిన ఉప ఏజెంటు కొరకు ఏజెంటు యొక్క ఉత్తర దాయిత్వము.

193. ఉపఏజెంటుగ వ్యవహరించుటకై ఒక వ్యక్తిని నియమించుటకు ప్రాధికారము కలిగియుండక ఏజెంటు అట్లు ఉపఏజెంటును నియమించునెడల, ఏజెంటు, అట్టి వ్యక్తిపట్ల, యజమానికి ఏజెంటుకు ఉండు సంబంధమునే కలిగియుండును; మరియు అతని కార్యములకై యజమానికిని, అన్యవ్యక్తులకును ఉత్తరదాయియగును; అట్లు నియమింపబడిన వ్యక్తి యజమానికి ప్రాతినిధ్యము వహించడు మరియు అతడు చేసిన కార్యములకు యజమాని ఉత్తరదాయి కాడు మరియు అట్టి వ్యక్తియు యజమానికి ఉత్తరదాయి కాడు.

ఏజెన్సీ వర్తకములో వ్యవహరించుటకై ఏజెంటుచే తగురీతిగ నియమింపబడిన వ్యక్తికి మరియు యజమానికి మధ్య గల సంబంధము.

194. ఏజెన్సీ వర్తకములో యజమాని కొరకు వ్యవహరించుటకై మరొక వ్యక్తిని నియమించుటకు అభివ్యక్త, లేక గర్భిత ప్రాధికారము కలిగియున్న ఏజెంటు తదనుసారముగా మరొక వ్యక్తిని నియమించునెడల, అట్టి వ్యక్తి ఉపఏజెంటు కాడు, కాని, ఏజెన్సీ వర్తకములో అతనికి అప్పగించబడిన భాగము కొరకు యజమాని యొక్క ఏజెంటు అగును.

## ఉదాహరణములు

(ఏ) 'ఏ' తన సంపదను వేలము ద్వారా విక్రయించుమని అందు నిమిత్తమై వేలముదారును నియోగించుమని తన సొలిసిటరైన 'బీ'ని ఆదేశించును. 'బీ' విక్రయము జరుపుటకై 'సీ' అను వేలముదారును నియమించును. 'సీ' ఉప ఏజెంటు కాదు. కాని విక్రయము జరుపుటకై 'ఏ' యొక్క ఏజెంటు అగును.

(బీ) "సీ అండ్ కంపెనీ" నుండి 'ఏ'కు రావలసిన డబ్బు వసూలుకై 'ఏ' కలకత్తాలోని వర్తకుడగు 'బీ'కి ప్రాధికారము ఇచ్చును. ఆ డబ్బు వసూలుకై "సీ అండ్ కంపెనీ"పై శాసనబద్ధమైన చర్యలను తీసికొనవలసినదని 'బీ' సొలిసిటరైన "డీ"ని అనుదేశించును 'డీ' ఉపఏజెంటు కాదు కాని 'ఏ'కు సొలిసిటరు అగును.

195. తన యజమాని కొరకు అట్టి ఏజెంటును ఎంపిక చేయుటలో సాధారణ ప్రజ్ఞగల వ్యక్తి తన స్వంత విషయములో వినియోగించునంత వివేకమునే ఏజెంటు వినియోగించవలసియుండును; మరియు అతడు అట్లు చేయుచో, అతడు అట్లు ఎంపికచేసిన ఏజెంటు చేసిన కార్యములకు లేక నిర్లక్ష్యమునకు యజమానికి ఉత్తరదాయి కాడు. అట్టి వ్యక్తిని నియమించుటలో ఏజెంటు యొక్క కర్తవ్యము.

## ఉదాహరణములు

(ఏ) 'ఏ' తన కొరకు ఒక ఓడను కొనుగోలు చేయుమని 'బీ' అను వర్తకుడిని అనుదేశించును. 'బీ' మంచి ఖ్యాతిగల ఒక ఓడ సర్వేక్షకుని 'ఏ' కొరకు ఓడను ఎంపికచేయుటకై నియోగించును. ఆ సర్వేక్షకుడు ఓడను నిర్లక్ష్యముగ ఎంపిక చేయును. అది సముద్ర యానమునకు అయోగ్యమై నష్టమై పోవును. 'ఏ'కు 'బీ' ఉత్తరదాయి కాడు కాని ఆ సర్వేక్షకుడు అట్లు ఉత్తరదాయి అగును.

(బీ) 'ఏ' 'బీ' అను వర్తకునకు సరుకులను విక్రయించుటకై అప్ప గించును; 'బీ' 'ఏ' యొక్క సరుకులను విక్రయించుటకు తగు సరళిలో మంచి పరపతిగల వేలముదారును నియోగించి ఆ వేలముదారును విక్రయ రాబడిని పుచ్చ కొనుటకు అనుమతించును. ఆ రాబడి లెక్కచెప్పకుండానే ఆ తరువాత వేలముదారు దివాలా తీయును. 'బీ' ఆ రాబడికై 'ఏ'కు ఉత్తరదాయి కాడు.

## అనంతర సమర్థన

196. ఒక వ్యక్తి మరొక వ్యక్తి తరఫున అతనికి తెలియకుండ గాని, అతని ప్రాధికారము లేకుండ గాని కార్యములు చేసినయెడల అతడు అట్టి కార్యములను అనంతరము సమర్థించవచ్చును, లేక వాటికై తన బాధ్యత లేదనవచ్చును. అతడు వాటిని అనంతరము సమర్థించుచో, అవి తన ప్రాధికారముతో చేయబడియుండిన ఎట్లో అట్లే ప్రభావము కలిగియుండును. తన ప్రాధికారము లేకుండ తన కొరకు చేయబడిన కార్యముల విషయమున వ్యక్తికి గల హక్కు. అనంతర సమర్థనవలని ప్రభావము.

197. అనంతర సమర్థన అభివ్యక్తమైనదైనను, లేక ఎవరి తరఫున కార్యములు చేయబడినవో ఆ వ్యక్తి నడవడినిబట్టి గర్భితమైనదైనను కావచ్చును. అనంతర సమర్థన అభివ్యక్తమైనదైనను, గర్భితమైనదైనను కావచ్చును.

## ఉదాహరణములు

(ఏ) 'ఏ' ప్రాధికారము లేకుండ 'బీ' కొరకు సరుకులను కొనుగోలు చేయును. ఆ తరువాత 'బీ' వాటిని తన స్వంత బాబతున 'సీ'కి విక్రయించును; 'బీ' నడవడి వలన అతడు తన కొరకు 'ఏ' చేసిన కొనుగోలును గర్భితముగా అనంతరము సమర్థించినట్లయినది.

(బీ) 'ఏ' 'బీ' యొక్క ప్రాధికారము లేకుండ 'బీ' యొక్క డబ్బును 'సీ'కి అప్పిచ్చును. ఆ తరువాత 'బీ' ఆ డబ్బుపై 'సీ' నుండి వడ్డీని స్వీకరించును. 'బీ' నడవడి వలన అతడు ఆ అప్పును గర్భితముగా అనంతరము సమర్థించినట్లు అయినది.

శాసనమాన్యమైన అనంతర సమర్థనకు కావలసిన తెలివిడి.

198. కేసు సంగతులను గూర్చి ముఖ్య విషయములు లోపయుక్తమైనవని ఎరిగియున్న వ్యక్తి శాసనమాన్యమైన ఎట్టి అనంతర సమర్థన చేయజాలడు.

ఒక వ్యవహారములో భాగముగనున్న అప్రాధికృత కార్యమును అనంతరము సమర్థించుట వలన కలుగు ప్రభావము.

199. తన తరఫున చేయబడిన ఏదేని అప్రాధికృత కార్యమును అనంతరము సమర్థించు వ్యక్తి, అట్టి కార్యము ఏ వ్యవహారములో భాగముగ ఏర్పడినదో ఆ వ్యవహారమునంతను అనంతరము సమర్థించినట్లగును.

అప్రాధికృత కార్యమును అనంతరము సమర్థించుట అన్య వ్యక్తికి హాని కలుగ చేయజాలదు.

200. ఒక వ్యక్తి మరొక వ్యక్తి తరఫున ఆ మరొక వ్యక్తి ప్రాధికారము లేకుండ చేసిన కార్యము, ప్రాధికారముతో చేయబడినచో అన్యవ్యక్తిని నష్ట పరిహారములు చెల్లించుటకు గురిచేయునదైనను లేక అన్యవ్యక్తి యొక్క ఏదేని హక్కు, లేక హితమును అంతమొందించు ప్రభావము కలిగించునదైనను, దానిని అనంతరము సమర్థించి దానికి అట్టి ప్రభావము కలిగియుండునట్లు చేయబడజాలదు.

## ఉదాహరణములు

(ఏ) 'బీ' ఆస్తియగు ఒక వస్తువును తనకు అందజేయుమని, "ఏ" దాని స్వాధీనమును కలిగియున్న "సీ"ని, అందుకై 'బీ'చే ప్రాధికారము పొందకుండ, 'బీ' తరఫున అడుగును; అందజేయుటకు 'సీ' నిరాకరించినందులకు అతనిని హాని పరిహారములకు బాధ్యుని చేయుటకు గాను అట్లు అడుగుటను 'బీ' అనంతరము సమర్థించజాలడు.

(బీ) 'ఏ' మూడు మాసముల నోటీసునిచ్చిన మీదట అంతమొందించదగు లీజు 'బీ' నుండి తీసికొనియున్నాడు. ప్రాధికారములేని వ్యక్తియగు 'సీ' ఆ లీజును అంతమొందించు నోటీసును 'ఏ'కు ఇచ్చును. 'ఏ'ని బద్ధునిచేయుటకు గాను ఆ నోటీసును "బీ" అనంతరము సమర్థించజాలడు.

## ప్రాధికారపు ప్రతిసంహరణ

ఏజన్సీ అంతమగుట.

201. యజమాని తన ప్రాధికారమును ప్రతిసంహరించినందున గాని, ఏజెంటు ఏజన్సీ వర్తకమును విడిచిపెట్టినందునగాని, ఏజన్సీ వర్తకము పూర్తిఅయినందునగాని, యజమాని, లేక ఏజెంటు మరణించినందున, లేక మతిస్థిమితము లేనివాడైనందున గాని, దివాలాతీసిన ఋణస్థుల పరిహారము కొరకు తత్సమయమున అమలునందున్న

ఏదేని చట్టపు నిబంధనల క్రింద యజమాని దివాలాదారుగ న్యాయ నిర్ణయము చేయబడినందున గాని ఏజెన్సీ అంతమగును.

202. ఏజెన్సీ విషయవస్తువగు ఆస్తిలో ఏజెంటు స్వయముగ హితము కలిగి యున్నయెడల, అభివ్యక్తమైన కాంట్రాక్టు లేనప్పుడు, అట్టి హితమునకు భంగము వాటిల్లునట్లు ఏజెన్సీ అంతమొందించబడజాలదు.

విషయ వస్తువులో ఏజెంటు హితము కలిగియున్న యెడల ఏజెన్సీ అంతమగుట.

## ఉదాహరణములు

(ఏ) 'ఏ' యొక్క భూమిని విక్రయించి, 'ఏ' నుండి తనకు రావలసిన అప్పులను ఆ విక్రయ రాబడి నుండి పొందుటకు 'ఏ', 'బీ'కి ప్రాధికారము నొసగును. 'ఏ' ఈ ప్రాధికారమును ప్రతిసంహరించజాలడు, లేక అతడు ఉన్మత్తుడైనందువలన గాని మరణించినందువలన గాని అది అంతమొందదు.

(బీ) తనకు దూదిపై అడ్వాన్సులు ఇచ్చిన 'బీ'కి 'ఏ' అట్టి 1000 బేళ్ల దూదిని అప్పగించును మరియు ఆ దూదిని విక్రయించి ఆ ధర నుండి తన అడ్వాన్సుల మొత్తమును తిరిగి తీసుకొనవలెనని 'బీ'ని కోరును. 'ఏ' ఈ ప్రాధికారమును ప్రతిసంహరించజాలడు, లేక అతడు ఉన్మత్తుడైనందువలన గానీ మరణించినందువలన గాని అది అంతమొందదు.

203. యజమాని, పై కడపటి పరిచ్ఛేదములో వేరు విధముగా నిబంధింప బడినట్లు తప్ప, తన ఏజెంటుకు ఇచ్చిన ప్రాధికారమును ఆ ప్రాధికారము యజమానిని బద్ధుని చేయునట్లు వినియోగింపబడుటకు పూర్వము ఎప్పుడైనను ప్రతిసంహరించుకొనవచ్చును.

యజమాని ఏజెంటు ప్రాధికారమును ఎప్పుడు ప్రతిసంహరించ వచ్చును.

204. యజమాని, తన ఏజెంటుకు ఇచ్చిన ప్రాధికారము కొంతవరకు వినియోగింపబడిన తరువాత, ఏజెన్సీలో అదివరకే చేయబడినట్టి కార్యములకు మరియు చేయబడినట్టి కార్యముల నుండి ఉత్పన్నమగు బాధ్యతకు సంబంధించి నంతమేరకు, ఆ ప్రాధికారమును ప్రతిసంహరించుకొనజాలడు.

ప్రాధికారము కొంతవరకు వినియోగింప బడినప్పుడు ప్రతిసంహరణ.

## ఉదాహరణములు

(ఏ) 'ఏ' యొక్క ఖాతాపై 1000 బేళ్ల దూది కొనుగోలు చేయుటకును 'బీ' వద్దనున్నట్టి 'ఏ'కు చెందిన డబ్బులో నుండి అందుకై చెల్లించుటకును 'ఏ' 'బీ'కి ప్రాధికారమొసగును; ధరపట్ల తనకే బాధ్యత ఉండునట్లు తన పేరనే 'బీ' 1000 బేళ్ల దూదిని కొనుగోలు చేయును; ఆ దూది కొరకు చెల్లించుటకు సంబంధించినంతవరకు 'బీ'కి గల ప్రాధికారమును 'ఏ' ప్రతిసంహరించజాలడు.

(బీ) "ఏ" యొక్క ఖాతాపై 1000 బేళ్ల దూదిని కొనుగోలు చేయుటకును "బీ" వద్ద నున్నట్టి "ఏ"కు చెందిన డబ్బులో నుండి అందుకై చెల్లించుటకును 'ఏ', 'బీ'కి ప్రాధికారమొసగును; ధరపట్ల తనకెట్టి బాధ్యత ఉండకుండునట్లు 'ఏ' పేరనే 'బీ' 1000 బేళ్ల దూదిని కొనుగోలు చేయును; ఆ దూది కొరకు చెల్లించుటకు "బీ"కి గల ప్రాధికారమును "ఏ" ప్రతిసంహరించవచ్చును.

*యజమాని ప్రతిసంహరించినందుకు, లేక ఏజెంటు విడిచిపెట్టినందుకు నష్టపరిహారము.*

205. ఏజెన్సీ ఏదేని కాలావధివరకు కొనసాగవలెనని అభివ్యక్తమైన, లేక గర్భితమైన కాంట్రాక్టు ఉన్నయెడల, చాలినంత కారణము లేకుండ అంతకుముందే ప్రతిసంహరించుకొనినందుకు, లేక విడిచిపెట్టినందుకు, సందర్భానుసారముగ, యజమాని ఏజెంటుకు, లేక ఏజెంటు యజమానికి నష్టపరిహారమును చెల్లించవలెను.

*ప్రతిసంహరణను, లేక విడిచి పెట్టుటను గూర్చిన నోటీసు.*

206. అట్టి ప్రతిసంహరణను లేక విడిచిపెట్టుటను గూర్చి యుక్తమైన నోటీసు ఈయబడవలెను; లేనిచో, తద్వారా, సందర్భానుసారముగ, యజమానికి గాని, ఏజెంటుకుగాని కలుగు నష్టమును ఒకరికి మరొకరు చెల్లించవలెను.

*ప్రతిసంహరణ మరియు విడిచి పెట్టుట అభివ్యక్తమైనదైనను, లేక గర్భితమైనదైనను కావచ్చును.*

207. ప్రతిసంహరణ, లేక విడిచిపెట్టుట క్రమముగా యజమాని లేక ఏజెంటు యొక్క నడవడినిబట్టి అభివ్యక్తమైనది కావచ్చును, లేక గర్భితమైనది కావచ్చును.

## ఉదాహరణము

'ఏ' యొక్క ఇంటిని అద్దెకిచ్చుటకై 'ఏ' 'బీ'కి అధికారము ఇచ్చును. ఆ తరువాత 'ఏ' దానిని తానే అద్దెకిచ్చును. ఇది 'బీ' యొక్క ప్రాధికారమును గర్భితముగా ప్రతిసంహరించుట అగును.

*ఏజెంటు ప్రాధికారము అంతమొందుట ఏజెంటుపట్ల మరియు అన్య వ్యక్తులపట్ల ఎప్పుడు అమలు లోనికి వచ్చును.*

208. ఏజెంటు ప్రాధికారము అంతమొందుట, ఏజెంటుకు సంబంధించినంతవరకు అది అతనికి తెలియవచ్చుటకు పూర్వము, లేక అన్య వ్యక్తులకు సంబంధించినంతవరకు అది వారికి తెలియవచ్చుటకు పూర్వము అమలులోనికిరాదు.

## ఉదాహరణములు

(ఏ) 'ఏ' తన కొరకు సరుకులను విక్రయించుమని 'బీ'ని ఆదేశించి, ఆ సరుకులకు వచ్చిన ధరపై 'బీ'కి ఐదు శాతము కమీషను ఇచ్చుటకు సమ్మతించును. 'ఏ' ఆ తరువాత జాబు ద్వారా 'బీ' యొక్క ప్రాధికారమును ప్రతిసంహరించును. 'బీ' ఆ జాబు పంపబడిన తరువాత, కాని అది తనకు అందుటకు పూర్వము, ఆ సరుకులను 100 రూపాయలకు విక్రయించును. ఆ విక్రయమునకు 'ఏ' బద్ధుడగును మరియు 'బీ' తన కమీషనుగ ఐదు రూపాయలకు హక్కు కలిగియుండును.

(బీ) మదరాసులోనున్న "ఏ" బొంబాయి గిడ్డంగిలో ఉన్న దూదిని విక్రయించవలెనని జాబు ద్వారా 'బీ'ని ఆదేశించి, ఆ తరువాత, విక్రయించుటకై అతనికిచ్చిన ప్రాధికారమును జాబు ద్వారా ప్రతిసంహరించి ఆ దూదిని మదరాసుకు పంపవలెనని 'బీ'ని ఆదేశించును. 'బీ' రెండవ జాబు అందిన తరువాత, మొదటి జాబును గురించి తెలిసియుండి రెండవ దానిని గురించి తెలియని 'సీ'కి ఆ దూదిని విక్రయించుటకు అతనితో కాంట్రాక్టు చేసుకొనును. 'సీ' 'బీ'కి డబ్బు చెల్లించును మరియు ఆ డబ్బుతో 'బీ' పరారగును. 'సీ' చేసిన చెల్లింపు 'ఏ'కి విరుద్ధముగ సరియైనదగును.

(సీ) 'ఏ' తన ఏజెంటైన 'బీ'ని కొంత డబ్బు 'సీ'కి చెల్లించుమని ఆదేశించును. 'ఏ' మరణించును మరియు అతని వీలునామాకు 'డీ' ప్రొబేటును

తీసికొనును. 'ఏ' మరణించిన తరువాత, కాని అతడు మరణించినట్లు తనకు తెలియుటకు పూర్వము 'బీ' ఆ డబ్బును 'సీ'కి చెల్లించును. వీలునామా నిర్వాహకుడగు 'డీ'కి విరుద్ధముగ ఆ చెల్లింపు సరియైనదగును.

209. యజమాని మరణించినందున గాని మతిస్థిమితము లేనివాడైనందున గాని ఏజెన్సీ అంతమొందినప్పుడు, ఏజెంటు, తనకప్పగించబడిన హితముల సంరక్షణ మరియు పరిరక్షణ కొరకు మృతుడైన తన యజమాని యొక్క ప్రతినిధుల తరఫున యుక్తమైన చర్యలన్నియు తీసుకొనవలెను.

యజమాని మరణించినందున లేక ఉన్మాదుడైనందున ఏజెన్సీ అంతమొందిన మీదట ఏజెంటు కర్తవ్యము.

210. ఏజెంటు ప్రాధికారము అంతమగుటవలన, అతడు నియమించిన ఉప ఏజెంట్లందరి ప్రాధికారము (ఏజెంటు ప్రాధికారము అంతమగుటను గూర్చి ఇందులో గల నియమములకు లోబడి) అంతమొందును.

ఉపఏజెంటు ప్రాధికారము అంతమగుట.

## యజమానిపట్ల ఏజెంటు కర్తవ్యము

211. ఏజెంటు, తన యజమాని వర్తకమును, యజమాని ఆదేశముల ననుసరించిగాని, అట్టి ఆదేశములేవియు లేనప్పుడు ఏజెంటు అట్టి వర్తకమును నిర్వహించు చోట అదేరకపు వర్తకమును చేయుటలో అమలునందున్న ఆచారము ననుసరించిగాని నిర్వహించవలెను. ఏజెంటు వేరు విధముగా వ్యవహరించినపుడు, ఏదేని నష్టము కలిగినచో అతడు ఆ నష్టమునకై యజమానికి చెల్లించవలెను; ఏదేని లాభము వచ్చినచో దానికై లెక్కచెప్పవలెను.

యజమాని యొక్క వర్తకమును నిర్వహించుటలో ఏజెంటు కర్తవ్యము.

## ఉదాహరణములు

(ఏ) చేతికివచ్చిన డబ్బు ఎప్పటికప్పుడు వడ్డీకి పెట్టుబడి పెట్టుట ఆచారముగనున్న ఒక వర్తకమును 'బీ' కొరకు నిర్వహించుటకై నియోగించబడిన 'ఏ' అను ఏజెంటు అట్లు పెట్టుబడి పెట్టకుండును. 'ఏ' అట్టి పెట్టుబడుల వలన సాధారణముగ పొందదగు వడ్డీని 'బీ'కి చెల్లించవలెను.

(బీ) అరువుపై విక్రయించు ఆచారములేని వర్తకమును చేయు 'బీ' అను దళారీ ఆ సమయమున గొప్ప పరపతిగల 'సీ'కి 'ఏ' యొక్క సరుకులను అరువుపై విక్రయించును. చెల్లింపు చేయకుండనే 'సీ' దివాలా తీయును. 'బీ' 'ఏ'కి ఆ నష్టమును చెల్లించవలెను.

212. ఏజెన్సీ వర్తకమును ఏజెంటుకు కౌశలము లేదని యజమానికి తెలిసియుండిననే తప్ప, అటువంటి వర్తకము చేయుచున్న వ్యక్తులు సాధారణముగ కలిగియుండునంత కౌశలముతో అతడు నిర్వహింపవలసియుండును. ఏజెంటు ఎల్లప్పుడును యుక్తమైన తత్పరతతో వ్యవహరించుచు తనకున్నట్టి కౌశలమును ఉపయోగించవలసియుండును. తన స్వంత నిర్లక్ష్యము, కౌశలము లేకుండుట, లేక చెడు నడవడి వలన కలిగిన ప్రత్యక్ష పరిణామముల విషయమున తన యజమానికి నష్ట పరిహారమును చెల్లించవలసియుండును. కాని అట్టి నిర్లక్ష్యము, కౌశలము లేకుండుట లేక చెడునడవడి వలన పరోక్షముగ గాని, సుదూర కారణము వలన గాని కలిగిన నష్టము, లేక చెరుపు విషయమున కాదు.

ఏజెంటుకు కావలసిన కౌశలము మరియు తత్పరత.

## ఉదాహరణములు

(ఏ) కలకత్తాలోని వర్తకుడగు 'ఏ'కు లండనులో 'బీ' అను ఏజెంటు ఉన్నాడు. 'ఏ'కు సంపవలెనను ఆదేశముతో 'ఏ' యొక్క ఖాతాపై కొంత డబ్బు "బీ"కి చెల్లింపబడినది. 'బీ' ఆ డబ్బును చాలకాలము వరకు నిలిపి ఉంచుకొనును. 'ఏ' ఆ డబ్బు అందని పరిణామముగ దివాలా తీయును. 'బీ' ఆ డబ్బు మరియు, అది చెల్లింపబడవలసిన దినము నుండి మామూలు రేటు ప్రకారము వడ్డీ, మరియు ఇంకను ఏదేని ప్రత్యక్ష నష్టము కొరకు (ఉదాహరణకు వినిమయ రేటులో హెచ్చు తగ్గులవలన కలిగిన నష్టము కొరకు-నష్టమునకు) బాధ్యుడైయుండును, కాని ఇంక దేనికిని కాదు.

(బీ) సరుకుల విక్రయపు ఏజెంటైన 'ఏ' అరువుపై విక్రయించుటకు ప్రాధికారము కలిగియుండి, 'బీ' యొక్క ఆర్థిక స్థోమతను గురించి మామూలుగా తెలిసికొనవలసినవి సరిగా తెలిసికొనకుండ 'బీ'కి అరువుపై విక్రయించును. 'బీ' అట్టి విక్రయపు సమయమున దివాలా తీసియున్నాడు. తద్వారా కలిగిన ఏదేని నష్టమునకై "ఏ" తన యజమానికి నష్టపరిహారమును చెల్లించవలసియుండును.

(సీ) ఒక ఓడపై భీమాచేయుటకై 'బీ'చే నియోగింపబడిన భీమా దళారీయగు 'ఏ' ఆ పాలసీలో మామూలు ఖండములు చొప్పించబడినట్లు చూడకుండును. ఆ తదుపరి ఓడ నష్టమైపోవును. ఆ ఖండములు పాలసీలో లేని కారణముగ, హామీదార్లు (అండరు-రైటర్లు) నుండి ఏమియు వసూలు చేయుటకు వీలు లేకుండెను. 'ఏ', 'బీ'కి ఆ నష్టమునకై ప్రతిపూర్తిచేయుటకు బద్ధుడై యుండును.

(డీ) ఇంగ్లండులోని వర్తకుడగు 'ఏ'కు బొంబాయిలో ఏజెన్సీని స్వీకరించిన 'బీ' అను ఏజెంటు ఉన్నాడు. ఫలాన ఓడలో తనకు 100 బేళ్ల దూదిని పంపవలెనని "ఏ" "బీ"ని ఆదేశించును, 'బీ' ఆ దూదిని పంపగలిగియుండియు పంపకుండును. ఆ ఓడ సురక్షితముగ ఇంగ్లండు చేరుకొనును. అది చేరిన వెంటనే ఆ దూది ధర పెరుగును. ఓడ చేరుకొనిన సమయమున 'ఏ' 100 బేళ్ల దూదిపై హొందియుండి యుండెడి లాభమును 'బీ' అతనికి చెల్లించవలసియుండును; కాని ఆ తదుపరి పెరుగుదల వలన అతడు హొందియుండియుండెడి ఏదేని లాభమును కాదు.

**ఏజెంటు లెక్కలు.**

213. ఏజెంటు తన యజమాని అడిగినపుడు సరియైన లెక్కలు చూపుటకు బద్ధుడైయుండును.

**యజమానిని సంప్రదించుట ఏజెంటు కర్తవ్యమైయుండుట.**

214. ఇబ్బంది ఏర్పడిన సందర్భములలో, యజమానిని సంప్రదించుటకును అతని అనుదేశములను హొందుటకును యుక్తమైన తత్పరతనంతటిని వహించుట ఏజెంటు కర్తవ్యమైయుండును.

**ఏజెన్సీ వర్తకములో యజమాని సమ్మతిలేకుండ ఏజెంటు తన స్వంత బాబతున వ్యవహరించినప్పుడు యజమానికిగల హక్కు.**

215. ఏజెన్సీ వర్తకములో, ఏజెంటు మొదట తన యజమాని సమ్మతి హొందకుండను ఆ విషయముపై తనకు తెలియవచ్చిన ముఖ్యమైన పరిస్థితులన్నింటిని యజమానికి తెలియపరచకుండను తన స్వంత బాబతున వ్యవహరించినచో, ఏజెంటు ఏదేని ముఖ్యమైన సంగతిని తనకు తెలియనీయకుండ దురుద్దేశముతో కప్పిపుచ్చినాడని గాని, ఏజెంటు వ్యవహారములు తనకు అనుకూలముగ లేవని గాని ఆ కేసును బట్టి విదితమగుచో యజమాని ఆ వ్యవహారమును త్రోసిపుచ్చవచ్చును.

## ఉదాహరణములు

(ఏ) 'ఏ' యొక్క సంపదను విక్రయించుమని 'ఏ' 'బీ'ని ఆదేశించును; 'బీ' తన కొరకే ఆ సంపదను 'సీ' పేర కొనుగోలు చేయును. 'బీ' తన కొరకే ఆ సంపదను కొనుగోలు చేసినాడని 'ఏ' కనుగొనిన మీదట, అతడు "బీ" ఏదేని ముఖ్యమైన సంగతిని దురుద్దేశముతో కప్పిపుచ్చినాడని గాని, ఆ విక్రయము తనకు అనుకూలముగ లేదని గాని చూపగలిగినచో ఆ విక్రయమును త్రోసిపుచ్చవచ్చును.

(బీ) 'ఏ' యొక్క సంపదను విక్రయించుమని 'ఏ' 'బీ'ని ఆదేశించును. 'బీ' ఆ సంపదను విక్రయించుటకు ముందుగా దానిని చూచి అందు ఒక గని ఉన్నదని తెలిసికొనును. ఆ గని ఉన్నదని 'ఏ'కు తెలియదు. ఆ సంపదను తాను తన కొరకే కొనుగోలు చేయదలచినట్లు 'బీ' 'ఏ'కి తెలియపరచును, కాని అందు గని ఉన్నదని తెలియవచ్చిన విషయమును కప్పిపుచ్చును. "ఏ" గని ఉనికిని గూర్చి తెలియక "బీ"ని ఆ సంపదను కొనుగోలు చేయుటకు అనుమతించును. 'బీ' ఆ సంపదను కొనుగోలు చేసిన సమయమున అతనికి ఆ గనిని గూర్చి తెలియునని 'ఏ' కనుగొనిన మీదట అతడు తన అభిమతానుసారము ఆ విక్రయమును త్రోసిపుచ్చవచ్చును, లేక అంగీకరించవచ్చును.

216. ఏజెంటు, తన యజమానికి తెలియకుండ, ఏజెన్సీ వర్తకములో తన యజమాని బాబతున వ్యవహరించుటకు బదులు తన స్వంత బాబతుననే వ్యవహరించుచో, ఆ వ్యవహారము ఫలితముగా ఏజెంటు పొందిన ఏదేని మేలును అతని నుండి క్లెయిము చేయుటకు యజమానికి హక్కు ఉండును.

ఏజెన్సీ వర్తకములో ఏజెంటు తన స్వంత బాబతున వ్యవహరించుచు పొందిన మేలుకు యజమానికిగల హక్కు.

## ఉదాహరణము

'ఏ' తన కొరకు ఫలానా ఇల్లు కొనుగోలు చేయుమని ఏజెంటైన 'బీ'ని ఆదేశించును; దానిని కొనుగోలు చేయుటకు వీలులేదని 'ఏ'కు చెప్పి "బీ" ఆ ఇల్లు తనకొరకే కొనుగోలు చేయును; "ఏ" ఆ ఇంటిని 'బీ' కొనుగోలు చేసినాడని కనుగొనిన మీదట, దాని కొరకు, అతడిచ్చిన ధరకు దానిని తనకు విక్రయించవలెనని "ఏ", "బీ"ని బలవంతపెట్టవచ్చును.

217. ఏజెన్సీ వర్తకమును నిర్వహించుటలో ఏజెంటు తాను ఇచ్చిన అడ్వాన్సులు, లేక సముచితముగ భరించిన వ్యయముల విషయమున తనకు రావలసిన సకల మొత్తములను మరియు ఏజెంటుగ వ్యవహరించినందుకై తనకు చెల్లింపదగునట్టి ప్రతిమూల్యమును కూడ అట్టి వర్తకములో యజమాని బాబతున అందిన ఏవేని మొత్తముల నుండి నిలిపి ఉంచుకొనవచ్చును.

యజమాని బాబతున అందిన మొత్తముల నుండి నిలిపి ఉంచుకొనుటకు ఏజెంటుకు గల హక్కు.

218. అట్టి తగ్గింపులకు లోబడి, ఏజెంటు, తన యజమాని బాబతున అందిన మొత్తముల నన్నింటిని అతనికి చెల్లించుటకు బద్ధుడైయుండును.

యజమాని కొరకు అందిన మొత్తములను చెల్లించుట ఏజెంటు కర్తవ్యము.

219. ప్రత్యేకమైన కాంట్రాక్టు ఏదియు లేనప్పుడు, ఏదేని కార్యమును నిర్వర్తించినందుకు చెల్లింపు అట్టి కార్యము పూర్తియగు వరకు ఏజెంటుకు చెల్లించవలసియుండదు; కాని ఏజెంటు, విక్రయింపబడిన సరుకుల బాబతున తనకు అందిన డబ్బును, విక్రయము కొరకై తనకు అప్పగించబడిన సరుకులన్నియు విక్రయింపబడకపోయినప్పటికిని, లేక విక్రయము వాస్తవముగ పూర్తి కాకపోయినప్పటికిని, నిలిపి ఉంచుకొనవచ్చును.

ఏజెంటుకు ప్రతిమూల్యము ఎప్పుడు చెల్లించదగియుండును.

అవకతవకగా నిర్వహించిన వర్తకమునకు ప్రతిమూల్యము పొందుటకు ఏజెంటుకు హక్కు ఉండదు.

220. ఏజెన్సీ వర్తకమును అవకతవకగా నిర్వహించిన ఏజెంటుకు, ఆ వర్తకమునందు అతడు అవకతవకగా నిర్వహించిన భాగము విషయములో ఎట్టి ప్రతిమూల్యమును గాని పొందుటకు హక్కు ఉండదు.

## ఉదాహరణములు

(ఏ) 'సీ' నుండి 1,00,000 రూపాయలు వసూలుచేసి దానిని మంచి ప్రతిభూతిప్తై (సెక్యూరిటీ) పెట్టుటక్తై 'ఏ', 'బీ'ని నియోగించును. 'బీ' ఆ 1,00,000 రూపాయలు వసూలుచేసి 90,000 రూపాయలు మంచి ప్రతిభూతిప్తై (సెక్యూరిటీ) పెట్టును, కాని 10,000 రూపాయలు మంచిదికాదని తాను తెలిసికొని యుండవలసినట్టి ప్రతిభూతిప్తై (సెక్యూరిటీ) పెట్టును, అందువలన 'ఏ' 2,000 రూపాయలు నష్టపోవును. 1,00,000 రూపాయలు వసూలు చేసినందుకు మరియు 90,000 రూపాయలు పెట్టుబడిగా పెట్టినందుకు ప్రతిమూల్యము పొందుటకు 'బీ'కి హక్కు ఉండును. 10,000 రూపాయలను పెట్టుబడిగా పెట్టినందుకు ఎట్టి ప్రతిమూల్యము పొందుటకు గాని అతనికి హక్కు ఉండదు. అతడు 'ఏ'కు కలిగిన 2,000 రూపాయల నష్టమును 'ఏ'కు చెల్లించవలెను.

(బీ) 'సీ' నుండి 1,000 రూపాయలు వసూలు చేయుటక్తై 'ఏ' 'బీ'ని నియోగించును. 'బీ' జరిపిన అవకతవక వలన ఆ డబ్బు వసూలు కాదు. తన సేవలక్తై ఎట్టి ప్రతిమూల్యమును గాని పొందుటకు 'బీ'కి హక్కు ఉండదు. మరియు ఆ నష్టమునక్తై అతడు చెల్లించవలెను.

యజమాని ఆస్తిపై ఏజెంటు ధారణాధికారము.

221. తద్విరుద్ధముగ కాంట్రాక్టు ఏదియు లేనప్పుడు, ఏజెంటుకు అందిన యజమాని యొక్క సరుకులను, పత్రములను, మరియు ఇతర ఆస్తిని - చరాస్తియైనను, స్థిరాస్తియైనను, - వాటి విషయమున కమీషను, బత్వాడాలు మరియు సేవలకుగాను తనకు రావలసిన మొత్తము తనకు చెల్లింపబడువరకు నిలిపి ఉంచుకొనుటకు ఏజెంటుకు హక్కు ఉండును.

## ఏజెంటుపట్ల యజమాని కర్తవ్యము

శాసనసమ్మత కార్యముల వలన కలిగిన పరిణామములకు ఏజెంటు నష్టపూర్తి చేయవలసియుండుట.

222. ఏజెంటు తనకు ఒసగబడిన ప్రాధికారమును వినియోగించుచు చేసిన శాసనసమ్మత కార్యములన్నింటి వలన కలిగిన పరిణామములక్తై అతనికి, అతని యొక్క నష్టపూర్తి చేయవలసియుండును.

## ఉదాహరణములు

(ఏ) సింగపూర్‌లోనున్న 'బీ', కలకత్తాలోనున్న 'ఏ' ఇచ్చిన అనుదేశముల క్రింద, 'సీ'కి నిశ్చిత సరుకులను అందజేయుదునని అతనితో కాంట్రాక్టు చేసుకొనును. 'ఏ', 'బీ'కి సరుకులను పంపడు; కాంట్రాక్టు భంగమునక్తై 'బీ'పై 'సీ' దావావేయును. 'బీ' 'ఏ'కు దావాను గురించి తెలియజేయును; దావాలో ప్రతివాదము చేయుటక్తై 'బీ'కి 'ఏ' ప్రాధికారము ఇచ్చును. 'బీ' దావాలో ప్రతివాదముచేసి హానిపరిహారములను మరియు ఖర్చులను చెల్లించవలసివచ్చును. మరియు వ్యయములను భరించవలసివచ్చును. 'ఏ' అట్టి హానిపరిహారములకు, ఖర్చులకు మరియు వ్యయములకు 'బీ'కి బాధ్యుడైయుండును.

(బీ) కలకత్తాలోని దళారీ అయిన 'బీ' అచ్చటి వర్తకుడైన 'ఏ' ఆదేశముపై 'ఏ' కొరకు 10 పీపాల నూనె కొనుగోలు చేయుటకై 'సీ'తో కాంట్రాక్టు చేసుకొనును. ఆ తదుపరి ఆ నూనె తీసుకొనుటకు 'ఏ' నిరాకరించును; 'సీ', 'బీ'పై దావా వేయును; 'బీ' 'ఏ'కు తెలియజేయును. అతడు ఆ కాంట్రాక్టును పూర్తిగ త్రోసిపుచ్చును. 'బీ' ప్రతివాదము చేయును, కాని నెగ్గడు అతడు హాని పరిహారములను ఖర్చులను చెల్లించవలసివచ్చును, మరియు వ్యయములను భరించ వలసివచ్చును. 'ఏ' అట్టి హానిపరిహారములకు, ఖర్చులకు మరియు వ్యయములకు "బీ"కి బాధ్యుడైయుండును.

223. ఒక వ్యక్తి ఒక కార్యమును చేయుటకై మరొకరిని నియోగించియుండి ఆ ఏజెంటు అట్టి ఆ కార్యమును సద్భావముతో చేసియుండినయెడల, అది అన్య వ్యక్తుల హక్కుకు హాని కలిగించినను నియోక్త ఆ కార్యము వలన కలిగిన పరిణామములకై ఏజెంటుకు నష్టపూర్తి చేయవలసియుండును.

సద్భావముతో చేయబడిన కార్యముల వలన కలిగిన పరిణామములకు ఏజెంటు నష్టపూర్తిచేయవలసియుండుట.

## ఉదాహరణములు

(ఏ) డిక్రీని పొందియుండి 'బీ' యొక్క సరుకులపై అమలు జరుపుటకు హక్కు కలిగియున్న 'ఏ' ఫలాన సరుకులు 'బీ' సరుకులని చెప్పి వాటిని అభిగ్రహించవలెనని న్యాయస్థానపు అధికారిని కోరును. ఆ అధికారి ఆ సరుకులను అభిగ్రహించును. ఆ సరుకుల వాస్తవ సొంతదారైన 'సీ' అతనిపై దావా వేయును. 'ఏ' యొక్క ఆదేశములను పాటించిన పరిణామముగ ఆ అధికారి 'సీ'కి చెల్లించవలసివచ్చిన మొత్తమును 'ఏ' ఆ అధికారికి నష్టపూర్తి చేయవలసియుండును.

(బీ) 'ఏ' స్వాధీనములోనున్న సరుకులను 'ఏ' కోరికపై 'బీ' విక్రయించును. కాని వాటిని వ్యయనము చేయుటకు 'ఏ'కు హక్కులేదు. ఇది 'బీ'కి తెలియక విక్రయ రాబడిని 'ఏ'కు ఇచ్చివేయును. ఆ తదుపరి, సరుకుల వాస్తవ సొంతదారగు 'సీ' 'బీ'పై దావావేసి సరుకుల విలువను మరియు ఖర్చులను వసూలు చేసికొనును. "బీ" 'సీ'కి చెల్లించవలసివచ్చిన దానిని మరియు 'బీ'కి అయిన వ్యయములను అతనికి "ఏ" నష్టపూర్తి చేయవలసియుండును.

224. ఒక వ్యక్తి మరొక వ్యక్తిని ఆపరాధిక కార్యమును చేయుటకై నియోగించినయెడల, ఆ కార్యము వలన కలిగిన పరిణామములకై అతనికి నష్టపూర్తి చేయుదునను అభివ్యక్త, లేక గర్భిత వాగ్దానము ఆధారముపై నియోక్త ఏజెంటుపట్ల బాధ్యుడు కాదు.

ఆపరాధిక కార్యమును చేసినందులకు ఏజెంటుయొక్క నియోక్తకు దాయిత్వము ఉండకుండుట.

## ఉదాహరణములు

(ఏ) 'ఏ' 'సీ'ని కొట్టుటకై 'బీ'ని నియోగించి ఆ కార్యము వలన కలుగు పరిణామములన్నింటికై అతనికి నష్టపూర్తి చేయుటకు ఒప్పుకొనును. అందు మీదట 'బీ' 'సీ'ని కొట్టును; అతడు అట్లు చేసినందుకు 'సీ'కి హానిపరిహారములను చెల్లించవలసివచ్చినది. 'ఏ' ఆ హానిపరిహారముల కొరకు 'బీ'కి నష్టపూర్తి చేయుటకు బాధ్యుడు కాదు.

(బీ) ఒక వార్తాపత్రిక సొంతదారు అగు 'బీ' 'ఏ' కోరికపై ఆ పత్రికలో 'సీ'పై ఒక నిందా లేఖనమును ప్రచురించును మరియు 'ఏ' ఆ

ప్రమరణ వలని పరిణామములకు, తద్విషయమై తీసికొనబడు ఏదేని చర్యకగు ఖర్చులు మరియు హానిపరిహారములన్నింటికై 'బీ'కి నష్టపూర్తి చేయుటకు ఒప్పుకొనును. 'బీ'పై 'సీ' దావావేయును. అతడు హానిపరిహారములను చెల్లించ వలసివచ్చును మరియు వ్యయములను కూడ భరించవలసివచ్చును. 'ఏ' నష్టపూర్తి చేయుదునను వాగ్దానము ఆధారముపై 'బీ'పట్ల బాధ్యుడు కాడు.

యజమాని నిర్లక్ష్యము వలన కలిగిన హానికొరకై ఏజెంటుకు నష్టపరిహారము.

225. యజమాని నిర్లక్ష్యము వలన గాని, కౌశలము లేకుండుట వలన గాని ఏజెంటుకు కలిగిన హాని విషయమున యజమాని ఏజెంటుకు నష్టపరిహారమును చెల్లించవలెను.

<u>ఉదాహరణము</u>

'ఏ' ఒక ఇల్లు కట్టుటకు తాపీ మేస్త్రీగా "బీ"ని నియోగించి తానే పరంజు మంచె కట్టును. ఆ పరంజు కౌశలముతో కట్టబడలేదు. తత్పరిణామముగ "బీ"కి ఘాతకలుగును. "బీ"కి 'ఏ' నష్టపరిహారము చెల్లించవలెను.

<u>అన్య వ్యక్తులతో చేసుకొనబడు కాంట్రాక్టులపై ఏజెన్సీ ప్రభావము</u>

ఏజెంటుయొక్క కాంట్రాక్టులను అమలు చేయించుట మరియు వాటి పరిణామములు.

226. ఏజెంటు ద్వారా చేసుకొనబడిన కాంట్రాక్టులను మరియు ఏజెంటుచే చేయబడిన కార్యముల నుండి ఉత్పన్నమగు బాధ్యతలను స్వయముగ యాజమానియే ఆ కాంట్రాక్టులను చేసుకొనియుండిన, ఆ కార్యములను చేసియుండిన ఎట్లో అట్ల అదే రీతిలో, అమలు చేయించవచ్చును మరియు వాటి శాసనిక పరిణామములు కూడ అట్లే ఉండును.

<u>ఉదాహరణములు</u>

(ఏ) "ఏ" "బీ" నుండి సరుకులను, వాటి యజమాని ఎవరో తెలియకుండ ఆ సరుకుల విక్రియమునకు 'బీ' ఏజెంటు అని తెలిసియుండి, కొనుగోలు చేయును. 'బీ' యొక్క యజమాని ఆ సరుకుల విలువను 'ఏ' నుండి క్లెయిము చేయుటకు హక్కు కలిగిన వ్యక్తియైయుండును; మరియు యజమాని వేసిన దావాలో 'ఏ' ఆ క్లెయిమునకు గాను, 'బీ' నుండి తనకు రావలసిన ఋణమును ముజరా చేయలేడు.

(బీ) 'బీ' యొక్క ఏజెంటైన 'ఏ', అతని తరఫున డబ్బు తీసుకొను ప్రాధికారము కలిగియుండి 'బీ'కి రావలసిన డబ్బు మొత్తము 'సీ' నుండి తీసి కొనును. ఆ మొత్తమును 'బీ'కి చెల్లించు బాధ్యత నుండి 'సీ' ఉన్మోచితు డగును.

ఏజెంటు, ప్రాధికారమును మీరినప్పుడు యజమాని ఎంతవరకు బద్ధుడగును.

227. ఏజెంటు చేయుటకు అతనికి గల ప్రాధికారమును మించి చేసినప్పుడు, అతడు చేసిన దానిలో అతనికి గల ప్రాధికారము లోనికివచ్చు భాగమును అతనికి గల ప్రాధికారమును మించి చేసిన భాగము నుండి వేరుచేయుటకు వీలున్నప్పుడు, అతడు చేసిన దానిలో అతనికి గల ప్రాధికారము లోపల ఉన్నంత మాత్రమే, అతనికి మరియు అతని యజమానికి సంబంధించినంత వరకు వారిని బద్ధులను చేయునదగును.

ఉదాహరణము

ఓడ మరియు అందలి సరుకుకు సొంతదారైన 'ఏ' ఆ ఓడపై 4000 రూపాయలకు బీమా చేయుటకు 'బీ'కి ప్రాధికారమొసగును. 'బీ' ఓడపై 4000 రూపాయలకు ఒక బీమాపాలసీని మరియు ఓడ సరుకుపై అదే మొత్తమునకు మరొక పాలసీని తీసికొనును. 'ఏ' ఓడపై పాలసీ కొరకు మాత్రమే ప్రీమియమును చెల్లించుటకు బద్ధుడైయుండును. కాని ఆ సరుకులపై పాలసీ కొరకైన ప్రీమి యమును కాదు.

228. ఏజెంటు అతనికిచ్చిన ప్రాధికారమును మించి చేసియుండి, అతని ప్రాధికార పరిమితిని దాటి అతడు చేసినది, అట్టి ప్రాధికారము లోపలనున్న దాని నుండి వేరుచేయలేనిదైనయెడల యజమాని ఆ వ్యవహారమును గుర్తించుటకు బద్ధుడుకాడు. ఏజెంటుయొక్క ప్రాధికారమును మీరినది వేరు చేయలేనిదై నప్పుడు యజమాని బద్ధుడుకాడు.

ఉదాహరణము

'ఏ' తన కొరకు 500 గొర్రెలను కొనుగోలు చేయుటకు "బీ"కి ప్రాధికార మొసగును. 'బీ' 500 గొర్రెలను మరియు 200 గొర్రెపిల్లలను 6000 రూపాయల మొత్తమునకు కొనుగోలు చేయును. 'ఏ' మొత్తము వ్యవహారమును తోసిపుచ్చ వచ్చును.

229. ఏజెంటుకు ఈయబడిన ఏదేని నోటీసు, లేక అతనిచే పొందబడిన సమాచారము, అతడు యజమాని కొరకు చేసిన వర్తక సరళిలో, ఆ నోటీసు ఈయ బడినదో లేక పొందబడినదో, యజమానికి మరియు అన్య పక్షకారులకు సంబం ధించినంత వరకు దాని శాసనబద్ధ పరిణామములు అది యజమానికే ఈయబడి యుండిన, లేక అతనిచే పొందబడియుండిన ఎట్లో అట్లే ఉండును. ఏజెంటుకు ఇచ్చిన నోటీసు వలన కలిగిన పరిణామములు.

ఉదాహరణములు

(ఏ) నిశ్చిత సరుకుల దృశ్యమాన సొంతదారైన 'సీ' నుండి వాటిని కొనుగోలు చేయుటకై 'బీ'చే 'ఏ' నియోగింపబడి వాటిని తదనుసారముగా కొనుగోలు చేయును. విక్రయపు మంతన సరళిలో ఆ సరుకులు వాస్తవముగ 'డీ'కి చెందినవని 'ఏ' తెలిసికొనును. కాని ఆ సంగతి 'బీ'కి తెలియదు. 'సీ' నుండి తనకు రావలసిన ఋణమును ఆ సరుకుల ధరకు గాను ముజరా చేయుటకు "బీ"కి హక్కు ఉండదు.

(బీ) సరుకుల దృశ్యమాన సొంతదారైన 'సీ' నుండి వాటిని కొనుగోలు చేయుటకై 'బీ'చే 'ఏ' నియోగింపబడినాడు. "ఏ" అట్లు నియోగింపబడుటకు పూర్వము 'సీ'కి సేవకుడైయుండెను. అప్పుడు సరుకులు వాస్తవముగ 'డీ'కి చెందినవని అతడు తెలుసుకొనియుండెను, కాని ఆ సంగతి "బీ"కి తెలియదు. తన ఏజెంటుకు ఆ సంగతి తెలిసియున్నప్పటికినీ "బీ" తనకు 'సీ' నుండి రావలసిన ఋణమును ఆ సరుకుల ధరకు గాను ముజరా చేయువచ్చును.

**యజమాని తరఫున చేసికొనిన కాంట్రాక్టులను ఏజెంటు స్వయముగా అమలు చేయించలేడు మరియు అట్టి కాంట్రాక్టులకు స్వయముగా బద్ధుడుకాడు.**

230. అట్టి కాంట్రాక్టు ఏదియు లేనప్పుడు, ఏజెంటు తన యజమాని తరఫున తాను చేసికొనిన కాంట్రాక్టులను స్వయముగ అమలు చేయించలేడు, మరియు వాటికి స్వయముగ బద్ధుడుకాడు.

**తద్విరుద్ధమైన కాంట్రాక్టు ఉన్నదను పురోభావన.**

ఈ క్రింది సందర్భములలో అట్టి కాంట్రాక్టు ఉన్నదని పురోభావన చేయవలెను:—

(1) విదేశ వాసియైన వర్తకుని కొరకు సరుకులను విక్రయించుట లేక కొనుగోలు చేయుట కొరకై ఏజెంటుచే కాంట్రాక్టు చేసుకొనబడినయెడల;

(2) ఏజెంటు తన యజమాని పేరును వెల్లడించనియెడల;

(3) వెల్లడించినను యజమానిపై దావా వేయుజాలనియెడల.

**వెల్లడింపబడని ఏజెంటు చేసుకొనిన కాంట్రాక్టు పక్షకారుల హక్కులు.**

231. ఒక ఏజెంటు, అతడు ఏజెంటని తెలియని, లేదా ఏజెంటని అనుమానించుటకు కారణములేని వ్యక్తితో కాంట్రాక్టు చేసుకొనినచో, అతని యజమాని కాంట్రాక్టును నిర్వర్తించుమని కోరవచ్చును; కాని కాంట్రాక్టు యొక్క ఇతర పక్షకారు, ఏజెంటే యజమానియైయుండినచో ఏజెంటుపై కలిగియుండెడు హక్కులనే యజమానిపై కలిగియుండును.

కాంట్రాక్టు పూర్తియగుటకు పూర్వము యజమాని తనను వెల్లడించుకొనినచో, ఆ కాంట్రాక్టు యొక్క ఇతర పక్షకారు, కాంట్రాక్టులోని యజమాని ఎవరో తనకు తెలిసియుండినచో, లేక ఏజెంటు యజమాని కాడని తనకు తెలిసియుండినచో తాను ఆ కాంట్రాక్టు చేసుకొనియుండెడి వాడను కాడని చూపగలిగినచో, ఆ కాంట్రాక్టును పూర్తి చేయుటకు నిరాకరించవచ్చును.

**యజమాని అని అనుకొనిన ఏజెంటుతో చేసుకొనబడిన కాంట్రాక్టును నిర్వర్తింపుట.**

232. ఒక వ్యక్తి మరొకరితో, అతడు ఏజెంటని తెలియక, లేక అనుమానించుటకు యుక్తమైన కారణము లేనందున కాంట్రాక్టు చేసుకొనినయెడల, యజమాని, ఆ కాంట్రాక్టును నిర్వర్తించవలెనని కోరినచో, అతడు అట్టి నిర్వర్తనను ఏజెంటు మరియు కాంట్రాక్టు యొక్క ఇతర పక్షకారు మధ్యగల హక్కులకు మరియు బాధ్యతలకు లోబడి మాత్రమే నిర్వర్తింపచేయగలడు.

<u>ఉదాహరణము</u>

'బీ'కి 500 రూపాయలు బాకీ ఉండిన 'ఏ' 1000 రూపాయల ఖరీదుగల బియ్యమును 'బీ'కి విక్రయించును. ఆ వ్యవహారములో 'ఏ' 'సీ'కి ఏజెంటుగా వ్యవహరించుచున్నాడు. కాని ఆ వ్యవహారము అట్టిదని 'బీ'కి తెలియదు; లేక అట్టిదని అతడు అనుమానించుటకు యుక్తమైన కారణము లేదు. 'సీ' 'ఏ' యొక్క ఋణమును ముజరా చేయుటకు 'బీ'ని అనుమతించకుండ ఆ బియ్యమును తీసుకొనవలసినదిగ అతనిని బలవంతపెట్టలేడు.

**స్వయముగ బాధ్యుడగు ఏజెంటుతో వ్యవహరించు వ్యక్తియొక్క హక్కు.**

233. ఏజెంటే స్వయముగ బాధ్యుడైయుండిన సందర్భములలో, అతనితో వ్యవహరించు వ్యక్తి అతనిని గాని, అతని యజమానిని గాని, ఇద్దరిని గాని బాధ్యులను చేయవచ్చును.

## ఉదాహరణము

'ఏ' 100 బేళ్ల దూదిని "బీ"కి విక్రయించుటకు 'బీ'తో కాంట్రాక్టు చేసుకొని ఆ తరువాత 'బీ' 'సీ'కి ఏజెంటుగ వ్యవహరించుచుండెనని తెలిసికొనును. 'ఏ' ఆ దూది ధర కొరకు 'బీ'పైగాని, 'సీ'పైగాని, ఇద్దరిపైగాని దావా వేయవచ్చును.

ఏజెంటును లేక యజమానిని కేవలము యజమానియే లేక ఏజెంటే బాధ్యుడుగా చేయబడునను విశ్వాసముతో వ్యవహరించునట్లు చేసినందుకు పరిణామములు.

234. ఏజెంటుతో కాంట్రాక్టు చేసుకొనిన వ్యక్తి, ఏజెంటును యజమాని మాత్రమే బాధ్యుడుగా చేయబడునను విశ్వాసముతో వ్యవహరించునట్లు చేసినప్పుడు, లేక యజమానిని ఏజెంటు మాత్రమే బాధ్యుడుగా చేయబడునను విశ్వాసముతో వ్యవహరించునట్లు చేసినప్పుడు, అతడు ఆ తరువాత క్రమముగా ఏజెంటును గాని, యజమానిని గాని బాధ్యుని చేయలేడు.

బూటకపు ఏజెంటు యొక్క దాయిత్వము.

235. తాను మరొకరి ప్రాధికృత ఏజెంటునని అబద్ధము చెప్పి అన్య వ్యక్తిని అట్టి ఏజెంటుగా తనతో వ్యవహరించునట్లు చేయు వ్యక్తి, తన నియోక్త అని అతడు చెప్పుచూనిన వ్యక్తి అతని కార్యములను అనంతరము సమర్థించనిచో అట్లు వ్యవహరించుటవలన ఆ అన్య వ్యక్తికి కలిగిన ఏదేని నష్టము, లేక చెరుపు విషయమున అతనికి నష్టపరిహారము చెల్లించవలసియుండును.

ఏజెంటునని తప్పుడుగ కాంట్రాక్టు చేసుకొను వ్యక్తి నిర్వర్తనకు హక్కు కలిగియుండడు.

236. ఏజెంటు హోదాలో ఎవరితో కాంట్రాక్టు చేసుకొనబడినదో ఆ వ్యక్తి వాస్తవముగ ఏజెంటుగ కాక తన స్వంత బాబతుననే వ్యవహరించియుండినచో, దానిని నిర్వర్తించవలెనని కోరుటకు అతనికి హక్కు ఉండదు.

ఏజెంటు యొక్క అప్రాధికృత కార్యములను ప్రాధికృతమైనవను విశ్వాసమును కలిగించు యజమాని యొక్క దాయిత్వము.

237. ఏజెంటు, ప్రాధికారము లేకుండ తన యజమాని తరఫున కార్యములు చేసినప్పుడు; లేక అన్య వ్యక్తులపట్ల బాధ్యతలను వహించినప్పుడు, యజమాని తన మాటల ద్వారానైనను, నడవడి ద్వారానైనను అట్టి కార్యములు మరియు బాధ్యతలు ఏజెంటు యొక్క ప్రాధికారపు పరిమితిలోనున్నవని అట్టి అన్య వ్యక్తులు విశ్వసించునట్లు చేసియుండినచో అతడు అట్టి కార్యములకు, లేక బాధ్యతలకు బద్ధుడైయుండును.

## ఉదాహరణములు

(ఏ) 'ఏ' విక్రయమునకై 'బీ'కి సరుకులను అప్పగించి నియత ధర కంటె తక్కువకు విక్రయించవద్దని అతనికి అనుదేశములనిచ్చును. 'బీ' ఇచ్చిన అనుదేశములను గురించి తెలియని 'సీ' ఆ సరుకులను అట్టి నియత ధర కంటె తక్కువ ధరకు కొనుగోలు చేయుటకు 'బీ'తో కాంట్రాక్టు చేసుకొనును. 'ఏ' కాంట్రాక్టుకు బద్ధుడైయుండును.

(బీ) 'ఏ' నిరంక పృష్ఠాంకనముగల పరక్రామ్య పత్రములను 'బీ'కి అప్పగించును. 'బీ' 'ఏ' యొక్క అంతరంగిక ఉత్తరువులను ఉల్లంఘించి వాటిని 'సీ'కి విక్రయించును. విక్రయము సరియైనదగును.

కర్తారుపై, ఏజెంటుచేసిన అసత్యకథనము లేక కపటము యొక్క ప్రభావము.

238. ఏజెంట్లు తమ యజమానుల కొరకు తమ వర్తకసరళిలో చేసిన అసత్యకథనములు లేక కపటములు, యజమానులచే చేయబడియుండిన ఎట్లో అట్లే, అట్టి ఏజెంట్లచే చేసుకొనబడిన కరారులపై ప్రభావము కలిగియుండును. కాని ఏజెంట్లు తమ ప్రాధికార పరిధిలోనికి రాని విషయములలో చేసిన అసత్యకథనముల లేక కపటముల ప్రభావము తమ యజమానులపై ఉండదు.

## ఉదాహరణములు

(ఏ) సరుకుల విక్రయము కొరకు 'బీ' యొక్క ఏజెంటైన 'ఏ' చేయుటకు తనకు 'బీ'చే ప్రాధికారములేనట్టి అసత్యకథనముచేసి 'సీ'ని అట్టి సరుకులను కొనుగోలు చేయునట్లు చేయును. ఆ కాంట్రాక్టు 'బీ' మరియు 'సీ' లకు సంబంధించినంతవరకు 'సీ' అభిమతానుసారము చెల్లనిదిగ చేయదగినదగును.

(బీ) 'బీ' యొక్క ఓడకు కెప్టెను అయిన 'ఏ', వహనపత్రములపై వాటిలో పేర్కొనిన సరుకులను ఓడలోనికి తీసికొనకుండనే సంతకము చేయును. 'బీ' మరియు భాటకపు రవాణాకర్తకు సంబంధించినంతవరకు ఆ వహనపత్రములు చెల్లవు.

11వ అధ్యాయము - (భాగస్వామ్యమును గూర్చి) భారత భాగస్వామ్య 1932లో 9వది. చట్టము, 1932 యొక్క పరిచ్ఛేదము 73 మరియు అనుసూచి 2 ద్వారా రద్దు చేయబడినది.

అనుసూచి - (అనుశాసనములు రద్దు చేయబడినవి) రద్దు మరియు సవరణ 1914లో 10వది. చట్టము, 1914 యొక్క పరిచ్ఛేదము 3 మరియు అనుసూచి 2 ద్వారా. రద్దు చేయబడినది.